



గురువులు


ఆదిశంకరాచార్య

శివానందలహరి, భ్రమరాంబ అష్టకం








సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి. కనుక తమవంతుగా భక్తి,జ్ఞాన ప్రచారార్ధం మహానుభావులైన **గీతా దీక్ష** వెబ్ సైట్ వారు ఉచితంగా విలువైన గ్రంధాలను ఆన్ లైన్ ద్వారా eBOOK(PDF) రూపంలో అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in),మైక్రోసాఫ్ట్ సైట్(http://www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) **గీతా దీక్ష** వారి వెబ్ సైట్: http://www.geetadeeksha.com
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com
సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement
సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంద వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.

SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

గీతా దీక్ష వారి వెబ్ సైట్:

http://www.geetadeeksha.com



అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఋజుసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శివానందలహరి

మరియు

భ్రమరాంబాష్టకమ్



ఆదిశంకరుల సంస్కృత మూలమునకు
తెలుగు పద్య తాత్పర్య అనువాదం

రచన ః
అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech.



సతీ సమేత అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

Address :

Flat No.5; Plot 61,

Siddardha Apartments,

Siddardha Nagar,

Hyderabad - 500 038, A.P, India

E-Mail : deekshitulu_a@yhaoo.com

Mobile : 9393021360

Website: http://www.geetadeeksha.com/

శివానందలహరి

మరియు

భ్రమరాంబాష్టకమ్



ఆది శంకరుల సంస్కృత మూలమునకు
తెలుగు పద్య తాత్పర్య అనువాదం

రచన :
అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech.

శివానందలహరి మరియు భ్రమరాంబష్టకమ్

మొదటి ప్రచురణ
జులై 2008

రచన
అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech.

వెల : అమూల్యం

ప్రతులకు :
ప్లాట్ నెం. 5, ప్లాట్ నెం.61, సిద్ధార్థ నగర్,
హైదరాబాద్ - 38. ఫోన్ : 040-23814379

డి.టి.పి. & ప్రింటింగ్ :
కె. మురళీ కృష్ణ
9848515109

ప్రార్థన

కం॥ శ్రీలతొా యొప్పెడి హిమగిరి
బాలను పెండ్లాడి జగతి పాలించుటకై
మేలుగ సగపాలిచ్చెను
ఫాలాక్షుడు మేనిలోన, ప్రార్థింతు శివున్

మ॥ నరుడే నారి యనెంచు వారు ధరలో నారాయణున్
మెచ్చుచున్
సిరికిన్ గుండెలొా స్థానమిచ్చెననుచున్ చేయెత్తి
మ్రొక్కేరు, ఈ
శ్వరునిన్ జూడరు చిత్రమాయె నవురా! శంభుండు
తా నంబకున్
మురియన్ అర్ధ శరీరమిచ్చె తనలో మున్ముందు
తన్నెంచెదన్

సీ॥ కఫము గొంతున బట్టి కన్నీరు కాల్వలై
కాపాడమనలేరు గరళకంఠు
మాట రాకుండుచో మన్నింపు మీశ్వరా!
అనలేరు కన్నులున్ కానరావు
స్పృహ దప్పుచుండగా చేయెత్తి పశుపతిన్
మ్రొక్కంగ లేరురా మూఢ! వినర
చితి జేర్చబోవుచో శివ శివ యనుటెట్లు?
చింతించి లాభమావంత లేదు

ఆ॥ ప్రేత రూపమొచ్చి భూతనాథుని జేర
శిక్ష తప్పదాయె చేర్చు యముని
జన్మ మరలయెత్తి జనని చన్గుడుచుచు
ఏడ్పు మొదలు దీనికేది అంతు?

ఉ॥ కోట్లకు మించి సంపదలు కోరిక దీరగ
కూడబెట్టి తా
మెట్లయినన్ పురాధిపుల నెన్నిక యౌటకు
పాపరాశులన్
పుట్లుగ జేసి 'వైతరణి పుండ్ల రసిన్' తము
తాళలేక, మ
మ్మెట్లయినన్ కృపన్ గనుము ఈశ్వర! అందురు
నాడుయేమవున్?

తే॥ అసురులందరు హరు గొల్వ ఆర్తితోడ
కారణంబేమొ తెలియరే పరమ శివుడు
భక్త సులభుడు దయగను బాపినైన
పలుక శంభో శివాయని వదలకుండ.

ఆ॥ ఆలు బిడ్డలకును అమరించి సిరులన్ని
తమకు జేసికొనరు ధరణి నరులు
రేపు చూతమందురే కాని ముక్కంటి
శరణు కోరరయ్యె! జ్ఞానమెరిగి.

కం॥ సౌందర్యలహరి జెప్పుచు
సుందరి జగదంబ గొల్వ జూచితి కానీ
అందుకు అర్హుడనా! యని
సందేహముతోటి జేయ సాహసమున్, నే

ఆ॥ అమ్మ! క్షమను వేడి అందించుచుంటిని
'భ్రమర' అష్టకంబు పద్యమందు
విందు అనుచు బిలిచి అందించుటాయెగా
జలము ద్రాప తల్లి! శరణు శరణు

శ్లో॥ సదాశివ సమారంభాం శంకరాచార్య మధ్యమాం।
అస్మదాచార్య పర్యంతాం వందే గురుం పరంపరా॥

తే॥ ఆదినా సదా శివుడుండె ఆదిగురుడు,
ఆదిశంకరుండున్ మధ్యమందు నిలిచె
అలరె చివరిగా నాగురులైన 'ఘనులు'
పరమగురు పరంపరకివే వందనములు

తా॥ ఆదిగురులైన ఆ సదా శివుడు మొట్టమొదటి వాడు. ఆది శంకరాచార్యుల వారు మధ్య స్థానంలో నిలిచి యున్నారు. నాకు జ్ఞానమిచ్చిన వారు గురు స్థానంలో మూడవ స్థానంలో ఉన్నారు. ఆ గురు పరంపరకివే నమోవాకములు.

ముందుమాట

అర్జునుడు పరమేశ్వరుడైన శంకరుని ప్రియ భక్తుడు. శంకరుడంతటి వాడితో ఢీకొని మెప్పించి పాశుపతాస్త్రం సాధించాడు. భారతయుద్ధంలో శ్రీకృష్ణపరమాత్మచేత స్వయంగా భగవద్గీత విని ఆ స్వామి విశ్వరూపాన్ని సందర్శించాడు.

ఇంతచేసి కామక్రోధ వశుడవటం చేత మానవ జన్మయెత్తక తప్పలేదు. కాని ఆ ఆటవికుడు తిన్నడిలోని అర్జునుడు జన్మ సహజమైన వీరత్వంతో పుట్టాడు. ఎవ్వరి మాట వినని జగమొండి అయ్యాడు. “దేవుడే లేదు లేదంచు దూషించు దుష్టాత్మ....”డై పోయాడు. కొన్నాళ్ళట్లా తిరిగాక ఒకనాడు ఆ పరమేశ్వరుని కృపగలిగి, శ్రీకాళహస్తి అడవుల్లో ఒక లింగరూపంలో తారసపడ్డాడు. ఆ బోయ తిన్నడికి లింగాన్ని ఆలింగనం చేసుకోవాలన్నంత ప్రేమ కలిగింది. ఇక ఆ శివుడే అతనిలోకం. వేడి వేడి మాంసం ముక్కలు ఆహారంగా పెట్టాడు. జోలలు పాడాడు. పుక్కిటి

నీళ్ళతో స్నానం చేయించాడు. అడవి పూలతో అలంకరించాడు. అప్పుడు ఆ ముక్కంటికి ఆ జీవాత్మనుద్ధరించాలనిపించింది. శివలింగానికి రెండు కన్నులు అమరినాయి.

అపరమితంగా సంతోషించాడు తిన్నడు. కాని ఆ సంతోషం రెండు మూడు రోజులే. ఒకనాడు చల్లని ఆ రెండు కన్నులలోని ఒక దాంట్లోంచి నెత్తురు కారటం మొదలు పెట్టింది. కన్నీరు మున్నీరయ్యాక తిన్నడు వైద్యం మొదలు పెట్టాడు. కంటికి కన్నే మందు అని నమ్మే ఆటవికుడు తన కన్ను బాణంతో పెరుక్కుని ఆ కన్నీరు కార్చే కంటికి అతికించాడు. అది అతుక్కోవటమే కాక రక్తం కారటం ఆగిపోయింది. మరి శివుడు అంతటితో ఊరుకుంటాడా?

రెండవ కంట్లోంచి రక్తం కారటం మొదలయ్యింది. తన రెండవ కన్ను కూడా పీకి అతికించటానికి సిద్ధమయ్యాడు. కాని తీరా ఆ మిగిలిన కన్ను పీకితే తను అంధుడై ఆ కన్ను ఎక్కడ అతికిస్తాడు? భగవంతుడు తప్ప

అన్యమేదీ అక్కరలేదు. ఆ తిన్నడు తనకాలి బొటనవేలితో శివుని కంటి కింద నొక్కిపట్టి కన్ను పీక్కుని కబోదియై హరహర మహదేవ! అంటూ ఆ కంటికి తన కన్ను అతికించాడు. చదువుతుంటే మనకే కన్నీరాగటం లేదే. ఇక ఆ దయా సింధుడికి గుండె కరుగదా? తక్షణం గౌరీ సమేతుడై ఆ అర్జునుని ఆత్మకు శివసాయుజ్యాన్నిచ్చాడు. తిన్నప్పు కన్నప్పగా శివభక్తాగ్ర గణ్యుడయ్యాడు.

ఇదే కోవలో నాలాంటి మూఢునికి కూడా శివకారుణ్యం చేత పరమేశ్వరునిపై ప్రీతి కలిగింది. కవిత్వం చెప్పగల శక్తి వచ్చింది. సన్మిత్రుల సాంగత్యం దొరికింది. వారి సహాయంతో ఎన్నో మంచిస్తోత్రాలు చదివి పద్య రూపంలో మలచి పుస్తక రూపంలో వెలువరించి ఆ పరంధాముని దయపొందటానికి యత్నిస్తున్నాను.

శివానందలహరి చేత ఆకర్షించబడి దానిని పద్యరూపంలో మలిచాను. బుధ జనులకు తేలికగా అర్థమయ్యే తెలుగులో, ఎక్కువగా సీసపద్యాల నెన్నుకుని నా ప్రయత్నం నెరవేర్చాను. నా ఉద్దేశ్యంలో ఈ పద్యాలకు తాత్పర్యం వ్రాస్తే పిల్లిని, మార్జాలం అన్నట్లుంటుంది.

అందుకని వద్దనుకున్నాను. కానీ ఆలోచించిన మీదట శ్లోకానికి పెద్దలు చెప్పిన తాత్పర్యం కొంత తేలిక భాషలో వ్రాస్తే పద్యంలో యతిగణాల సౌలభ్యం కోసం చెప్పని (చెప్పలేని) సునిశిత అంశాలను అందించవచ్చనే ఆలోచనతో ప్రతి పద్యానికి తాత్పర్యం జతకూర్చటం జరిగింది.

ఆదిశంకరుల చమత్కారాలున్నచోట విశేష వ్యాఖ్య నీయటం కూడా జరిగింది. నేను సంస్కృతం చదువుకోక పోవటంవల్ల సహజమైన భాషాదోషాలు దొర్లుతుంటాయి. అరవైయ్యేళ్ళొచ్చాక అక్షరాలు నేర్చుకుంటా నన్నాట్ట వెనుకటి కొకడు. అట్లాగే 61 ఏళ్ళు వచ్చాయి. ఇక ఇప్పుడు సంస్కృతం ఎట్లా నేర్చుకుంటాను? పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అంటారు. నిజమే కానీ నాలాంటి వాడికి అది తలకి మించిన భారం. ఈ జన్మకింతే. ఎప్పుడో చదువుకున్న ఛందస్సు భగవత్కృపవల్ల మనస్సు లోతుల్లోంచి చీల్చుకుని వచ్చి పద్యరూపంలో వర్షించ సాగింది.

ఎన్నో ప్రఖ్యాతమైన స్తోత్రాలను పద్యరూపంలో మార్చాను. శ్రీమద్భగవద్గీతనుంచి జ్ఞానదేవుని అభంగాలవరకు అందించాను. అదే నాదైవారాధన. మిత్రులు ఎంతో సహాయం చేస్తున్నారు.

ఒక వెబ్‌సైట్‌లో నా పుస్తకాలన్నీ పెట్టాను. దానిపేరు **www.geetadeeksha.com** ఎవరైనా చదువుకోవచ్చు ప్రింట్ తీసుకోవచ్చు.ఇప్పుడీ శివానందలహరిని పద్యరూపంలో చేయటం మహేశ్వరుని కృపగాక ఇతరమేమైనా ఉంటుందా? ఉండజాలదు.

ఏశ్లోకానికి ఏ పద్యం వాడాలి, ఏ మాటలు కూర్చాలి ఇవన్నీ ఆలోచనవల్ల వస్తున్నాయా? కాదు. అది మానసాకాశంలో ఈశ్వర కృపామేఘాలు వర్షించటం వల్ల మెరుపు తళుక్కుమని అనిపిస్తుంది. ఆధునికులు “ఐడియా” అంటున్నది, నిజానికి మానసాకాశంలో దైవకృపావర్షమే. ఆశువుగా ఈక్షణంలో స్ఫురించిన ఈ పద్యం చూడండి. దైవకృప ఎలా ఉంటుందంటే....

చంII అదియొక వానజల్లువలె ఆకసమందున మబ్బు
లేకయే
ముదమును కూర్చు వర్షమగు, మానస వీణియ
మీటు తీయగా,
కుదురును దైవ సత్కృపయు, కూడగ అప్పుడు
మూర్ఖుడైననున్
మదిపులకింప జేవగల మంచి కవిత్వము జెప్పు,
చోద్యమా?

రాభణుడు, బిద్దె (రావణుడు, విద్య) అన్న వెర్రి గొల్లవాడు మహాకవి కాళిదాసు అయ్యాడు. శివశక్తులకు తేడాలేనేలేదు. అందుకని పరమేశ్వరుని కృప ఉంటేనే పద్యం చెప్పగలం. ఆపైన పూర్వజన్మ వాసన ఉండాలి. అందువల్ల సృజనాత్మకత వస్తుంది. అప్పుడు కొందరు పాటలు, కొందరు కథలు, కొందరు సంభాషణలుగల నాటకం, కొందరు పద్యకవిత్వం వ్రాయగలుగుతారు. ఈశ్వర కృపలేక వ్రాయలేరు. అనాదిగా గణేశ్వరుని, సరస్వతీదేవిని అందుకే ధ్యానం చేసే వారు.

ఈ శివానందలహరిని ఆదిశంకరులు శ్రీశైల మల్లికార్జునుని మనస్సులో నిలుపుకుని చెప్పారనటానికి 50 మరియు 51 సంఖ్యగల శ్లోకాలే సాక్ష్యం. ఆదిశంకరులు ఆసువుగా అక్కడికక్కడే స్వామి సన్నిధిలో చెప్పి ఉంటారు.

ఏది ఏమయినా ఆ దివ్య స్తోత్రాన్ని తెలుగు పద్యములలో చెప్పగలగటం నా పూర్వజన్మ సుకృతం.

కంII కృతినిటుజెప్పుట సుకృతము
కృతకృత్యుడనౌట శివుని కృపజేతగదా!
కృతకము అన్యము నాప్ర
కృతికది సరిపోదు నాదు కృతిభర్తతడే.

ఈ పుస్తకం వెలుగు చూడటానికి ప్రత్యక్షకారకులైన శ్రీ కటకము పురుషోత్తంగారికి పరోక్షంగా కారకులైన శ్రీబాదామి జయరామగుప్త గారికి నా కృతజ్ఞతా పూర్వక పాదాబివందనములు.

ఆకాంక్ష

మహాజ్ఞాని అయిన ఆది శంకరులే మహాదేవుని యెదుట తన వినయమును, అల్పత్వమును ప్రకటించు కున్నారు. 'స్మృతౌ శాస్త్రే వైద్యే స్తుతి నటన హాస్యే ష్వచతురః ' అన్నారు. దీక్షితులుగారు కూడ వినయంతో 'పాండిత్యము లేదు వ్యాకరణమూ రాదు. దేవభాషా గరిమ తెలియనైతి' అని చెప్పుకొని ఈ గ్రంధ రచనకు పూనుకొన్నారు. గొప్ప సాహస కృత్యమే కాని గుండెనిండా భక్తి, బుద్ధి శివునియందు నిల్చియుండగా కొరత యెక్కడిది? అనేక మార్లు శ్లోకములకు పద్యరూపాన్నిచ్చినపుడు ఒకపదము, పదబంధము ఎట్లా ప్రయోగించాను? నాకు ఇంతకుముందు ఇవి తెలియవే? అని మనస్ఫూర్తిగా అంటూ ఉండేవారు. శివకృప ఉంటే స్ఫురణ, అలాగే సిద్ధిస్తుంది అని నేను అనేవాణ్ణి. అలాగే 'శివానందలహరి' కావ్యం మొత్తము తెలుగు సేత శివావేశము కల్గినట్లుగా

పూర్తిచేశారు. అతి సన్నిహితముగా గమనించిన నాకు ఎప్పటికప్పుడు పరమాశ్చర్యము కలుగుతూ ఉండేది. గొప్ప పాండిత్య ప్రకర్ష లేకపోయినా శివభక్తితో తడిసి ముద్ద అయినటువంటి ఆర్తి మనకు ప్రతి పద్యంలోను గోచరిస్తుంది.

"మీమాంసలివియన్ని యముని దప్పించునా? వ్యర్థకంఠ శోష వదలమేలు,

సుమతి! శంభునిపై భక్తి చొక్కి నీవు
హరుని పాదపద్మమ్ముల నార్తిమ్రొక్కి
శివుని భజింప మేల్గాదె శీఘ్రగతిని"

అంటారు ఒకచోట. మరొకచోట పూజా పుష్పాలకై ఎక్కడెక్కడో వెతుకుతాడు కానీ, నీకై ఒకే ఒక మనసు అనెడి సుమము నర్పణజేయుచు సుఖమునొంది స్థిరముగా నుండు భువిలోన నెరుగడయ్యె! ఏమి ఆశ్చర్యమో ప్రభూ! హే మహేశా! అంటారు.

దీనరక్షా నిపుణుడీవు, దీనుడేను
శరణమిచ్చెడి దాతలు మీరుగాక
మూడు లోకాల వెదకినా తోడెవండు
వేరు ఎవ్వరూ లేరయ్యా మీరు గాక

అని పరమేశ్వరుణ్ణి శరణు వేడుతారు.

తేట తెలుగులో పద్యావేశంతో మూలానికి సన్నిహితంగా వ్రాసిన ఈ అనుసరణ కావ్యంలో ఉత్కృష్టంగా అనిపించే పద్యాలెన్నో ఉన్నాయి. ఉత్సాహం కొద్దీ ఉటంకిస్తే దీర్ఘమవుతుందనే శంకతో, రచయిత శ్రీ సుబ్రహ్మణ్య దీక్షితులుగారికి అభినందనలు తెలుపుతూ ఆయనయందు శివకృప సదా సంపూర్ణంగా ప్రకాశించాలని ఆకాంక్షిస్తూ ముగిస్తున్నాను.

కె. పురుషోత్తం
విశ్రాంత సంయుక్త సంచాలకులు
ఉన్నత విద్యాశాఖ
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

అంకితం

"ఓ పరమేశ్వరా!!"

సీ॥ ఆది శంకరుని 'శివానందలహరి'ని
తెలుగు పద్యమునందు తెలుపుచుంటి
నీలకంఠుని కృపా నిధిజేత గాకున్న
ఈ కార్యమెట్లౌను ఎరుగరయ్య!
పాండిత్యమూలేదు వ్యాకరణమూ రాదు
దేవభాషగరిమ తెలియనైతి
జన్మాంతరంబుల సత్కర్మఫలముగా
సన్మిత్రులందరి సాయమబ్బె

తే॥ బుధజనులు దీని జదువగ పుణ్యమనెడి
భావనంబున, శ్రీగిరి వాసివైన
మల్లికార్జునా! ఈకృతి భర్తవగుచు
అంకితంబును గొను నాదు ఆర్తిదీర.

ఆది శంకరాచార్య ప్రణీతా

శివానంద లహరీ

(శ్లోక, పద్య రూపాంతరం, భావానంద లహరి)

శ్లోకం 1

కలాభ్యాం చూడాలంకృత శశికలాభ్యాం నిజతపః
ఫలాభ్యాం భక్తేషు ప్రకటితఫలాభ్యాం భవతు మే।
శివాభ్యా మస్తోక త్రిభువన శివాభ్యాం హృది పున
ర్భవాభ్యా మానందస్ఫురతనుభవాభ్యాం నతి రియమ్॥

పద్యరూపాంతరం:

సీ॥ కొప్పున శశిరేఖ నొప్పుగా ధరియించి
ఒకరి తపః ఫలంబొక్కరవుచు
భక్తుల ఫలములన్ ప్రకటించు వారలు
సకల కళలు గల్గు జగతి హితులు
త్రిభువనంబులకెల్ల తీర్చి మంగళములు
చేకూర్చువారలు శివుడు శక్తి
మరి మరి యెదదలో వారుద్యోతకమవన్
ఆనందస్ఫురితమౌ అనుభవమ్ము

తే॥ కలుగజేసెడి వారలు ఘనచరితులు
నాదు వందనంబులనిదే ముదము తోడ
గొనుచు బ్రోతురు గాక! నా కోర్కెదీర
శివ శివానులకు ప్రణతుల్ జేతునేడు.

భావానందలహరిః

శివుడు శివానీ ఇద్దరూ పురుష స్త్రీ స్వరూపాలలోనున్న పరమాత్మ రూపాంతరాలు. పరమేశ్వరుని అర్ధనారీశ్వర తత్త్వం అదే. కళా స్వరూపులు, చంద్రకళను శిరస్సున దాల్చినవారు, పరస్పరం ఒకరి తపం ఫలం ఇంకొకరైనవారు, భక్తులకు వరములను అనుగ్రహించువారు, మంగళ స్వరూపులు, ముల్లోకములకు శుభంకరులు, మనస్సులో ద్యోతకమయ్యెడివారు, సంతోషంవల్ల స్ఫురించు స్వరూపముగల ఆ ఉమామహేశ్వరులకు వందనము.

శ్లో॥ 2

గళంతీ శంభోత్వచ్చరిత సరితః కిల్బిషరజో
దళంతీ ధీకుల్యా సరణిషు పతంతీ విజయతాం।
దిశంతీ సంసార భ్రమణ పరితాపోప శమనం
వసంతీ మచ్చేతో హ్రదభువి శివానందలహరీ॥

పద్యరూపాంతరం:

సీ॥ హర! 'శివానందలహరి' యది నీయొక్క
చరితయన్ నదినుండి జాలువారి
పాపంపు ధూళి నివారించ గలిగిన
బుద్ధియన్ కాలువ పోవు త్రోవ
బట్టి, సంసారాన భ్రమియించుటం జేసి
ఘనమైన తాపంబు కలుగుచుండ
చక్కటిదౌ ఉపశమనమ్ము జూపుచు
నాయొక్క మనసనే నాణ్యమైన

తే॥ మడుగునందున కాలము గడుపుచుండ
సర్వ ఉత్కర్షమైనట్టి జాడతోడ
తాను నివసించు విధమున తనరు గాక!
ఓ మహాదేవ! శంకరా! వ్యోమకేశ!

భావానందలహరి :

తా॥ ఓ హరా! నీ చరిత్రము అనే నదినుండి ప్రవహిస్తున్న పాపములనే దుమ్మును నిర్మూలించేది, బుద్ధి అనే కాలువతో పాటు పోయేది, సంసార బాధా నివారకం, నా మనస్సు అనే స్థలంలో ఉండేది, శివపార్వతుల వల్ల కలిగే ఆనంద ప్రవాహం, సర్వోత్కృష్టమైనదగు గాక!

శ్లో॥ 3

త్రయీవేద్యం హృద్యం త్రిపురహరమాద్యం త్రినయనం
జటాభారోదారం చల దురగ హారం మృగధరం
మహాదేవం దేవం మయి సదయభావం పశుపతిం
చిదాలంబం సాంబం శివ మతివిడంబం హృది భజే॥

పద్యరూపాంతరం:

సీ॥ వేద వేద్యుండును, విమల హృద్యుండును
త్రిపురాంతకుండును, దేవ విభుడు
ముక్కంటి, జగతికే మొట్టమొదలుయైన
వాడు, జటాజూట బంధనుండు
చలియించుచున్నట్టి సర్పహారములతో,
లేడిని జేబూను వాడు హరుడు
స్వయముగా వెల్గెడి వాడు, దయాళువు
ముల్లోకముల స్వామి మోక్షమునకు

తే॥ ఆశ్రయంబై, స్వరూప జ్ఞానాలయమ్ము
నైన అంబాసమేతుడు, అందనట్టి
వాడు గ్రహణకు, యట్టి ఆ పార్వతీశు
శివుని నెమ్మదిన్ భజియింతు గావ నేడు.

భావానందలహరి:

తా॥ ఆ పరమేశ్వరుడు వేద వేద్యుడై, మనోహరుడై, త్రిపురాంతకుడై, గొప్ప జటాజూట ధరుడై, కదిలే సర్పమే హారంగా కలవాడై, జింకను చేత ధరించినవాడై, మహాదేవుడై, నాలోనే నిండియున్న వాడై, పశుపతియై, జ్ఞానానికి ఆధార భూతుడై అంబా సమేతుడై, గ్రహణ కందనివాడైన ఆ పార్వతీ రమణుడిని సేవిస్తున్నాను.

శ్లో॥ 4

సహస్రం వర్తంతే జగతి విబుధాః క్షుద్రఫలదా
న మన్యే స్వప్నే వా తదనుసరణం తత్కృతఫలం
హరి బ్రహ్మాదీనా మపి నికటభాజా మసులభం
చిరం యాచే శంభోశివ తవ పదాంభోజ భజనమ్॥

పద్య రూపాంతరం:

చం॥ అలరుచు ముజ్జ గాల గల అందరు వేల్పులు
క్షుద్రమైనవౌ
పలు వరముల్ యొసంగెదరు వాటినినే
గణియింపనో శివా!
కలను మరెన్నడున్, కమలకాంతుడు
బ్రహ్మయు పొందలేని నీ
విలువగు పాదపద్మముల వీక్షణ గోరెద
నెల్లవేళలన్

భావానందలహరి:

తా॥ అల్పఫలములను మాత్రమే ఈయగల దేవతలు చాలా మంది మూడు లోకాలలోనూ ఉన్నారు. వారిచ్చే ఫలాలు గురించి గానీ, వారి గురించి కానీ నేను కలలో కూడ ఆలోచించను. ఓ మహాదేవా! నీ సమీపంలోనే వుండికూడా ఆ బ్రహ్మాదులకు కూడా సాధ్యం కాని నీ పాద సరోజముల సేవాభాగ్యమునే కోరుకుంటున్నాను.

శ్లో॥ 5

స్మృతౌ శాస్త్రే వైద్యే శకున కవితా గాన ఫణితౌ
పురాణే మంత్రేవా స్తుతి నటన హాస్యే ష్వచతురః
కథం రాజ్ఞాం ప్రీతి ర్భవతి మయి కో హం పశుపతే
పశుం మాం సర్వజ్ఞ ప్రథితకృపయా పాలయ విభో॥

పద్యరూపాంతరం:

సీ॥ పశుపతీ! సర్వజ్ఞ! ప్రఖ్యాతుడా! విభో!
ఏ ఘనతయులేని హీనుడ హర!
స్మృతుల జ్ఞానములేదు, శాస్త్రాలు తెలియవు
శకున ఫలము రాదు, ఏకవితయు
సంగీత శాస్త్రము సాధింపనైతిని
మంత్రశాస్త్ర పురాణ మహిమనెరుగ
స్తుతి, నటనలు రావు చాతుర్యమాలేదు
హాస్యోక్తులన్నవి అరయనైతి

తే॥ అందుచే నాకు అబ్బునా ఆ నృపతుల
మెప్పు, కలుగుట యెట్లయ్య! ఎప్పుడైన?
నేను యెవడను? పశువును, నీవు పతివి
నన్ను పాలింపు శంభో! పినాక పాణి!

భావానందలహరి:

తా॥ ఓ ప్రభూ! ధర్మశాస్త్రము, తర్కవ్యాకరణ, వైద్య, శకున ఫలాదుల జ్ఞానము, గాన, పురాణ మంత్ర తంత్ర శాస్త్ర జ్ఞానముగాని, నాట్యహాస్య సంభాషణా చాతుర్యముగానీ నాకు లేవు రావు. వాటిలో ఏ సామర్థ్యమూ లేదు. ఇట్టి నాబోటి వానిపై ఏరాజు కనికరించును? కనుక దయబూని నీవే పశుపతివి గాన నన్ను ఆదరించాలి, రక్షించాలి.

శ్లో॥ 6

ఘటోవా మృత్పిండోవా ప్యణు రపిచ ధూమోగ్ని రచలః
పటోవా తంతుర్వా పరిహరతి కిం ఘోర శమనం
వృథా కంఠక్షోభం వహసి తరసా తర్కవచసా
పదాంభోజం శంభో ర్భజ పరమ సౌఖ్యం వ్రజ సుధీః

పద్యరూపాంతరం:

సీ॥ ఘటమా? ఘటమునందు కలిగిన మట్టియా?
ఏయది సత్యంబు యెరుగనగునె!
ధూమమా? అగ్గియా? తోచునా వేర్వేరు
చలము ధూమంబు, నచలము గిరియు
వస్త్రమా? అందున్న బలమైన దారమా?
దేనిని దాల్తురు మానవాళి?
మీమాంసలివియన్ని యముని దప్పించునా?
వ్యర్థ కంఠపు శోష వదల మేలు

తే॥ సుమతి! శంభునిపై భక్తి చొక్కి నీవు
హరుని పాదపద్మంబుల నార్తి మ్రొక్కి
శివుని భజియింప మేల్గాదె! శీఘ్రగతిని
ప్రాప్తమౌ పరమానంద పరవశమ్ము.

భావానందలహరిః

తా॥ ఓ నామంచి మనస్సా! కుండయైనా, మట్టియైనా, అణువైనా, దూళియైనా, అగ్నియైనా, గిరియైన, వస్త్రమయినా, దారమైనా మానవులు ఏది ధరిస్తున్నారు? అనే మీమాంసలు మానవుణ్ణి ఆ యముని బారినుండి రక్షించలేవు. వ్యర్థ వాదనవల్ల కంఠశోష తప్ప లాభమేమి? ఆ పరమేశ్వరుని పాదపద్మములను సేవించి, స్తుతించరాదా?

శ్లో॥ 7

మనస్తే పాదాబ్జే నివసతు వచః స్తోత్రఫణితౌ
కర శ్చాభ్యర్చాయాం శ్రుతి రపి కథాకర్ణన విధౌ।
తవ ధ్యానే బుద్ధి ర్నయనయుగళం మూర్తి విభవే
పరగ్రంధైః కింవా పరమ శివ జానే పరమతః ॥

పద్యరూపాంతరంః

సీ॥ పరమేశ! నాదగు మనసు నీ పాదాబ్జ
ములయందు వసియించి నిలుచుగాక!
నేజెప్పు వాక్యముల్ నీస్తోత్రవ్యాసంగ
మున నిల్చి శ్రేష్ఠమై తనరుగాక!
నీ అర్చనలయందు నిలుచుగాక! కరాళి
చెవులు నీ కథలందు చెలగుగాక!
నాకన్నుగవలు నీ ఘనమూర్తి విభవంబు
చేగల్గ తృప్తిన్ వసించు గాక!

తే॥ బుద్ధి నీయొక్క ధ్యాననునుండు గాక!
స్వామి! అటుపైన చివరిగా పలుకుచుంటి
నీకు అన్యమౌ విషయంబు నేను యెట్టి
ఇంద్రియంబుల సాయాన నెరుగగలను?

భావానందలహరిః

తా॥ ఓ పరమేశ్వరా! నామనము, వాక్కు, చేతులు, చెవులు, బుద్ధి, నేత్రములు, అన్నీ క్రమముగా నీ పాదపద్మములయందు నీస్తోత్రములందు, నీ పూజయందు, నీ కధాశ్రవణమునందు, నీ ధ్యానమునందు, నీదర్శనమునందు, నీ సేవయందు పూర్తిగా లగ్నమై యుండుగాక! ఇకపై నా ఇంద్రియములేవియు నిన్ను తప్ప అన్యమెరుగకుండు గాక! (అద్భుతమైన క్రమాలంకారావిష్కరణ గమనించండి)

శ్లో॥ 8

యథా బుద్ధిశ్శుక్తౌ రజత మితి కాచాశ్మని మణి
ర్జలే పైష్టేక్షీరం భవతి మృగతృష్ణాసు సలిలం
తథా దేవభ్రాంత్యా భవతి భవదన్యం జడజనో
మహాదేవేశం త్వాం మనసి చ నమత్వా పశుపతే॥

పద్యరూపాంతరంః

సీ॥ ముత్యపు చిప్పలో సత్యమా రజితంబు?
గాజు రాళ్ళెట్లౌను ఘనమణులివి?
పిండినీరంబది విలువైన క్షీరమా?
ఎండమావుల నెట్లు నుండుజలము
విపరీత బుద్ధిచే వివరంబు నెరుగక
తాను మహాదేవ! కనడు నరుడు
జగముల శాసించు సర్వేశు నిను మదిన్
తెలియక మూఢుడు తలవబోడు

తే॥ పశుపతీ! యట్లె భ్రమజెంది మానవాళి
నీకు అన్యంబులై భువి నిలిచియున్న
ఇతరులను దైవమను విపరీత బుద్ధి
తాము సేవించుచున్నారు తగని విధిని

భావానందలహరిః

తా॥ ఓ పశుపతీ! శివా! నిన్ను మనసున స్మరించని మూఢుడు మెరిసే ముత్యపు చిప్పను వెండివలెను, గాజు ముక్కను మణివలెను, పిండి నీళ్ళను క్షీరముగాను, భావించును. అదే విధంగా నీకంటే అన్యులను భగవంతునిగా భావించు చున్నాడు.

శ్లో॥ 9

గభీరే కాసారే విశతి విజనే ఘోర విపినే
విశాలే శైలే చ భ్రమతి కుసుమార్థం జడమతిః।
సమర్ప్యైకం చేత స్సరసిజ ముమానాథ భవతే
సుఖే నావస్థాతుం జన ఇహ న జానాతి కిమహో॥

సీ॥ ఓ ఉమా ప్రాణేశ! బుద్ధి హీనుండైన
పురుషుడు పుడమిలో పూల కొఱకు
లోతైన సరసులలో కూడ దిగుచుండు
నిర్జనంబైనట్టి నెలవులందు
భీతి నెంచకనె ప్రవేశించుచున్నాడు
భీకరాటవిని వివేకి గాక
పొక్కుచు పర్వత సువిశాల శ్రేణిలో
తిరుగాడుచున్నాడు తెలివిలేక

తే॥ కాని, నీకై ఒకే ఒక మనసు అనెడి
సుమము నర్పణ జేయుచు సుఖమునొంది
స్థిరముగానుండ భువిలోన నెరుగడయ్యె
ఏమి ఆశ్చర్యమో ప్రభూ! హే మహేశా!

భావానందలహరిః

తా॥ ఓ ఉమాపతీ! జ్ఞాన విహీనుడు పుష్పముల కొరకు లోతైన సదస్సులలో దిగుచున్నాడు. నిర్మానుష్యమైన అరణ్యములలోను, మహోన్నత పర్వత సీమలలో తిరుగాడుచున్నాడు. కాని తన మానస సరోజమును నీకు సమర్పించవలెనని తెలియుట లేదు. ఇది మహాశ్చర్యము కదా!

శ్లో॥ 10

నరత్వం దేవత్వం నగవనమృగత్వం మశకతా
పశుత్వం కీటత్వం భవతు విహగత్వాది జననం।
సదా త్వత్పాదాబ్జస్మరణ పరమానందలహరీ
విహారాసక్తం చేత్ హృదయ మిహ కిం తేన వపుషా॥

పద్యరూపాంతరంః

సీ॥ నర శరీరంబైన అరయ దేవునిదైన
దోమ దేహంబైన దోసమేమి?
కొండకోనలయందు ఉండెడి మృగముల
కాయంబు కలిగిన కష్టమేమి?
పురుగు దేహంబైన, పులుగు దేహంబైన
పుట్టుకయేదైన పోవునేమి?
హృదయంబు సర్వదా ఒదిగిన నీపైన
జన్మలెక్కేమిటి జగతికర్త!

తే॥ నీదు పాదపద్మస్మృతి నిలిచి పరమ
మైన ఆనంద ఝరిలోన అలుపు లేక
యెదను విహరించుచున్నచో అదియెచాలు
దేహమేదైన లోటేమి? తెలుపు మీశ!

భావానందలహరిః

తా॥ ఓ శంకరా! మానవ జన్మయైనా, గిరి వన ప్రదేశములలో తిరిగే జంతువు జన్మయైనా, చీమ దోమవంటి కీటకపు జన్మయైనా, జలచరపు జన్మయైనా ఏ జన్మ లభించినా పెద్ద తేడాలేదు. నీ పాదపద్మములపై నెలకొన్న మనస్సు నీ దివ్య స్మరణానంద ప్రవాహంలో విహరించు తలపు కలిగిన చాలు. జన్మ ఏదయినా బాధ లేదు కదా.

శ్లో॥ 11

వటుర్వా గేహీవా యతి రపి జటీ వా తదితరో
వరో వా యః కచ్చి ద్భవతు భవ కిం తేన భవతి।
యదీయం హృత్పద్మం యది భవదధీనం పశుపతే
తదీయ స్త్వం శంభో భవసి భవభారం చ వహసి॥

పద్యరూపాంతరంః

సీ॥ ఓ భవా! పశుపతీ! వ్యోమకేశా! హరా!
నీ భక్తుడైనచో నీకు చాలు
బ్రహ్మచారైననున్ పాదదాసుండైన
మోక్షంబు నిత్తువు తక్షణంబె
తను గృహస్థుండైన గాని బ్రోతువు దయన్
జడధారి సన్యాసి గూడ పొందు
ఆశ్రమంబేదైన నాశ్రయించిన జాలు
ఏమౌను బేధమ్ము? ఇదియె కాదు

తే॥ ఎవని హృదయ పద్మంబు నీదవునొ, వాని
వాడవవుదువు పరమేశ! వాని కొఱకు
వాని సంసార భారమ్ము నైనగాని
నీవు బూని వహింతువు నిటలనయన!

భావానందలహరిః

తా॥ ఓ పరమేశ్వరా! నరుడు బ్రహ్మచారియైనా, గృహస్థయినా, సన్యాసయినా, యోగి అయినా, ఎవరైనా వీరికంటె ఇతరులు అయినా కావచ్చును. నీవు పశుపతివి కనుక నీ అధీనంలో ఉండే మనస్సున్నవాడైతే వాని భారమంతా నీవే వహిస్తావు.

శ్లో॥ 12

గుహాయాం గేహే వా బహి రపి వనే వాద్రిశిఖరే
జలేవా వహ్నౌ వా వసతు వసతేః కిం వద ఫలం ।
సదా యస్యై వాంతఃకరణ మపి శంభో తవపదే
స్థితం చే ద్యోగోసౌ స చ పరమయోగీ సచ సుఖీ॥

పద్యరూపాంతరంః

సీ॥ శంభో! గుహలయందు, చక్కని గృహముల,
బయట కారడవులన్ బ్రతుకవచ్చు
పర్వత శిఖరాల వరలుచు, నీటిలో
నిలిచి యుండగవచ్చు కలతలేక
పంచాగ్నులందున భక్తుండు సాధనన్
వసియించుగాక! యే వంతలేక
అట్టి నివాసంబు నలరిన ఫలమేమి?
యెరుగ దెల్పుము ప్రభో! గరళకంఠ!

తే॥ ఎవని మనసు కూడా సదా యిమిడి యుండు
నీదు పాదాబ్జముల బట్టి నిలిచి యుంట
అరయ యోగంబు అవ్వాడె పరమయోగి
పరమ మైన ఆనందమ్ము పరగువాడు.

భావానందలహరిః

తా॥ ఓ శంభో! మానవుడు గుహలలో గానీ, గృహంలో గాని, లోపల గాని, బయట గానీ, గిరిజలాగ్నులలో దేనిలో నైనా ఎక్కడ నివసించినా ఏమీతేడాలేదు. ఏ ప్రయోజనమైన యోగిగా లెక్కింపబడతాడు. మోక్ష సుఖార్హుడు కూడా ఆతడే సుమా!

13

అసారే సంసారే నిజభజనదూరే జడధియా
భ్రమంతం మా మంధం పరమకృపయా పాతు ముచితం
మదన్యః కో దీన స్తవ కృపణ రక్షాతి నిపుణః
త్వదన్యః కో వా మే త్రిజగతి శరణ్యః పశుపతే॥

పద్యరూపాంతరంః

సీ॥ ఆత్మాను సంధాన మావంత లేనిది
రుచి హీనమైనది లుప్తమైన
అజ్ఞానినై నేను అరయనైతిని దారి
భ్రమియించు చున్నాడ పరమపురుష!
అంధుడనై నేను అల్లాడు చుంటిని
బ్రోచుట దయబూని ఉచితమౌను
చైతన్య రూపుడా! శంకరా! పశుపతీ!
నేనుగాక ఎవరు నీకు గలరు?

తే॥ దీనరక్షా నిపుణుడవు, దీనుడేను
శరణమిచ్చెడి దాతలు మీరు గాక
మూడు లోకాల వెదకినా తోడెవండు
వేరు ఎవ్వరూ లేరయ్య మీరు గాక.

భావానందలహరిః

తా॥ ఓ శంకరా! నిస్సారవంతమైనదీ, నీ సేవా భాగ్యానికి సుదూరమైనది, అయిన ఈ సంసార సాగరంలో అజ్ఞానం వలన పరిభ్రమిస్తూ గుడ్డివాడనై యున్నాను. ఇక నన్ను నీవే రక్షించెదవు గాక! నీ దృష్టిలో నీకంటే దీనుడైన వాడెవరున్నారు? ముల్లోకాలలోను నాకంటే మిన్నయైన సంరక్షకుడు నాకు ఇంకెవరు ఉన్నారు? మరెవ్వరూ లేరు.

శ్లో॥ 14

ప్రభుస్త్వం దీనానాం ఖలు పరమబంధుః పశుపతే
ప్రముఖ్యోహం తేషా మపి కిముత బంధుత్వ మనయోః
త్వయైవ క్షంతవ్యా శివ మదపరాధాశ్చ సకలాః
ప్రయత్నాత్కర్తవ్యం మదవన మియం బంధు సరణిః

పద్యరూపాంతరంః

చం॥ తెలియవె? దీనినో పశుపతీ! శివ!
దీనజనాళి స్వామివే!
కలికము వేసి కాంచినను కన్పడునా నినుమించు
దీనుడున్?
కలదికబంధువన్న 'జత' కావున తప్పుల
గాచిరక్షకై
సలుపుము యత్నమున్ తమకె సాధ్యము
దీనులనాద్యు బ్రోవగా

భావానందలహరిః

తా॥ ఓ పార్వతీ పతీ! సర్వశక్తి సమన్వితుడైన నువ్వే దీనులకు ఆప్త బంధుడవు. నాకన్నా దీనుడు నీకు కనిపించడు. కనుక మనం బంధువులమని వేరే గుర్తు చేయాలా? ఓ పరమశివా! నా తప్పులన్నీ మన్నించి నన్ను రక్షించు. మన బాంధవ్యాన్ని నిలబెట్టే ప్రయత్నం చెయ్యి. దీనులలో ప్రథముడనైన నన్ను కాపాడుట నీకే సాధ్యం.

శ్లో॥ 15

ఉపేక్షా నోచేత్కిం న హరసి భవద్ధ్యాన విముఖాం
దురాశాభూయిష్టాం విధిలిపి మశక్తోయది భవాన్
శిరస్తద్వైధాత్రం న ఖలు సువృత్తం పశుపతే
కథంవా నిర్యత్నం కరనఖముఖే నైవ లులితమ్॥

పద్యరూపాంతరం:

చం॥ కలదు 'ఉపేక్ష' నా యెడల కానిచొ నా
నుదుటన్ విరించి యే
నిలుపగ నన్ను నీ విముఖునిన్ వడి చేయగ
వ్రాయు 'రాతలన్'
నిలువున మాపలేవా! హర! నీ కొనగోటితో
వాని దౌతలన్
అలుకను ఉత్తరించితివి అయ్యది
నీకవలీలనెట్లయెన్?

భావానందలహరి:

తా॥ ఓ హరా! నన్ను నీ ధ్యాన విముఖినై దురాశతో కూడుకొన్న వాడైనట్లుగా ఆ బ్రహ్మదేవుడు నా నుదుట వ్రాసే తలరాతలను తుడిచివేయలేవా? అట్లా అయితే ఆ బ్రహ్మ ఐదవతలను నీ చేతి గోటితో ఎలా ఖండించి పారేశావు?

శ్లో॥ 16

విరించిర్దీర్ఘాయు ర్భవతు భవతా తత్పరశిర
శ్చతుష్కం సంరక్ష్యం స ఖలు భువి దైన్యం లిఖితవాన్
విచారః కో వా సౌ విశదకృపయా పాతి శివతే
కాటాక్ష వ్యాపార స్స్వయ మపిచ దీనా వనపరః॥

పద్యరూపాంతరం:

సీ॥ సుస్పష్టమైనట్టి సురుచిర రూపమ్ము
కలవాడ ఓ శివా! గరళకంఠ!
దీర్ఘాయుడై బ్రహ్మదేవుండు నీకృపన్
దక్కించుకొనుగాక తలలు నాల్గు
ఈ భువినాతండు యెనలేని దైన్యంబు
నుదుట వ్రాసెను కదా! తుదకు నాకు
దీనరక్షణయందు దీక్షానిబద్ధుడా!
దిక్కునీవే కదా దీనబంధు

తే॥ నీ కటాక్ష వీక్షణ సోకునయ్య!
తమకు తామేగా బ్రోతురు దయను బూని
అందుజేతనో పశుపతీ! ఆర్తుదనని
ఇంక దైన్యపు చింత నాకేల కలదు?

భావానందలహరి:

తా॥ ఓ శివా! గరళకంఠా! దీర్ఘమైన ఆయుః ప్రమాణము కలవాడగుట చేత ఆ బ్రహ్మయొక్క మిగిలిన నాలుగు తలలను నీవే సంరక్షించాలి. నాకు బ్రహ్మదైన్యాన్ని వ్రాశాడని విచారం దేనికి? దీనరక్షా దక్షమైన నీక్రీగంటి ప్రసారం నన్ను కరుణతో స్వయంగా రక్షిస్తున్నది కదా!

శ్లో॥ 17

ఫలాద్వా పుణ్యానాం మయి కరుణయా వా త్వయి విభో!
ప్రసన్నేపి స్వామిన్! భవ దమల పాదాబ్జయుగళమ్
కథం? పశ్యేయం మాం స్థగయతి నమస్సంభ్రమ జుషాం
నిలింపానాం శ్రేణి ర్నిజ కనక మాణిక్య మకుటైః

పద్యరూపాంతరం:

సీ॥ ఓ సర్వవ్యాపకా! ఓస్వామి! ఓశివా!
కలిగిన నా పుణ్యఫలము వలన
కానిమ్ము, నాయందు కలిగిన దయజేత
నైనన్ ప్రసన్నుండవైన గాని
మలిన రహితమైన పాదపద్మపు జంట
కడు ప్రీతి నేనెట్లు జూడగలను
ఆరాటమున నీకు అర్పించ వందనం
బా సురప్రముఖులు అచట జేర

తే॥ వారి గుంపుల శిరములన్ పలు విధముల
మణి ఖచితమైన కాంచన మకుటములవి
కాంతులను వెదజిమ్మగ కనులు బైర్లు
కమ్మి, నాదృష్టినడ్డెను గరళకంఠ!

భావానందలహరి:

తా॥ సర్వవ్యాప్తుడవైన ఓ సర్వేశ్వరా! నా పుణ్య ఫలం వలన, నాపై నీకుగల అపరిమితమైన ప్రేమవలన నీ సాక్షాత్కారం లభించినప్పటికీ నాకు నీ పాద పంకజముల దర్శన భాగ్యం కలుగుట లేదు. ఎలా కలుగుతుంది? ఆ దేవతలంతా నీపాదాలకు శిరస్సులు వంచి వినమ్రులై నమస్కరిస్తుంటే వారి కిరీటాల్లో పొదిగిన మణుల కాంతులు నాకళ్ళు బైర్లు కమ్మిస్తున్నాయి, స్వామీ!

శ్లో॥ 18

త్వమేకో లోకానాం పరమఫలదో దివ్యపదవీం
వహంత స్త్వన్మూలాం పునరపి భజంతే హరిముఖాః
కియద్వా? దాక్షిణ్యం తవ, శివ! మదాశా చ కియతీ
కదా వా మద్రక్షాం వహసి కరుణా పూరిత దృశా॥

పద్యరూపాంతరం:

చం॥ పరమఫలంబు లిచ్చెదవు పాయక లోకము
లందు ఒంటిగా
హరి తను దైవముఖ్యులతొ అద్భుతవైభవ
మంది గొల్చునిన్
హర! దయనీది యెంతటిదొ! ఆశత
నెంతటిదయ్య నాది! నీ
కరుణతొ భారమెన్నడిక గావగ నీవు
వహింతువో కదా!

తా॥ ఓ హరా! ఈ త్రిభువనాలలో మహత్తరమైన ఫల ప్రదాతవు నీవొకడవే. శ్రీహరి ముఖ్యులైన దేవతలలో నీ దివ్యపదము పొందినా తృప్తి నెరుగక ఇంకా మ్రొక్కుతూనే వున్నారు. నీ కరుణ ఎంతటిదో కదా! నా ఆశకేమో అంతే లేదయ్యె. నన్ను భారమని ఎంచక కరుణతో నన్ను రక్షించే భారం వహించెదవు గాక!

శ్లో॥ 19

దురాశా భూయిష్ఠే దురధిప గృహ ద్వార ఘటకే
దురంతే సంసారే దురిత నిలయే దుఃఖజనకే।
మదాయాసం కిం? న వ్యపనయసి కస్యోప కృతయే?
వదేయం ప్రీతిశ్చేత్తవ ఖలు కృతార్థా వయ మపి॥

పద్యరూపాంతరం:

ఉ॥ పూరితమై దురాశ మది, బూనుచు దుర్మతి
కూళులిండ్లకున్
జేరగ గొంచుపోబడుచు చేటగు అంత్యము
గల్గు పాపముల్
మీరుచు జేసినాడు నిల, మేలొనరింపుము
బ్రహ్మగారికిన్
కోరి కుదింపు నేరములు కొల్లలు జేసితి
కాలకంఠ! నే
నేరక జేసినాడ, ఇక నీకును ఇష్టమ
దైన ధన్యుడన్

భావానందలహరి:

తా॥ ఓ కాలకంఠ! నా మనస్సు దురాశాపూరితమై దుర్మతిగలవాడనై దుర్మార్గుల ఇండ్లకు తీసుకుపోబడిన వాడినై చివరికి కీడు మాత్రమే చేయగల పాపకార్యములను ఈ ప్రపంచంలో ఎక్కువగా చేశాను. నీవుమాత్రం ఆ బ్రహ్మదేవునికి నా పాపములు కుదించి మేలు జేయుము. నేను చేసిన నేరములన్నీ తెలియక చేసినవే. ఇక నీకు కూడ అదే ఇష్టమైతే నేను ధన్యుణ్ణే సుమా!

శ్లో॥ 20

సదా మోహాటవ్యాం చరతి యువతీనాం కుచగిరౌ
నటత్యాశా శాఖా స్వటతి ఝడితి స్వైర మభితః
కపాలిన్! భిక్షో! మే హృదయకపి మత్యంతచపలం
దృఢం భక్త్యా బద్ధ్వా శివ! భవదధీనం కురు విభో?

పద్యరూపాంతరం:

సీ॥ నా మనస్సను కోతి నడయాడుచుండును
మోహంబనేవనములను జుట్టి
జవరాండ్ర బిగువైన స్తనపర్వతములందు
ఆడుచుండును సదా అలుపు లేక
ఆశల కొమ్మల నంతట వేగాన
ఇచ్ఛవచ్చిన రీతి జొచ్చుచుండు
అతి చపలంబైన కోతి నామనసిది
భక్తియన్ త్రాటితో బట్టి గట్టు

తే॥ నీ యధీనంబులోనుంచి నిలుపుమయ్య!
ఎల్లవేళల ఓ శివా! హే కపాలి!
సర్వవ్యాప్తుడా! పశుపతీ! శరణమిమ్ము
ఆది భిక్షువా! ఘటియింతు అంజలిదియె.

భావానందలహరి:

తా॥ ఓ అదిభిక్షూ! ఓ కపాలీ! నా మనస్సనే కోతి సదా మోహారణ్యములలో తిరుగుచు, సుందరీమణుల కుచగిరులలో పరిభ్రమిస్తూన్నది. స్వేచ్ఛగా ఆశలనే కొమ్మలలో తిరుగాడుచున్నది. ఓ దేవదేవా! అతి చంచలమైన ఈ నామనస్సనే కోతిని భక్తి అనే త్రాటితో గట్టిగా కట్టి నీ స్వాధీనం చేసుకో. నన్ను అనుగ్రహింపుము.

శ్లో॥ 21

ధృతిస్తంభాధారాం దృఢగుణ నిబద్ధాం సగమనాం
విచిత్రాం పద్మాఢ్యాం ప్రతిదివస సన్మార్గఘటితాం
స్మరారే! మచ్చేత స్ఫుటపటకుటీం ప్రాప్య విశదాం
జయ! స్వామిన్ శక్త్యా సహ శివగణై స్సేవిత విభో!

పద్యరూపాంతరం:

సీ॥ "ధృతి స్తంభ" మాధార మతి ధృఢంబైనట్టి
"గుణముల" చే గట్టి కుదిరియుండు
"గమనంబు" కలదియు కడు విచిత్రంబైన
'వాసనల్' కలదియు వన్నెగలది
"పద్మ సుశోభిత" ప్రతిదినంబును తాను
"సన్మార్గముల జిక్కు" చక్కనిదియు
"నిర్మలంబైనది" నెగడు నామనసది
"శక్తి సమేతమై" రక్తినుండు

తే॥ మనసు నాది గుడారము అనుట దగును
ఎన్ని పోలికలున్నవో యెంచి చూడ
మన్మథునివైరి! ఓ శివా! మాకు స్వామి!
విభుడ! ప్రమథ గణాధ్యక్ష! విశ్వనాథ!

మనస్సును గుడారముతో పోల్చుచున్నారు శంకరాచార్యులు.

1. ధృతిస్తంభం	మనస్సు ధృడంగా చేసుకునె ధైర్యం అను స్థంభం గుడారం మధ్య ఉండే కొయ్య స్తంభం
2. గుణములు	మనస్సుకుండే గుణములు త్రాళ్ళు
3. గమనంబుకలది	విచలితమైనది తీసుకుపోబడుచున్నది
4. విచిత్రమౌ వాసనల్ కలది	విచిత్రమైన అనుభూతులు కలది. రంగు రంగుల దేరా.
5. పద్మసుశోభిత	లక్ష్మీకళ గలది తామరపువ్వు బొమ్మ

6. సన్మార్గులకు	భగవన్మార్గము సరియైన త్రోవలో పోవువారికి
7. నిర్మలంబైనది	అకళంకమైనది పరిశుభ్రమైనది
8. శక్తి సమేతమై	పార్వతీ దేవితో కూడుకొని సైన్యబలగంతో

భావానందలహరిః

తా॥ మనస్సుకి గుడారానికి గల పోలికలవల్ల నామనస్సే గుడారం. అందులో నివసించు స్వామీ! ఓ ప్రమథనాథా! ఓ మన్మథవైరి! శివా! ధృతి స్తంభం ఆధారంగా, త్రిగుణములచే నిర్మింపబడి, గమనము కలిగి, విచిత్రమైన వాసనలు గలది, పద్మ శోభ కలిగినది, సన్మార్గులకు లభించునది, నిర్మలమైనది, శక్తిసమేతమైనది, యైన నా మనస్సులో నివసించు సదాశివ! దానికి నీమీద ప్రీతి కలదు.

శ్లో॥ 22

ప్రలోభాద్యై రర్థాహరణ పరతంత్రో ధనిగృహే
ప్రవేశోద్యుక్తస్సన్ భ్రమతి బహుథా తస్కరపతే।
ఇమం చేతశ్చోరం కథ? మిహ స హే శంకర! విభో।
తవాధీనం కృత్వా మయి నిరపరాధే కురు కృపాం॥

పద్యరూపాంతరంః

ఉ॥ పూనుము తస్కరేంద్ర! శివ! పుణ్యము నీదగురా, ప్రలోభియై
మానస మిద్దినాది ధనవంతుల యిండ్లను జొచ్చివర్తిలున్
నేను సహింప, నా మనసు నీచపు దొంగవుటన్ హరా! ఇకన్
దీనిని నీఅధీనమున దీర్చుము గావుము యీ అమాయకున్.

భావానందలహరిః

తా॥ ఓ తస్కరేంద్రా! శంకరా! నా మనస్సు ఒక దొంగవలె నా మాటలు లక్ష్యపెట్టక సదా ధనవంతుల ఇండ్లచుట్టూ తిరుగుతూ మానాభిమానాలు కోల్పోయింది. ఇది నేను భరింపలేను ఓ శివా! నేను అమాయకుడను దొంగను ఎట్లా అదుపులో వుంచగలను. నా మనస్సనే దొంగని నీ అధీనం చేస్తున్నాను నీ అదుపాజ్ఞల్లో పెట్టుకో దయజూపుము.

శ్లో॥ 23

కరోమి త్వ త్పూజాం సపది సుఖదో మే శివ విభో!
విధిత్వం విష్ణుత్వం దిశసి ఖలు తస్యాః ఫలమితి
పునశ్చ త్వాం ద్రష్టుం దివి భువి వహన్ పక్షిమృగతా
మదృష్ట్వా తత్ఖేదం కథ? మిహ సహే శంకర విభో!

పద్యరూపాంతరం:

చం॥ కొలిచెద శంకరా! విభుడ! కూర్మిని జూపుము
నిన్ను వేడెదన్
ఫలముగ నాదు పూజలకు బ్రహ్మగ, విష్ణుగ
నుండ జాల, ఆ
నలువయు హంస అయె, హరినాడు వరాహము
తాను అయ్యెరా
చెలిమితొ నాకు కన్పడుము శీఘ్రుమె
బ్రోవుము నన్ను ఈశ్వరా!

భావానందలహరి:

తా॥ ఓ శంకరా! నిన్ను వేడుకుంటున్నాను. నా పూజల వల్ల సంతుష్టుడవై ఒకవేళ నాకు బ్రహ్మత్వము గానీ, విష్ణుత్వము గానీ ఇస్తావేమో, ఎంతమాత్రం వద్దు. నిన్ను తెలుసుకోవటానికి వాళ్ళలాగ పక్షి జంతువుల రూపాలు నేను ధరించలేను. నామీద కృపతో నాకు శీఘ్రంగా దర్శనమిచ్చి నన్ను కృతార్థుణ్ణి జేయి.

శ్లో॥ 24

కదా వా కైలాసే కనకమణి సౌధే సహగణైః
వసన్ శంభో రగ్రే స్ఫుటఘటిత మూర్ధాంజలి పుటః
"విభో! సాంబ! స్వామిన్ పరమశివ! పాహీతి" నిగదన్
విధాతౄణాం కల్పాన్ క్షణమివ వినేష్యామి సుఖతః

పద్యరూపాంతరం:

సీ॥ కైలాస మందున కనక సౌధంబున,
మణి ఖచితనైబన వాసమందు
ప్రమథ గణంబులు పరమేశ్వరుని గొల్వ
వారి ముంగిట నేను పరవశించి
శిరసుపై అంజలిన్ చేబూను వాడనై
వినయ పూర్వకమైన వినతి జేతు
హే సాంబశివ! విభో! హే స్వామి! పరమేశ
పాహిమాం అని నేను పలుకుచుండ

తే॥ సుఖము ననుభూతి జెందుచు సొంపుమీర
బ్రహ్మ కల్పంబునంతయు మదిని యెంచి
ఒక్కక్షణమట్లు ఓ ప్రభూ! వ్యోమకేశ!
ఎపుడు గడుపుదునో కదా! హే మహేశ!

భావానందలహరి:

తా॥ కైలాస శిఖరంపై మణి సువర్ణ సౌధంలో, ప్రమథ గణ సమేతుడైన సదాశివుని సమక్షంలో చేతులు జోడించి ఓ ప్రభూ! సాంబా! పరమశివా! స్వామీ! పాహిమాం, పాహిమాం అంటూ ఆ పరమ సుఖంలో బ్రహ్మ కల్పం కూడా క్షణంలా గడుపుతూ ఎప్పుడుంటానో కదా!

శ్లో॥ 25

స్తవైర్బ్రహ్మాదీనాం జయజయ వచోభి ర్నియమినాం
గణానాం కేళీభి ర్మదకలమహోక్షస్య కకుది।
స్థితం నీలగ్రీవం త్రినయన ముమాశ్లిష్టవపుషం
కదా? త్వాం పశ్యేయం కరధృతమృగం ఖండపరశుమ్॥

పద్యరూపాంతరం:

సీ॥ బ్రహ్మాది వేల్పుల భక్తి స్తుతుల చేత
మునిగణ జయజయ ధ్వనుల చేత
ప్రమథులు ఆటల పాటల చేతను
వాయిద్య ఘోషచే ప్రస్తుతించ
హర్షాతి శయమున అలరెడి నందియు
మూపురమ్మున నిల్పి మోయుచుండ
గిరిబాలపెన వైచి మురియుచు బిగువుగా
కౌగలించిన మేను కలుగువాడు

తే॥ మూడు కన్నుల ముక్కంటి ముదముకలుగ
జింకచేత ధరించిన శివుని భవుని
గండ్ర గొడ్డలి హస్తాన కలుగువాని
నిన్ను ఎన్నడు జూతునో నీలకంఠ!

భావానందలహరిః

తా॥ ఓ పరమేశ్వరా! బ్రహ్మాది దేవతలు స్తోత్రించుచుండగా యోగీశ్వరులు జయజయ ధ్వానాలు చేస్తుండగా, ప్రమథ గణాలు ఆడుతూ పాడుతుండగా, వృషభ వాహనప మూపురంపై నీలకంఠుడు, త్రినేత్రుడు, పార్వతీ సహితుడైన ఓ శంకరా! ఒకచేత జింకను వేరొక చేత పరశువును ధరించిన నిన్ను ఎప్పుడు దర్శింతునో కదా!

శ్లో॥ 26

కదా వా త్వాం దృష్ట్వా గిరిశ! తవ భవ్యాంఘ్రి యుగళం
గృహీత్వా హస్తాభ్యాం శిరసి నయనే వక్షసి వహన్
సమాశ్లిష్య ఘ్రాయ స్ఫుటజలజ గంధాన్ పరిమళా
నలభ్యాం బ్రహ్మాద్యైర్ముద మను భవిష్యామి హృదయే॥

పద్యరూపాంతరంః

సీ॥ పర్వత శాయియౌ పరమేశ్వరా! నిన్ను
చూచు భాగ్యమెపుడు తోచు నాకు?
క్షేమకరములైన శివపాదముల జంట
గట్టిగా నాచేత పట్టుకొనుచు
శిరసును, నేత్రాల, నురమును దాకుచు
ఆలింగనము జేసి నిలుపగలనె?
విరిసిన పూవుల పరిమళంబుల నెల్ల
భాగ్యంబు మూర్కొనన్ బడయ గలనె?

తే॥ బ్రహ్మసురలకు వేరికి ప్రాప్తికాదు
అట్టి ఆనందమును నేను అలుపులేక
హృదయమందున ప్రాప్తిల హృద్యముగను
ఎపుడు అనుభవింతునొకదా! హే మహేశ!

భావానందలహరిః

తా॥ పర్వతములలో శయనించు ఓ పరమేశ్వరా! నీ దర్శన భాగ్యం పొంది నీ దివ్య చరణారవిందాలను నా చేతులతో పట్టుకొని నా కన్నులకు శిరస్సునకు గుండెకు ఆనించుకుని ఆలింగనము చేసికొని, ఆ దివ్య పద్మ సుగంధాన్ని ఆఘ్రాణిస్తూ బ్రహ్మాదులకు కూడా దుర్లభమైన ఆ పరమానందాన్ని నాహృదయం నిండానేనెప్పుడు అనుభవింతునో కదా!

శ్లో॥ 27

కరస్థే హేమాద్రౌ గిరిశ! నికటస్థే ధనపతౌ
గృహస్థే స్వర్భూజామరసురభి చింతామణి గణే
శిరస్థే శీతాంశౌ చరణ యుగళస్థే ఖిల శుభే
కమర్థం దాస్యేహం భవతు భవదర్థం మమ మనః॥

పద్యరూపాంతరంః

సీ॥ హేమాద్రి నొకజేత ఈశా! ధరింతువే,
ధనదుండు నీ చెంత వినయశీలి
కల్పతరువు కూడి కామధేనువు తాను
చింతామణియు ఇంట సిరుల నిచ్చు
హిమకిరణుండైన సోముండు నెలరేడు
శిరసున రత్నమై చెలగుచుండు
సర్వశుభంబులు చరణ యుగ్మమునుండ
నీకంటె సిరులేల నీలకంఠ!

తే॥ నిలిచి కైలాస గిరిపైన నీకు గలుగ
నేను ఈప్సితంబెద్దాని నీకు ఇత్తు?
నాది అన్నది నా మనస్సదియె నీకు
అర్పణము జేతు నీ చెంత నలరుగాక!

భావానందలహరిః

తా॥ ఓ ఈశ్వరా! బంగారు కొండ, కుబేరుని వంటి మిత్రుడు, కామధేనువు కల్పవృక్షము చింతామణి వంటి సర్వైశ్వర్యములు, అన్ని సస్యముల రక్షకుడైన చంద్రుడు నీ శిరోభూషణంగాను, సమస్తవైభవములు నీ చరణ కమలముల దగ్గిరనే ఉన్నవాడవు నీకు నేనేమివ్వగలను స్వామీ! నాది అనేది నామనస్సు ఒక్కటే అది నీకు సమర్పిస్తాను. సదా అది నీ సన్నిధిలో నిలుచు గాక!

శ్లో॥ 28

సారూప్యం తవపూజనే, శివ! మహాదేవేతి సంకీర్తనే
సామీప్యం శివభక్తి ధుర్య జనతా సాంగత్య సంభాషణే
సాలోక్యం సచరాచరాత్మక తనుధ్యానే భవానీపతే!
సాయుజ్యం మమ సిద్ధ మత్ర భవతి స్వామిన్ కృతార్థోస్మ్యహమ్॥

పద్యరూపాంతరంః

సీ॥ సారూప్యమనగ నీ సరిరూప సిద్ధియౌ
నీపూజచే దక్కు నీలకంఠ!
సామీప్యమనగనీ సహితమై యుండుట
సంకీర్తనముజేత సాధ్యపడును
సాలోక్యమనగనీ సాంగత్యమే స్వామి!
భక్తి ప్రపత్తిచే ప్రాప్తమగును
సాయుజ్యమన నీతో చక్కగా ఐక్యంబు
అవుట ధ్యానంబుచే అదియుదక్కు

తే॥ ఇచటనే అన్ని సిద్ధించు ఇది నిజంబు
శివ! భవానీ పతీ! మహాదేవ! శంభొ
నీవె అందరిలోనుండి నిలుపు జ్యోతి
అందుచే నేను ధన్యుడన్ అయితి స్వామి!

భావానందలహరిః

తా॥ ఓ భవానీ పతీ! శివా! ఈ నా జన్మ నేను నిన్ను ఆరాధిస్తూ సారూప్యమూ, మహాదేవా! శంకరా! అని స్తోత్రిస్తూ సామీప్యమూ, నీ భక్తజనులతో సంభాషిస్తూ సాలోక్యమూ, చరాచరాత్మకమైన నీ స్వరూపాన్ని ధ్యానిస్తూ సాయుజ్యము లభిస్తున్నవి. కనుక దేవా నేను కృతార్థుడనయ్యాను.

శ్లో॥ 29

త్వత్పాదాంబుజ మర్చయామి పరమం త్వాం చింతయా మ్యన్వహం
త్వామీశం శరణం వ్రజామి వచసా త్వామేవ యాచే విభో!
వీక్షాం మే దిశచాక్షుషీం స కరుణాం దివ్యైశ్చిరం ప్రార్థితాం
శంభో! లోకగురో! మదీయ మనసస్సౌఖ్యోపదేశం కురు॥

పద్యరూపాంతరంః

సీ॥ సర్వేశ! అర్చింతు సౌఖ్యప్రదంబైన
నీ చరణాబ్జముల్ నియతిబూని
నిత్యంబు చింతింతు నినుగూర్చి ఈశ్వరా!
నీ శరణము వేడి నిలిచియుందు
నిన్ను యాచింతును ఎన్నియో పలుకుల
శ్రేష్ఠుడవీవని నిష్టగొలుతు
సురలు అనాదిగా స్తోత్రించుచుండిన
నీకృపా వీక్షణ నెనరు గలుగ

తే॥ నాకు నీవనుగ్రహియింపు నయము మీర
ఓ జగద్గురూ! శంకరా! వ్యోమకేశ!
స్వాంతనము నిమ్ము మనసున చింతదీర
తగిన ఉపదేశమును జేయ ధన్యునవుదు.

భావానందలహరిః

తా॥ ఓ సర్వేశ్వరా! నీ పాదపద్మముల నారాధిస్తున్నాను. ఓ ఈశ్వరా! నిత్యమూ నీగురించి చింతిస్తూ నీ శరణు వేడెదను ఓ వ్యోమకేశా! ఎన్నియో మాటలతో నిన్ను యాచిస్తున్నాను. ఓ జగద్గురూ! నీవు సర్వశ్రేష్ఠుడవని నిత్యమూ కొలిచెదను. ఓ శంకరా! నీవే దిక్కని నీ శరణు వేడుతున్నాను. దేవతలంతా అనాదిగా నీ కరుణ కొరకు నిన్ను స్తోత్రిస్తున్నారు. ఓ ప్రభూ! నాకు సాంత్వనము కలిగి మనస్సున దుఃఖం తొలగుటకు తగిన జ్ఞానోపదేశము నా మనస్సున కిమ్ము.

శ్లో॥ 30

వస్త్రోద్ధూవిధౌ సహస్రకరతా పుష్పార్చనే విష్ణుతా
గంధే గంధవహాత్మతా న్నపచనే బర్హిర్ముఖాధ్యక్షతా
పాత్రే కాంచనగర్భతాస్తి మయి చే ద్బాలేందు చూడామణే
శశ్రూషాం కరవాణి తే పశుపతే! స్వామిన్! త్రిలోకీ గురో

పద్యరూపాంతరం:

సీ॥ సూర్యత్వ మిచ్చిన సులువుగా వేలాది
కరముల వస్త్రంబు కలుగ జేతు
విష్ణుత్వమిచ్చిన విరిపూల నర్చన
వ్యాపించి యెల్లెడన్ భక్తి జేతు
వాయుత్వమిచ్చిన మోయుచు గంధమ్ము
గంధలేపన జేతు గాత్రమునకు
ఇంద్రత్వమిచ్చిన ఇంపుగా అన్నంపు
పచనోపచారంబు వడిగజేతు
బ్రహ్మత్వమిచ్చిన బంగారు గర్భాన
పాత్రోపచారంబు బడయు జేతు

తే॥ ఎట్టి ఘనతయు లేదు నీకేమి జేతు
మనసు నందున అర్చించి కనుటకన్న
మూడులోకాల వ్యాపించు మూర్తివయ్య
చంద్రశేఖరా! గురువీవె జగతికెల్ల

భావానందలహరిః

తా॥ ఓం చంద్రశేఖరా! నీవు ముల్లోకములకు గురువైన వాడవు. నీకు నాకు సూర్యత్వాన్నిస్తే వేల కరములతో నీకు వస్త్రం తయారుచేసిచ్చెదను. విష్ణుత్వమిచ్చిన బాగుగా వ్యాపించి విరిపూలవాసనతో భక్తిగా కొలిచెదను. వాయుత్వమిచ్చిన సుగంధమును వ్యాపింపచేసి నీ గాత్రమునకు గంధ లేపనము జేసెదను. ఇంద్రత్వమిప్పించిన ఆహారములన్నీ పచనం చేయించెదను.బ్రహ్మత్వమిప్పించిన పాత్రోపచారము జేసి సువర్ణగర్భుడి ననిపించుకుంటాను. మరి నాకే ఘనతలేదయ్యె నిన్ను మనస్సులో అర్చించుటకన్న ఇంకేం చేయగలను.

శ్లో॥ 31

నాలం వా? పరమోపకారక మిదం త్వేకం పశూనాం పతే
పశ్యన్ కుక్షిగతాన్ చరాచరగణాన్ బాహ్యస్థితాన్ రక్షితుం
సర్వామర్త్య పలాయనౌషధ మతిజ్వాలాకరం భీకరం
నిక్షిప్తం గరళం గళేన గిళితం నోద్గీర్ణమేవ త్వయా॥

పద్యరూపాంతరం:

సీ॥ ఉదరంబులో గల్గు, ఒప్పుగా వెలినుండు
జంగమస్థావర సంఘములను
రక్షింప జూచెడి దీక్షాపరుని నిన్ను
కీర్తించ సాధ్యమా! ఆర్తిలేక
"దిక్కుల బారిరి దేవతలెల్లరున్
కాలకూట విషాన కలుగ భీతి,
వలసిన రీతి గరళమును గొంతులో
ఉమియక మ్రింగక నుంచినావు

తే॥ పెద్ద ఉపకారమును జేసి వేల్పువరుల
బ్రోచినాడవు ఓ శివా! బూని కరుణ
నీవు భూతనాధుడవయ్య నిలిచి చూడ
పలుకు ఈ ఒక్క గాధయే చాలుగాదె?

భావానందలహరిః

తా॥ ఓ శివా! నీ ఉదరంలోగల స్థావర జంగమ సంఘంములను భయంకరమైన కాలకూట విషజ్వాలల నుండి రక్షించటానికి దీక్షబూనిన నిన్ను పొగడ సాధ్యమా? దేవతలంతా నలుదిక్కులా పారిపోతే వారిని రక్షించడానికి ఆ కాలకూట విషాన్ని మింగి మళ్ళీ తన ఉదరంలో వున్న లోకాలను రక్షించటానికి ఉమ్మివేయకుండాను మ్రింగకుండాను గొంతులో ఉంచడంవల్ల నల్లగా మారిన కంఠ భాగం కల నీలకంఠుడవు. అటు లోకాలను ఇటు దేవ లోకాలను రక్షించిన నీవే భూతనాధుడవు అని చెప్పుటకు ఈ ఒక్కగాధ చాలదా?

శ్లో॥ 32

జ్వాలో గ్రస్సకలామరాతిభయదఃక్ష్వేళయ కథం వాత్వయాః
దృష్టః కించ కరే ధృతః కరతలే కిం? పక్వ జంబూఫలం
జిహ్వాయాం నిహితశ్చ సిద్ధఘుటికా వా కంఠదేశే భృతః
కిం తే నీలమణిర్విభూషణమయం శంభో! మహాత్మన్!
వద!

పద్యరూపాంతరంః

సీ॥ జ్వాలోగ్రమైనది సహియింపలేనిది
దేవతాళికిని భయావహంబు
కాలకూటంబను గరళంబు నీచేత
ఎట్లు జూడబడెనొ! హే మహేశ!
పండిన నేరేడు పండిదా! అన్నట్లు
అరజేతనుంచావు అవధరించి
జిహ్వపై నుంచావు సిద్ధుల జేసిన
గొప్పదౌ ఔషధ గుళికయట్లు

తే॥ కుత్తుకందున విషమును కూడబెట్ట
నీకు ఇంద్రనీలమణిగ నిగ్గుదేల్చె
అదియు, శంభో! అలంకారమయ్యెనేమొ
ఎఱుక జెప్పుము హిమబాల నేలు స్వామి!

భావానందలహరిః

తా॥ ఓ శంభో! దేవతలకు భయం కలిగించే ఉగ్రజ్వాలలు గల కాలకూట విషం గొంతులోనే ఎలా నిలబెట్టావు? నేరేడు పండువలె నున్న ఆ నల్లని కాలకూట విషం అరచేతిలో ఉంచుకుని సిద్ధులు చేసిన గొప్ప ఔషధమా అన్నట్లు నాలుకపై ఉంచుకుని గొంతులో నిలబెట్టుట చేత నీలకంఠుడవు అయ్యావు. నీకు అదే అలంకారమైనది కదా ప్రభూ!

శ్లో॥ 33

నాలం వా సకృదేవ! దేవ భవతస్సేవా నతిర్వా నుతిః
పూజా వా స్మరణం కథాశ్రవణ మప్యాలోకనం మా దృశాం
స్వామి! న్నస్థిర దేవతానుసరణాయాసేన కిం లభ్యతే?
కావా ముక్తిరితః కుతో భవతి చేత్కిం ప్రార్ధనీయం? తదా॥

పద్యరూపాంతరంః

సీ॥ నీసేవయైనను, నీనమస్కారమ్ము
యైనను, నీస్తోత్రమైనగాని
నీస్మరణంబైన, నీకథ వినుటైన
నీదర్శనంబైన నీలకంఠ!
ఒకసారియైనను ఓదేవ! నావంటి
వానికి చాలదా! పార్వతీశ!
వాటికి మించిన మేటిదా మోక్షంబు!
ఆసేవయేదైన నదియె ఘనము

తే॥ ముక్తినందించు, అందుచే యుక్తమవదు
శాశ్వతము కాని వేల్పుల శరణుబొంద
ఏమి లాభంబు చెప్పుమా ఎరుక పరచు
భూతపతి! యేదికోరుట హితవు అగునొ

భావానందలహరి:

తా॥ ఓ దేవా! నీకు బాగుగా ఒక్కసారి సేవ చేయుట చేతగాని, నమస్కరించుటవల్ల గానీ, స్తోత్రము చేయుట వలన గాని, నీ స్మరణచేతనైనా, నీ కథలు వింటూగానీ, నీ దర్శనం చేయుట చేతనైనా చేసినచో నావంటి వానికి చాలదా? ఓ పార్వతీశ! ఆ మోక్షము వీటన్నిటినీ మించినదా గరళ కంఠా! వాటిల్లో దేనితోనైనా ముక్తి సాధించవచ్చును. వేలాది ఇతర దేవతలని ప్రార్థించి ఏమి లాభం? వారెవ్వరూ మోక్షము నీయజాలరు.

శ్లో॥ 34

కిం బ్రూమస్తవ సాహసం పశుపతే కస్యాస్తిశంభో! భవ
ద్ధైర్యం చేదృశ మాత్మనస్థ్సితి రియం చాన్యైఃకథం లభ్యతే?
భ్రశ్యద్దేవగణం త్రసన్మునిగణం నశ్యత్ప్రపంచం లయం
పశ్యన్ నిర్భయ ఏక ఏవ విహర త్యానంద సాంద్రో భవాన్॥

పద్యరూపాంతరం:

సీ॥ పడిపోవుచున్నట్టి పరదేవతలనెల్ల
నిలిపితి వీశ్వరా! నీవె బూని
భయపడుచున్నట్టి పలువురు మునులకు
భీతి బాపితివయ్య విశ్వనాథ!
నశియించు చున్నట్టి నానా జగంబుల
లయకారకుడవీవె రాజమౌళి!
విహరించు చున్నావు వెరపు నెరుంగక
ఆనందరూపుడై అలరి నీవు

తే॥ ఇట్టి నీవంటి ధైర్యము యెవనికుండు
ఆ స్వకీయమౌ స్థితి కూడ అన్యులకును
ఎట్లు లభియించు? నీ ధైర్యమిపుడునేను
ఏమిజెప్పను పశుపతీ! ఎట్టి రీతి

భావానందలహరి:

తా॥ ఓ శంకరా! భయంకరమైన ప్రళయ కాలంలో దేవతలు సైతం కకావికలవుతుంటే వారిని నిలిపావు. మునులకు భయనిర్మూలన చేశావు. ఓ రాజమౌళీ జగముల లయ సక్రమంగా జరుపుతున్నావు. లయానంతరం ఆనంద రూపుడవై విహరించే నీ ధైర్యం ఎవరికుంటుంది? ఆ స్వకీయమైన స్థితి పరులకు దుర్లభం.

శ్లో॥ 35

యోగక్షేమ ధురంధరస్య సకల శ్రేయఃప్రదో ద్యోగినో
దృష్టాదృష్ట మతోపదేశ కృతినో, బాహ్యాంతరవ్యాపినః
సర్వజ్ఞస్య, దయాకరస్య భవతః కిం వేదితవ్యం? మయా
శంభో!త్వం “పరమాంతరంగ” ఇతి మే చిత్తే
స్మరామ్యన్వహం

పద్యరూపాంతరం:

సీ॥ భక్తుల యోగంబు వారల సేమంబు
వహియించుచున్నావు ఫాలనేత్ర!
అందరి శ్రేయస్సునందించుటే పని
అవునయ్య అనయంబు అదియె నీకు
ఇహపరంబులు దీర్ప ఎన్నియో యుక్తులు
ఉపదేశమును జేయు వ్యోమకేశ!
వెలుపల లోపలన్ విస్తృతి వ్యాపించు
హే దయాకర! శివా! ఇంతకన్న

తే॥ ఏమిగలదయ్య! నాచేత ఎరుగుటకును
నీవు అత్యంత ఆప్తుడవవుట నిజము
అనుచు శంభో! మనంబున అవధరింతు
నిత్యమేను స్మరింతును నిన్ను బూని

భావానందలహరిః

తా॥ భక్తుల యోగ క్షేమాలను పరిరక్షించువాడు, సర్వులకు శుభంకరుడు, ఇహపరములను సాధించుట కొరకు ఉపదేశము జేయువాడు, సర్వజగముల బాహ్యాభ్యంతరాలలో నిండి ఉన్నవాడు, సర్వజ్ఞుడు, కరుణామయుడు అయిన నీకు నేను ఏమి చెప్పగలను? నాకు పరమాప్తుడవు నీవేనని ప్రతినిత్యం ధ్యానిస్తున్నాను.

శ్లో॥ 36

భక్తోభక్తి గుణావృతే ముదమృతాపూర్ణే ప్రసన్నే మనః
కుంభే సాంబ! తవాంఘ్రిపల్లవయుగం సంస్థాప్య సంవిత్ఫలం
సత్త్వం మంత్ర ముదీరయన్ నిజశరీరాగారశుద్ధిం వహన్
పుణ్యాహం ప్రకటీకరోమి రుచిరం కళ్యాణ మాపాదయన్॥

పద్యరూపాంతరంః

సీ॥ నాదేహమను గృహంబిది, దీని పరిశుద్ధి
జేయంగ ఆ సాంబశివుని గొలుతు
కాంతివంతంబైన కళ్యాణముల నెల్ల
పొందంగ భక్తునై పూని నేను
భక్తియన్ దారాన బలముగా జుట్టంగ
బిగియింపబడి యుండె తగిన రీతి
అంతులేనట్టిదౌ సంతోష తీర్థంబు
చే, నింపబడినది సేమకరము
మేలుగా మనసనే కలశంబునన్ యుంచి
పాదపల్లవముల వద్ద నేను

తే॥ జ్ఞాన నారి కేళంబును పూనియుంచి
సత్త్వగుణ ప్రధానంబైన శ్రావ్యమైన
శివమహామంత్ర ప్రకటన జేతు నీకు
ఈశ! పుణ్యాహవాచన మిపుడు జేతు.

భావానందలహరిః

తా॥ ఆది శంకరులు పుణ్యాహవాచన సామాగ్రినే జ్ఞాన సాధనముగా వర్ణిస్తున్నారు. ఓ సాంబశివా! నీకు భక్తుడనైన నేను ఈ దేహమనే గృహాన్ని, శుద్ధి జేసి, కళ్యాణకరమైన శుభములపొందుటకు భక్తియనే బలమైన దారముతో బిగువుగా కట్టి, అంతులేని సంతోషమనే తీర్థంతో నింపబడిన మనస్సనే కలశము నీ పాద పద్మములచెంత నిలిపి, జ్ఞానమనే నారికేళాన్ని ఉంచి, సత్త్వ గుణప్రధానమైన శివ మహామంత్ర ప్రకటన చేస్తాను.

శ్లో॥ 37

ఆమ్నాయాంబుధి మాదరేణ సమనస్సంఘా స్సముద్యన్మనో
మంథానం ధృఢభక్తి రజ్జుసహితం కృత్వా మథిద్వా తతః
సోమం కల్పతరుం సుపర్వసురభిం చింతామణిం ధీమతాం
నిత్యానంద సుధాం నిరంతర రమా సౌభాగ్య మాతన్వతే

పద్యరూపాంతరంః

సీ॥ విద్వాంసులందరు వెలయంగ భక్తియన్
త్రాటిచే గట్టంగ మేటిరీతి
మనసునే కవ్వంబు అను రీతి శ్రుతులను
పాలసంద్రము జిల్క ప్రాప్తమయ్యె
సోముండు, కల్పవృక్షము, కామధేనువు
చింతామణియు, సదాశివుని కృపతొ
శాశ్వతంబైనట్టి ఐశ్వర్యములనిచ్చె
మోక్షలక్ష్మియు దక్కు తక్షణంబె

తే॥ బుద్ధి ఒప్పుగా గలుగుటన్ ఉన్నతులకు
విస్తృతంబై లభించును వెల తరుగని
సిరులు ఆ మహేశ్వర కృప జేత గలుగు
జ్ఞాన సాగరమధనంబు జరుగు చుండ

భావానందలహరిః

తా॥ జ్ఞాన సాగరమధనం చేస్తే కలిగే భాగ్యములెంత గొప్పవో గమనించండి. విద్వాంసులు (దేవతలు) భక్తి అనే త్రాటితో జుట్టి, మనస్సు అనే కవ్వంతో వేదములనే క్షీరసాగరమును చిలికితే ఆ పరమేశ్వరుని కృపజేత సోముడు, కామధేనువు, కల్పవృక్షమూ, చింతామణి, శాశ్వతమైన ఐశ్వర్యాలనిచ్చే మోక్ష లక్ష్మీ, బుద్ధిమంతులకు తక్షణం లభిస్తాయి. ఆ మహేశ్వరుని కృప ఉంటే అన్ని అడ్డంకులు తొలగిపోయి జ్ఞానసాగరమధనం

పూర్తవుతుంది.

శ్లో॥ 38

ప్రాక్పుణ్యాచల మార్గదర్శిత సుధామూర్తిః ప్రసన్నశ్శివ
స్సోమ స్సద్గణ సేవితో మృగధరః పూర్ణస్తమో మోచకః
చేతః పుష్కర లక్షితో భవతి చేదానందపాథోనిధిః
ప్రాగల్భ్యేన విజృంభతే సుమనసాం వృత్తిస్తదా జాయతే

పద్యరూపాంతరం:

సీ॥ పూర్వ పుణ్యంబుల బోలు గుట్టల నుండి
అమృత రూపము చూపి ఆర్తులకును
తాను ప్రసన్నుడై తను సాధుగణముల
మంగళకరుడౌచు మసలు వాడు
మృగధరుండై సర్వజగముల వ్యాపించు
అజ్ఞాన తిమిరాల నణచువాడు
ఆ ఉమా సహితుడు అలరంగ శక్తిచే
మానసాంబరమున మసలువాడు

తే॥ ఆ శివానంద సాగరమందు చెలగి
మనసు కడలిలా ఉప్పొంగు మాన్యులుండ
అపుడు సంస్కృత మనముల నలరు వారు
అందు చరియింత మను కోర్కె పొందగలరు.

శ్లోకాన్వయం శివుని పరంగా చంద్రుని పరంగా

శి॥ పూర్వపుణ్యముల గుట్టల ద్వారా తన అమృత శరీరమును భక్తులకు చూపువాడు
చం॥ తూర్పున నున్న పవిత్ర ఉదయగిరి మార్గమున తన చల్లని రూపం చూపువాడు
శి॥ ప్రసన్నమైనవాడు
చం॥ స్వచ్ఛమైన బింబము కలవాడు
శి॥ మంగళకరుడు
చం॥ ఆహ్లాదకరుడు
శి॥ సాధుగణసేవితుడు
చం॥ నక్షత్ర గణ సేవితుడు
శి॥ లేడిని పట్టుకున్నవాడు

చం॥ లేడివంటి మచ్చగలవాడు
శి॥ సర్వవ్యాపకుడు
చం॥ షోడశకళాపూర్ణుడు
శి॥ అజ్ఞానాంతకుడు
చం॥ చీకటిని తొలగించువాడు
శి॥ ఉమాసహితుడు
చం॥ సోముడు అని పేరుగల చంద్రుడు
శి॥ శక్తిజేత
చం॥ ప్రౌఢిమ జేత
శి॥ మనస్సు అను ఆకాశంలో
చం॥ నింగిలో కనిపించువాడు
శి॥ కలుగునేని
చం॥ దక్కినచో
శి॥ శివానంద సాగరమున ఉప్పొంగును
చం॥ అంతులేని హాయి(సుఖము) కలుగును
శి॥ అప్పుడు
చం॥ అంత

శి॥ సంస్కృతీ మనస్సులకు
చం॥ కలువపూవులకు
శి॥ అందుచరించవలనని
చం॥ వికసించవలెను
శి॥ కలుగును
చం॥ అనిపించును

భావానందలహరిః

తా॥ పూర్వపుణ్యములనే కొండలమీద నుంచి (భక్తులకు) అమృత రూపమును జూపువాడు, ప్రసన్నమైనవాడు, మంగళకరుడు, సాదుగణ సేవితుడు, లేడిని ధరించినవాడు, సర్వవ్యాపకుడు, అజ్ఞానాంతకుడు, ఉమాసహితుడు(సోముడు), శక్తితో మానసాకాశంలో కలిగి ఉంటే ఆ శివానంద సాగరం ఉప్పొంగి అప్పుడు సంస్కృత మనస్సులయినవారు ఆ శివానందలహరిలోనే విహరిస్తుంటారు.

శ్లో॥ 39

ధర్మోమే చతురం ఘ్రికస్సుచరితః పాపం వినాశం గతం
కామక్రోధమదాదయో విగళితాః కాలస్సుఖావిష్కృతః
జ్ఞానానంత్య మహౌషధి స్సుఫలితాకైవల్యనాథే సదా
మాన్యే మానస పుండరీక నగరే రాజావతం సే స్థితే॥

పద్యరూపాంతరం:

సీ॥ కైవల్యమనియెడి ఘన స్థావరమునకున్
ప్రభువై సదాపూజ బడయ చుండ
రాజశేఖరుడవై రంజిల్ల మానస
పుండరీకంబున నుండు కతన
ధర్మంబు నాల్గుపాదంబుల చరియించు
నాదుపాపంబు వినాశమగును
కామక్రోధాదులు ఖర్వమౌ, కాలముల్
సుఖమును ప్రకటించు శుభము కలుగ

తే॥ జ్ఞాన సాధన బాహుళ్యమనెడి గొప్ప
ఔషధంబది సిద్ధించు అవసరంబు
బాగుగా ఫలించినదియు అగును గాక!
భూతనాథా! సదాశివ! పుణ్య చరిత!

భావానందలహరిః

తా॥ కైవల్య పథమునిచ్చు కైవల్యనాథుడైన చంద్రశేఖరుడు నామానసరోజంలో వుండుటచేత ధర్మం నాలుగు పాదాలతో నడుస్తుంది. పాపం రూపుమాసిన దవుతుంది. కామక్రోధాదులవంటి అరిషడ్వర్గాలు దూరమవుతాయి. కాలం పరమ సుఖంతో గడిచి పోతుంది. అనంత జ్ఞానమనె మహౌషధము ఫలితం ఇస్తుంది.

శ్లో॥ 40

ధీయంత్రేణ వచోఘటేన కవితాకుల్యోప కుల్యాక్రమై
రానీతైశ్చ సదాశివస్య చరితాంభోరాశి దివ్యామృతైః
హృత్కేదారయుతాశ్చ భక్తికలమా స్సాఫల్య మాతన్వతే
దుర్భిక్షా న్మమసేవకస్య భగవన్విశ్వేశ! భీతిః కుతః॥

పద్యరూపాంతరం:

సీ॥ బుద్ధియన్ 'మోటతో', బూని వాక్కనియెడి
ఘటముతో కవితయన్ కాల్వనుండి
పిల్లకాల్వలనుండి విరివిగా తేబడ్డ
శివచరిత్రంబనే సిద్ధ జలము
పోయంగ హృదయమన్ పొలమున వరిపండు
భక్తియన్ వరిపైరు బాగ పెరుగు
పుష్కలంబగు పంట వుండుట చేతనే
భాగ్యంబు వృద్ధియౌ ఫలము దక్క

తే॥ నీదు సేవకుడను హరా! ఇది నిజంబు
క్షామమను ఘోరమైనట్టి క్షయమునుండి
భయము ఎక్కడిదయ్య ఓ ఫాలనేత్ర
ఈశ్వరా! విభో! విశ్వేశ! విశ్వరూప!

భావానందలహరిః

తా॥ ఓ విభో! ఈశ్వరా! బుద్ధి అనే 'మోట' సహాయంతో, వాక్కు అనే కడవతో, కవిత్వం అనే పిల్ల కాలువనుండి తేబడిన శివచరిత్ర అనే సిద్ధజలంతో నా మనస్సనెడి పొలంలో భక్తి అనే వరిపైరు బాగా పెరుగుతుంది ఓ హరా! ఇక నీ సేవకుడినైన నన్ను క్షామం ఎందుకు బాధిస్తుంది? నాకేం భయం?

శ్లో॥ 41

పాపోత్పాత విమోచనాయ రుచిరైశ్వర్యాయ మృత్యుంజయ
స్తోత్ర ధ్యాన నతి ప్రదక్షిణ సపర్యా లోక నాకర్ణనే
జిహ్వా చిత్త శిరోంఘ్రి హస్తనయన శ్రోత్రైరహం ప్రార్థితో
మా మాజ్ఞాపయ తన్నిరూపయ ముహూర్మామేవ మా

మేవచః॥

పద్యరూపాంతరంః

సీ॥ పాపంబులనెడి ఉత్పాతంబు తొలగించ
ప్రభవిల్లు సిరులను ప్రాప్తి జేయు
జిహ్వాచే, మనసుచే, శిరసు పాదములచే
కరములనేత్రాల, కర్ణములచె
స్తోత్రించ, ధ్యానించ, జొక్కంగ వందన
మున, ప్రదక్షిణమును, పూజయున్ను
జేయ, నిన్ దర్శించ, శివకీర్తి వినుటకు
ప్రార్థింతు ఆజ్ఞను వడిగనిమ్ము

తే॥ అట్టి స్తోత్రాది సత్క్రియలందు నన్ను
జేరి ప్రోత్సాహమీయరా మఱల మఱల
మూడు కన్నుల పరమేశ! మూగతనము
కలుగ జేయకు దయబూని గరళకంఠ!

భావానందలహరిః

తా॥ పాపములనెడి ఉత్పాతములను తొలగించగా కలిగిన ఐశ్వర్యముల నొసగే పరమేశ్వరా! నిన్ను నేను జిహ్వా చేత, మనస్సుచే, శిరస్సుచేత, కర్ణములచేత క్రమముగా స్తోత్రించుట, ధ్యానించుట, వందనము జేయుట, పూజించుట, దర్శించుట, శివకీర్తి వినుటకై ఓ శంకరా! ప్రార్థించెదను. అట్టి మంచి పనులు చేయుటకు నన్ను పురిగొల్పుము.

శ్లో॥ 42

గాంభీర్యం పరిఖాపదం ఘనధృతిః ప్రాకార ఉద్యద్గుణ
స్తోమ శ్చాప్తబలం ఘనేంద్రియ చయో ద్వారాణి దేహస్థితః

విద్యావస్తు సమృద్ధి రిత్యఖిల సామగ్రీ సమేతే సదా
దుర్గాతిప్రియ! దేవ! మామక మనోదుర్గే నివాసం కురు॥

పద్యరూపాంతరంః

సీ॥ దుర్గపై మరులున్న ధూర్జటీ! ఓ దేవ!
దుర్గంబు జూపింతు నిర్గమమది
గాంభీర్యమే లోతు గలుగు అగడ్తలు
గొప్పధైర్యంబది కోటగోడ
ఉదయించు సుగుణాలె తుదిలేని సైన్యంబు
ధైర్యంబు మెండుగా దరియున్న
గొప్ప ఇంద్రియముల గుంపులే ద్వారాలు
ఆత్మయ నాత్మల నరయు నేర్పు

తే॥ పుష్కలంబుగా వస్తువులుండుటగును
అన్ని సంభారములు గల్గి యున్నదయ్య
నా మనస్సను దుర్గాన నయము గలుగ

ఎల్ల వేళల నివసించు మిక మహేశ!

భావానందలహరి:

తా॥ దుర్గాదేవిపై అనురాగం గల ఓ ధూర్జటీ! నీకు చొరరాని ఒక దుర్గము గురించి చెబుతాను, వినుము. ఆ దుర్గానికి గాంభీర్యమనే లోతైన అగడ్తలు, ధైర్యమనే చక్కటి కోటగోడ, బహిర్గతమయ్యే సుగుణాలే అంతులేని సైన్యంగానూ, ఇంద్రియ సమూహమే ద్వారములుగాను, ఆత్మ అనాత్మలను తెలుసుకునే నేర్పే పుష్కలముగా నున్న వస్తు సముదాయములుగానూ ఉన్న నా మనస్సే ఆ దుర్గము. నీవు భద్రంగా ఎల్లవేళలా ఆ దుర్గంలో నివసించుము స్వామీ!

శ్లో॥ 43

మా గచ్ఛస్త్వమిత స్తతో గిరిశ భో! మయ్యేవ వాసం కురు
స్వామిన్నాదికిరాత మామక మనః కాంతార సీమాంతరే
వర్తంతే బహుశో మృగా మదజుషోమాత్సర్య మోహాదయ

స్తాన్హత్వా మృగయా వినోదరుచితా లాభం చ సంప్రాప్స్యసి॥

పద్యరూపాంతరం:

ఉ॥ ఆది కిరాత! వేటకని అచ్చటి కిచ్చటి
కేగనేలరా?
నాదగు మానసంబును వనంబున మచ్చర
మోహభావనల్
మోదము ద్రుంచు, ఆ మదము ముంచునుగా,
వని జంతు జాలమున్
నీదయ జంపి వేటగల నేర్పును జూపుము
లాభమొందుమా.

భావానందలహరి:

తా॥ ఆది కిరాతా! ఓ శివా! నీవు వేటకోసం అక్కడికి ఇక్కడికీ వెళ్ళటం దేనికయ్యా? నా మనస్సే పెద్ద అడవిగదా! సంతోషాన్ని నాశనం చేసే మచ్చరము మోహము, మదము నన్ను నిలువునా ముంచు అడవి జంతువులు. నీ దయతో వాటిని సంహరించి

వేటలోగల నీ నేర్పు ప్రదర్శించుము. ఎంతో లాభం కూడా పొందుము.

శ్లో॥ 44

కర లగ్న మృగః కరీంద్ర భంగో
ఘన శార్దూల విఖండనోఽస్త జంతుః
గిరిశో విశదాకృతిశ్చ చేతః
కుహరే పంచముఖోఽస్తి కుతో భీః?

పద్యరూపాంతరం:

చం॥ మృగమును చేధరించినది, మేటి కరీంద్రము
జంపు దానినిన్,
పగగొని బెబ్బులిన్ బిగియ బట్టుచు చంపెడిదిన్,
వనంబులన్
మృగముల ప్రాణముల్ గొనెడి మేటి, గిరిన్
శయనించు ఏలికన్
తగువిధి శ్వేత దేహమును దాల్చిన పంచముఖిన్
దయన్

సొగసుగ మానసంపు గుహ జొచ్చుచు నుండగ
భీతియేలనో!

భావానందలహరి:

తా॥ లేడిని చేతిలో పట్టుకునేది, పెద్ద ఏనుగును సంహరించ గలది, బెబ్బులి చంపునది, అడవులలో జంతువుల ప్రాణం తీసేది. కొండలలో (గుహల్లో) నిద్రపోయేది, తెల్లటి దేహం కలది, పంచముఖియైనది దయతో నా మానసంబనెడి గుహలో నాకు ఇంకా భయం దేనికి? ఇందులో మృగరాజయిన సింహమునకు, పరమేశ్వరునికి సామ్యమును జూపుచూ సింహమే తనకు రక్ష అయితే ఇంక భయం దేనికి అంటున్నారు.

1. మృగమును చేధరించినది సింహము
   లేడిని చేతిలో పట్టుకున్నవాడు శివుడు
2. కరీంద్రమును చంపునది సింహము
   గజాసురుని చంపినవాడు శివుడు

3. బెబ్బులిని చంపునది సింహము
వ్యాఘ్రాసురుని చంపినవాడు శివుడు
4. వనములలో జంతువులను చంపునది సింహము
లయకారకుడు శివుడు
5. గిరిలో శయనించునది సింహము
కైలాస పర్వతమున శయనించు శివుడు
6. శ్వేత దేహమును దాల్చినది సింహము
తెల్లని దేహఛాయగల శివుడు
7. పంచముఖి సింహము
ఐదు ముఖములు కలవాడు శివుడు
8. గుహలో దూరునది సింహము
మనస్సనే గుహలో ప్రవేశించు వాడు శివుడు

శ్లో॥ 45

ఛంద శ్శాఖి శిఖాన్వితై ర్ద్విజవరై స్సంసేవితే శాశ్వతే
సౌఖ్యాపాదిని ఖేదభేదిని సుధాసారైః ఫలైర్దీపితే।
చేతః పక్షిశిఖామణే! త్యజ వృథా సంచారమన్యై రలం

నిత్యం శంకర పాదపద్మయుగళీ నీడే విహారం కురు॥

పద్యరూపాంతరం:

సీ॥ వేదంబులనియెడి విరిసిన తరుశాఖ
ఆశ్రయంబై యున్నదదియు మరియు
ద్విజులు సేవించినదియు, శాశ్వతంబైన
సౌఖ్య సంపాదన జరుపునదియు
సుధలొల్కు ఫలముల ఖేద నివారణ
కొరకు సేవించెడి గుణము కలది
జగదీశు పదపద్మ యుగళమన్ గూటిలో
సేదదీరెడి హాయి కుదిరియుండ

తే॥ మనసు నాబడు పక్షీంద్ర! మాట వినుము
అట్టి గూటిలో విహరించు నదియె సుఖము
అన్య యత్నంబులున్ చాలు, వ్యర్థమగును
విడిచి సంచారమికపైన విడియు మిచటె

భావానందలహరి:

తా॥ మనస్సు అనబడు పక్షీంద్రమా! ఈవృక్షము నొకసారి చూడు. దీనికొమ్మలు వేదములు, బ్రాహ్మణులు సేవించి శాశ్వత సుఖప్రాప్తి పొందు నెలవు. దుఃఖ నివారణకు అమృత ఫలముల నొసగునది పరమేశ్వరుని పాదపంకజముల చేత హాయిగా సేదతీరుతూ ఉండవచ్చు. ఈ వృక్షంలో భక్తి అనే చక్కటి గూడు కట్టుకుని ఉండి విహరించరాదా! నీకు అనవసరమైన ఇతర యత్నములు దేనికి? వ్యర్థము కదా! హాయిగా ఇక్కడే ఉండు.

శ్లో॥ 46

అకీర్ణే నఖరాజికాంతి విభవై రుద్యత్సుధా వైభవై
రాధౌతేపి చ పద్మరాగ లలితే హంస వ్రజై రాశ్రితే
నిత్యం భక్తి వధూగణైశ్చ రహసి స్వేచ్ఛా విహారం కురు

స్థిత్వా మానసరాజహంస! గిరిజానాథాంఘ్రి సౌధాంతరే॥

పద్యరూపాంతరం:

సీ॥ నఖముల కాంతిచే నయముగా యెల్లెడన్
నిండియున్నదియును మెండుగాను
శుక్లపక్షమునందు జొక్కిన చంద్రుని
అమృతంపు కిరణాల వ్యాప్తి కలుగ
పరిశుభ్రపరచిన పద్మాల అరుణిమన్
ఇంపుగా గనిపించు ఈ పదములు
"సోహం" బనే గొప్ప శుభ మంత్ర జపమును
పలుకు ఆశ్రితులచే బడసినదియు
నైన ఉమాపతి అంఘ్రి సౌధంబున
ఏకాంత వాసంపు ఇచ్ఛగలుగ

తే॥ భక్తియును ప్రియ భార్యల వరుసజేత
జిక్కి నిత్యంబు స్వేచ్ఛగా జొక్కియుండు
మానసంబన్ మరాళమా! ఘనత కలుగ
సంచరించుము ఇంకేల శంక నీకు

ఇందులో మనస్సును రాజహంసతో పోలుస్తున్నారు. హంసలు గోళ్ళవలెను, శుక్లపక్ష చంద్రునివలెను, పరిశుద్ధమైన పద్మాలవలెను, సోహం మంత్ర పఠించే పరమ హంసల వలెను, ఉంటాయి. మనస్సనే రాజహంస అదే గుణాలు కలిగి ఉంటుంది.

భావానందలహరిః

తా॥ ఓ మానస రాజహంసమా! తెల్లని గోళ్ళ కాంతిచే నిండినదియు, శుక్లపక్ష చంద్రుని కాంతివలె దినదిన ప్రవర్ధమానమవునదియు, పరిశుద్ధమైన పద్మముల అరుణిమయు కలిగినవియును, సోహం అనే మంత్రోచ్చారణ జేయు ఆశ్రితులు కొలిచెడి ఉమాపతి అంఘ్రియుగ్మమున ఏకాంత వాసము జేయుచు, భక్తి అనే ప్రియ భార్యలతో స్వేచ్ఛగా నిస్సంకోచంగా సంచరించుము.

శ్లో॥ 47

శంభుధ్యాన వసంత సంగిని హృదారామే-ఘ జీర్ణచ్ఛదాః
స్రస్తాభక్తి లతాచ్ఛటా విలసితాః పుణ్య ప్రవాళాశ్రితాః
దీప్యంతే గుణ కోరకా జపవచః పుష్పాణ్ శ్చ సద్వాసనాః
జ్ఞానానంద సుధా మరంద లహరీ సంవిత్ఫలాభ్యున్నతిః॥

పద్యరూపాంతరంః

సీ॥ సర్వేశు జ్ఞాన వసంతంబుతో తాను
సంయోగమొందిన చక్కనైన
పూదోట వంటిది నాదు హృదయమది
ఆమని శోభతో అలరుచుండె
అఘములు అను యెండుటాకులు రాలెను
చేసిన పుణ్యముల్ చిగురుదాల్చె
భక్తియే లతలాయె మంచి గుణంబులే
మొగ్గలు, జపములే పూవులాయె
సంస్కారములు పలు సత్కర్మలాయెను

పరవశంబొనరించు పరిమళములు

తే॥ జ్ఞాన మానంద అమృతంబు తానె మధువు
కాగ, దాని ప్రవాహాన ఘనత గల్గు
బ్రహ్మజ్ఞానమన్ ఫలముల ప్రాప్తి కలుగ
జ్ఞానమే ప్రకాశించును మనసునందు

భావానందలహరిః

తా॥ ఓ సర్వేశ్వరా! నా హృదయం జ్ఞానమను వసంతం వచ్చిన పూదోట. దానిలోని పాపములనే ఎండుటాకులు రాలిపోతున్నవి. చేసుకున్న పుణ్యం చిగురులై శోభిస్తున్నాయి. భక్తి అనే పూతీగెలు, సుగుణములనే మొగ్గలు, జపములను పూలు పుష్కలంగా ఉండుట చేత ఎన్నో సత్కర్మలు సంస్కారములు అనే పరిమళాలను వెదజల్లుతున్నాయి. జ్ఞానమనే ఆనందామృతమే ఆ పూల మకరందము. ఆ చెట్టుకు బ్రహ్మ జ్ఞానమనే ఫలం కాసింది. ఆ ఫలాన్నాస్వాదిస్తే మనస్సులో

జ్ఞానం ప్రకాశిస్తుంది.

శ్లో॥ 48

నిత్యానంద రసాలయం, సురముని స్వాంతాంబు జాతాశ్రయం
స్వచ్ఛం సద్ద్విజ సేవితం కలుషహృ త్సద్వాసనావిష్కృతం।
శంభుధ్యాన సరోవరం వ్రజ మనోహం సావతంస! స్థిరం
కిం క్షుద్రాశ్రయ పల్వల భ్రమణ సంజాతశ్రమం ప్రాప్స్యసి

పద్యరూపాంతరంః

సీ॥ అల్పుల ఆశ్రయంబనెడి బురదగుంట
సంచరించుట వంటి శ్రమయదేల?
శాశ్వతానందమున్ జలములే నెలవుగా
చిరస్థాయిగా పొందు వరము వలదె?
సుర, ముని గణముల సుందర హృత్పద్మ
ములకు నాధారమై చెలగునదియె
రాజహంసల వంటి ద్విజ వరుల్ సేవింప
గా పాప హరణంబు గరపుదాని

తే॥ మంచి సంస్కారములచేత ప్రకటమయెడి
భవుని ధ్యాన మానస సరోవరము వరము
పొందవెనకాడు చుంటివి యెందు కంట

మానసంబను హంసమా! మాన్యురాల

భావానందలహరి:

తా॥ ఓ మానస రాజహంసమా! ఎందుకు అల్పుల ఆశ్రయం అనే బురద గుంటలో శ్రమమును పొందుతావు? శాశ్వతానంద జలములకు నెలవైనదియు, దేవతల మునుల హృద్పద్మముల కాధారమైన నిర్మలమైనది, బ్రాహ్మణులచే సేవించబడునదియు సత్సంస్కారముచే పాప పరిహారమై ప్రకటిత మగునదియునగు పరమేశ్వర ధ్యానమనెడి మానస సరోవరమును పొందుము.

శ్లో॥ 49

ఆనందామృతపూరితా హరపదాంభోజాల వాలోద్యతా
స్థైర్యోపఘ్నముపేత్య భక్తిలతికా శాఖోపశాఖాన్వితా
ఉచ్ఛై ర్మానస కాయమానపటలీ మాక్రమ్య నిష్కల్మషా
నిత్యాభీష్ట ఫలప్రదా భవతు మే సత్కర్మసంవర్ధితా॥

పద్యరూపాంతరం:

సీ॥ పరమశివానంద మను జలంబుల జేత
పోషింపబడినదై వుండునదియు
ముక్కంటి పద పద్మములుయని పేరున్న
'పాదు' నుండి పెరిగినదియు తాని
బలుదృఢ చిత్తమన్ 'పాకుడు కొయ్యపై'
శాఖోపశాఖలై చాలపెరిగి
మనసను ఎత్తైన పందిరిన్ వ్యాపించి
భక్తియన్ పూతీగ బడసె వృద్ధి

తే॥ కల్మషంబులు నశియించు కతన, నాకు
తొల్లి పుణ్యకర్మల చేత వెల్లివిరిసి
ఎల్లవేళల నాకున్న ఈప్సితములు
తీర్చునది తాను అగుగాక త్రిపురవైరి!

భావానందలహరి:

తా॥ పరుమ శివానంద జలములచే బాగుగా పోషించ బడినదియు, ముక్కంటి పాదపద్మములనే 'పాదు' నుంచి బాగుగా పెరిగినదియు, ధృఢ చిత్తమను 'పాకుడు కొయ్య' ఆధారంగా బాగుగా పాకి శాఖోప శాఖలైనదియు మనస్సనే ఎత్తైన పందిరి మీద వ్యాపించి, భక్తి అనే పూలతీగ వృద్ధి చెందును. కల్మషములు తొలిగి పోవుటచే పూర్వజన్మ పుణ్యఫలంచే ఈప్సితములన్నీ నెరవేరుగాక.

శ్లో॥ 50

సంధ్యారంభ విజృంభితం శ్రుతిశిర స్థానాంతరాధిష్ఠితం
సప్రేమ భ్రమరాభిరామ మసకృ త్సద్వాసనా శోభితం
భోగీంద్రాభరణం సమస్తసుమనః పూజ్యం గుణావిష్కృతం
సేవే శ్రీగిరి మల్లికార్జున మహాలింగం శివాలింగితమ్॥

పద్యరూపాంతరం:

సీ॥ సాయం సమయమున చక్కటి నృత్యంబు
చేసి విజృంభించు వాసిగాంచు
అలరును శ్రుతులందు అన్యస్థానంబులన్
తానధిష్ఠించుచు తనరుచుండు
ప్రేమాన్వితమై యొప్పు భ్రమరాభిరామయై
సుమనోహరంబుగా జూడనయ్యె
భోగులు ప్రియముగా బూన ఆభరణమై
సాధు భావనలన్ని జతగనుండు
సుమనస్సులున్ పూజ శోభిల్ల జేతురు
గుణములచే నొప్పు ఘనత కలుగు

తే॥ గిరిజ పరిరంభమున జేరు సరస మొప్ప
మల్లికార్జున నిలయమై వెల్లి విరియు
శ్రీ నగంబు మహాలింగ సేవ గొలువ
జీవనంబది ధన్యమై చెలగుచుండు

ఈ శ్లోకంలో శ్రీశైల మల్లికార్జున స్వామి పరంగాను, మల్లికార్జున పుష్పాలపరంగాను అన్వయించుకోవచ్చు.

1. మల్లికార్జున స్వామి పరంగా
2. మల్లికార్జున పూవుల పరంగా

సాయంకాలం నటరాజు నాట్యం ప్రారంభించాడు
సాయంకాలం మల్లికార్జున పూవులు ఆడుతున్నాయి.
శ్రుతులే(వేదాలు) ఆభరణాలు
చెవులకి ఆభరణాలైన పూవులు
భ్రమరాంబ అని శివుని పరంగా అర్థం
తుమ్మెదలు మనోహరంగా ఉన్నాయి.
భోగీంద్రునిపై అనగా సర్పరాజుతో ఉన్నవాడు శివుడు
మిక్కిలి భోగించే మృదు భావనలు గలవారు
సుహృదయులైన దేవతలు అని శివుని పరంగా
పుష్పములని పూల పరంగా
గుణములు అంటే సద్గుణాలు శివుని పరంగా
దారము అని పూల పరంగా

భావానందలహరిః

తా॥ సాయం సమయాలలో చక్కని నృత్యం చేస్తాడని ప్రసిద్ధి గాంచిన పరమశివుడు వేదములలోను అన్య స్థానములలోనూ శోభిల్లు చుండును. ప్రేమ పూరితయైన భ్రమర సుమనోహరంగా కనిపిస్తుంటుంది. భోగులు (సర్పములు) ఆభరణములైన వానికి సాధు భావనలు ముప్పిరి గొని యున్నవి. సుమనస్కులు (దేవతలు) శోభిల్లగా పూజ చేస్తారు. ధృఢమైన గుణములచే స్థిరపరచబడి, పార్వతీ దేవి కౌగిట చేరిన మల్లికార్జునుని నిలయమైన శ్రీశైలంలోని మహాలింగాన్ని సేవతో కొలువగా జీవితం ధన్యమై పోతుంది.

శ్లో॥ 51

భృంగీచ్ఛా నటనోత్కటః కరిమద గ్రాహీ స్ఫురన్మాధవా
హ్లాదో నాదయుతో మహాసితవపుః పంచే షుణాచాదృతః
సత్పక్ష స్సుమనో వనేషు స పునస్సాక్షాన్మదీయే మనో
రాజీవే భ్రమరాధిపో విహరతాం శ్రీశైలవాసీ విభుః॥

పద్యరూపాంతరంః

సీ॥ భృంగియన్ ప్రమధేశు ప్రీతికై నృత్యంబు
ఉత్కంఠ సలిపెడి ఉమ విభుండు
గజమదదమనుండు, కడుప్రీతి మాధవున్
స్త్రీ రూపమున నుండ జేరువాడు
నాదసమేతుండు నయముగా తెల్లని
ఘనమైన దేహంబు కలుగువాడు
సుమనుల రక్షించు చుట్టమై స్వయముగా
పక్షపాతము జూపి పరమ శివుడు

తే॥ భ్రమర నాధుండు లోకాల ప్రభువతండు
అట్టి శ్రీశైలవాసుని ఆ త్రినేత్రు
నాదు మనసను పద్మాన ఒదిగి యుండు
నేరుగా విహరించుగా మరల మరల

భావానందలహరిః

తా॥ భృంగియను ప్రమథగణనాయకుని ప్రీతికై తాండవ నృత్యం సలిపే ఉమానాధుడు, గజాసుర గర్వభంజనుడు మోహినియైన మాధవుని రంజింప చేసినవాడు, నాదరూపమైనవాడు, చక్కటి తెల్లని దేహం కలిగినవాడు, సుబుద్ధి గలవారిని స్వయంగా తానే పక్షపాత బుద్ధితో కాపాడే పరమశివుడు, భ్రమరాంబా దేవికి నాధుడైన ఆ శ్రీశైలవాసుడు లోకాల ఏలిక. ఆయన త్రినేత్రుడు నా మానస సరోజమున వసించుచూ మరల మరల విహరించును.
(భృంగి అనగా గండు తుమ్మెద అనియూ చెప్ప వచ్చును. ఆది శంకరుల ఈ శ్లోకమునకు గండు తుమ్మెదల పరంగా అర్థం అన్వయించుకోవచ్చును)

శ్లో॥ 52

కారుణ్యామృతవర్షిణం ఘనవిపద్ గ్రీష్మచ్ఛిదా కర్మఠం
విద్యాసస్యఫలోదయాయ సుమనస్సం సేవ్య మిచ్ఛాకృతిమ్
నృత్యద్భక్త మయూర మద్రినిలయం చంచజ్జటామండలం
శంభో! వాంఛతి నీలకంధర! సదా త్వాం మే మనశ్చాతకః

పద్యరూపాంతరం:

సీ॥ జలముల వర్షించ జలధరంబులు, గ్రీష్మ
తాపంబు నశియించి దరికి రాదు
సస్యఫలంబిచ్చి చక్కగా రైతును
మన్నించు నాకృతిన్ మార్చుకొనుచు
సుమనుల తాపంబు నీమంబుగా బాపి
రక్తితో నర్తించు రక్షకుండు
మేఘంబు వలె దోచు మేటి ఆ శంభుండు
కరుణామృతంబును కురియ జేయు

తే॥ మెఱుపు ఝళిపింప తీగలై, మెఱియనింగి
చూడగా కదలెడి జటాజూటమందు
మనసు నాదయ్యె చాతక పక్షివోలె
నిన్నుగోరుచు తిరుగును నీలకంఠ!

భావానందలహరి:

తా॥ జలధరములైన మేఘములు వర్షించగా గ్రీష్మతాపము నశించును. అవి రైతును పంటల ఫలమిచ్చి కాపాడుతాయి. తమ ఆకృతిని మార్చుకుంటూనే ఉంటాయి. సరిగ్గా అదే విధంగా ఆ నీలకంఠుడు సుబుద్ధి కలవారిని బాధలను నివారించి సంతోషముతో నర్తించును. ఆ శంభుడు మేఘమువలె కనిపించుటే గాక కరుణామృతమును వర్షించును. కదులుచుండు జటాజూటము (తెల్ల వెంట్రుకలుండుట చేత) మెరుపులు మెరుస్తున్నట్లు కనిపించు ఆకాశమువలె భ్రాంతి కలిగించుచు మేఘముల మెరుపులని భ్రమించి నామనస్సనే చాతక పక్షి నిన్ను కోరుచూ విహరించుచున్నది.

శ్లో॥ 53

ఆకాశేన శిఖీ సమస్త ఫణినాం నేతా కలాపీ, నతా
నుగ్రాహీ ప్రణవోపదేశ నినదైః కేకీతి యోగీయతే।
శ్యామాం శైలసముద్భవాం ఘనరుచి దృష్ట్వా నటంతం ముదా
వేదాంతోపవనే విహార రసికం తం నీలకంఠం భజే

పద్యరూపాంతరం:

సీ॥ శిఖిపింఛములవారు శివుడును నెమలియు
మెండైన కన్నులనుండువారు
ఆకాశమే శిఖ, ఆ కలాపంబుగా
ఫణిరేడు కుదిరిన త్రినయనుండు
శ్యామల గిరిసుత ఆ మేఘ సదృశన్
గాంచి పరవశించి కనులు మెరయ
నాట్యంబు నాడెడి నటరాజు గొల్చెదన్
ఓంకార మంత్రంబునుచ్ఛరించి

తే॥ అట్టి ఉపనిషద్వ్యాసమందు చెలగి
తాను విహరించుచుండుటన్ అనవరతము
ప్రీతిగలవాని, శంభుని విమలచరిత
గలుగు వానిని భజియింతు నీలకంఠు.

భావానందలహరి:

తా॥ ఆ పరమేశ్వరునికి, కేకి అని పిలువబడే నెమలికి గల పోలికలతో ఉత్ప్రేక్షించు ఆదిశంకరుల చమత్కృతి ఇది. శంకరుడు నెమలి శిఖపై పింఛము గలవారు. రెండుకంటె ఎక్కువ కన్నులు కలవారు. నెమలి శివుడు నాట్యప్రియులు. మేఘమును గాంచి నెమలి పరవశిస్తే మేఘమువలె శ్యామలయైన గౌరిని చూసి శివుడు పరవశిస్తాడు. అటువంటి నటరాజుని ఓంకార మంత్రమునుచ్ఛరించి ఆరాధిస్తాను. ఉపనిషద్వ్యాసవన విహారి ప్రియుడైన గరళకంఠుని నేను సదా భజించెదను.

శ్లో॥ 54

సంధ్యా ఘర్మదినాత్యయో, హరికరాఘాత ప్రభూతానక
ధ్వానో వారిద గర్జితం, దివిషదాం దృష్టి చ్ఛటా చంచలా।
భక్తానాం పరితోష బాష్ప వితతి ర్వృష్టి ర్మయూరీ శివా
యస్మి న్నుజ్జ్వల తాండవం విజయతే శ్రీ నీలకంఠం భజే॥

చం॥ ఉరుములు, దేవదుంధుభికి ఒప్పగ శ్రీహరి
చేతి తాడనల్
మెరుపుల తీగలౌను అనిమేషుల చూడ్కులు,
భక్తులశ్రువుల్
కురియును వానయై ముదము గూడగ, గ్రీష్మ
సమాప్తి సంధ్యయౌ
గిరిజయె తాన్మరాళముగ క్రీడలు జూపును
ఉజ్వలంబుగా
హరుడటువంటి తాండవము నాడగ గొల్చెద
నీలకంధరున్

భావానందలహరిః

తా॥ గ్రీష్మకాల సమాప్తిలో సంధ్యా సమయము కాగా ఆకాశం ఉరుముతుంది. అది దేవదుంధుభిమీద శ్రీహరి చేతితో చరిచే చేతిదెబ్బలా అన్నట్లుంది. అని మేషులైన (రెప్పలు వాల్చని) దేవతల చూపులు తళతళలాడే మెరుపు తీగెలు. భక్తులు కార్చు ఆనంద భాష్పాలు చినుకులు. అటువంటి సమయంలో పరమేశ్వరుని జూచి పరవశించిన గిరిజ మహోన్నతంగా, ఆడు నెమలి వలె నాట్యం నాట్యముతో ఆడుట చూపిస్తుండగా శంకరుడు అదే విధంగా ఆమెతో తాండవ నృత్యం చేస్తుంటే, ఆ నీలకంఠుని కొలిచెదను.

శ్లో॥ 55

ఆద్యాయామిత తేజసే శ్రుతిపదై ర్వేద్యాయ సాధ్యాయతే
నిత్యానందమయాత్మనే త్రిజగత స్సంరక్షణోద్యోగినే
ధ్యేయా యాఖిలయోగిభి స్సురగణైర్గేయాయ మాయావినే
సమ్యక్తాండవ సంభ్రమాయ జటినే సేయం నతి శ్శంభవే॥

పద్యరూపాంతరం:

సీ॥ వేద వాక్యముతోనె వేద్యుండు శంభుడు
సాధింప వీలైన సద్గురుండు
సచ్చిదానందమన్ సద్రూపి, త్రిజగాల
రక్ష ప్రవృత్తియౌ దక్షుడతడు
యోగులందరిజేత తగు విధి ధ్యానింప
దగు, ఆది పురుషుడు ధవళ రూపి
దేవగణంబులు దీరిచి కీర్తించ
దగువాడు, ప్రకృతికి తానె స్వామి

తే॥ చక్కనౌ తాండవము జేత సంభ్రమంబు
గరపువాడు, జటా జూటధారి శివుడు
శుభకరుండును తేజస్వి అభయ దాత
నీకు వందనంబిదె స్వామి నీలకంఠ!

భావానందలహరిః

తా॥ వేదములచే మాత్రమే తెలుసుకోదగినవాడు, సద్గురుడు శంకరుడు. సచ్చిదానంద స్వరూపుడు. జగద్రక్షయే ప్రవృత్తిగలవాడు. యోగులందరిచే ధ్యానింపబడే ఆది పురుషుడు. దేవగణములచే కీర్తించబడే శివుడు ప్రకృతి శక్తికే అధినాథుడు. చక్కటి తాండవ నృత్యంతో ఆశ్చర్యపరచువాడు. జటా జూటధారి, శుభంకరుడు, తేజస్వి, అభయ ప్రదాతయైన ఓ నీలకంఠా! నీకిదే నావందనము.

శ్లో॥ 56

నిత్యాయ త్రిగుణాత్మనే పురజితే కాత్యాయనీ శ్రేయసే
సత్యా యాదికుటుంబినే మునిమనః ప్రత్యక్ష చిన్మూర్తయే
మాయా సృష్ట జగత్త్రయాయ సకలామ్నాయాంత సంచారిణే
సాయం తాండవ సంభ్రమాయ జటినే సేయం నతి శ్శంభవే॥

పద్యరూపాంతరం:

సీ॥ త్రిగుణాలు గలవాడు, త్రిపురారి, నిత్యుండు
కాత్యాయనీ శుభంకరుడు శివుడు
సత్యమూర్తియు, ఆది సకుటుంబి తానయ్యె,
మునివరేణ్యుల యొక్క మనసులందు
అవుపించు చిన్మూర్తి, అద్భుత మాయచే
జగముల సృష్టించు జగతికర్త!
ఉపనిషద్గోచరుండుత్తమంబౌ విధిన్
ప్రతిపాదనముగల పరమ శివుడు

తే॥ సంధ్యవేళ తాండవమును సంభ్రమముగ
సలుపు జటధారియైనట్టి శంభునికిని
శుభములవుగాక! లోకాలకభయమీయ
నా నమస్కారమును జేతు నేను ఇపుడు

భావానందలహరి:

తా॥ త్రిగుణములు గలవాడును, త్రిపురాసురుల వైరియు, నిత్యుడునూ కాత్యాయనికి శుభప్రదుడునుయైన శివుడు సత్యమూర్తియు, ఆదికుటుంబియు తానే అయ్యాడు. ముని శ్రేష్ఠుల మనస్సులలో స్ఫురించే చిద్రూపియై తన మాయా శక్తిచే జగత్ సృష్టికర్త అయ్యాడు. చక్కగా ఉపనిషత్తులచే గోచరమై ప్రతిపాదింపబడినవాడే ఆ పరమేశ్వరుడు. సంభ్రమం కలిగించే రీతిగా సాయంకాలవేళ తాండవ నృత్యం చేసే జటాజూటధారియైన శంభుని, సర్వలోక అభయప్రదాతకు నేను నమస్కరించెదను.

శ్లో॥ 57

నిత్యం స్వోదర పోషణాయ, సకలాముద్దిశ్య విత్తాశయా
వ్యర్థం పర్యటనం కరోమి భవత స్సేవాం న జానే విభో!
యజ్జన్మాంతర పుణ్యపాక బలత స్త్వం శర్వ! సర్వాంతర
స్తిష్ఠ స్యేవ హితేనవా పశుపతే! తే రక్షణీయో స్మ్యహమ్॥

పద్యరూపాంతరం:

ఉ॥ స్వోదర పోషణార్థమిల జొచ్చుచు భాగ్యము
లుండు ఇండ్లనే
నాదర మొందనాయె! అటు వ్యర్థము గొల్చుట,
నేర్వ నైతినే,
నీదగు సేవ శర్వ! గాని నేగత జన్మల పుణ్య
ప్రాప్తిచే
నీదయ పొంద, రక్షగొన నేతగు అర్హుడ
బ్రోవుమీశ్వరా!

భావానందలహరి:

తా॥ ఈ లోకంలో నాకడుపు నింపుకొనుటకు భాగ్యవంతుల ఇళ్ళకు వెళ్ళి గౌరవహీనుడినయ్యాను. వారిని గొల్చుట వ్యర్థము అని తెలుసుకోలేక పోయాను. కాని నాగత జన్మల పుణ్యవశం చేత ఓ శర్వా! నీ సేవ చేపట్టాను. ఇప్పుడు నేను నీదయ, నీ రక్ష పొందుటకు అర్హుడను. ఓ ఈశ్వరా! నన్నిక కాపాడుము ప్రభూ!

శ్లో॥ 58

ఏకో వారిజబాంధవః క్షితి నభోవ్యాప్తం తమో మండలం
భిత్వాలోచన గోచరోపి భవసి త్వం కోటిసూర్య ప్రభః
వేద్యం కిం? నభవ స్యహో! ఘనతరం కీదృ గ్భవేన్మత్తమ
స్తత్సర్వం వ్యపనీయ మే పశుపతే! సాక్షాత్ప్రసన్నో భవ॥

పద్యరూపాంతరం:

ఉ॥ ఒక్కడె సూర్యుడైన నతడుర్విని దోలును
అంధకారమున్
చక్కగ జూపునెల్లరకు సర్వజగంబును,
కోటి సూర్యులున్
ఒక్కడె జేరు కాంతిగల ఉత్తమునెంచను
యెంత మూర్ఖుడన్
మిక్కిలి జ్ఞాన హీనుడను మేలగు నీకృప
జూపు మీశ్వరా!

భావానందలహరిః

తా॥ ఒక్కడు సూర్యుడు ఈ లోకాన్నంతా అంధకార నిర్మూలనజేసి అందరికీ చక్కగా చూపుతున్నాడు. మరి ఒక్కచోట కోటిమంది సూర్యులు చేరితే కలిగే తేజస్సుకల నిన్ను సర్వోత్తమునిగా తలచని మూర్ఖుడి నయ్యాను. జ్ఞానశూన్యుడనయ్యాను. ఇక నీవే నీదయ మేలు కలిగేలా జూపించి రక్షించాలి ఈశ్వరా!

శ్లో॥ 59

హంసః పద్మవనం సమిచ్ఛతి యథా, నీలాంబుదం చాతకః
కోకః కోకనదప్రియం ప్రతిదినం చంద్రం చకోర స్తథా
చేతో వాంఛతి మామకం పశుపతే! చిన్మార్గమృగ్యం విభో
గౌరీనాథ! భవత్పదాబ్జయుగళం కైవల్య సౌఖ్యప్రదమ్॥

పద్యరూపాంతరంః

సీ॥ ఏరీతి హంసంబు సరసిజంబులు గల్గు
మానస కాసారమున చెలంగు
ఏరీతి చాతకం బరయును మేఘుని
వర్షబిందులు ద్రావ వరము కొరకు
ఏరీతి కోకంబు కోరును సూర్యుని
కాంతిని తిండిగా కడుపు నింద
ఏరీతి పక్షి చకోరంబు వెన్నెలన్
ఆహారముగ కోరు అమిత రక్తి

తే॥ మనసు ఆరీతి కోరెను జ్ఞానమరయ
నీదు పాదపద్మపు జంట మదిని నిలుపు
వాంఛనున్నది పశుపతీ! పార్వతీశ!
హే విభో! నాకు ప్రీతితో ఇమ్ము వరము

భావానందలహరిః

తా॥ ఓ పశుపతీ! ఏ విధముగా హంస మానస సరోవరమున గల పద్మములను తినుట కాత్రపడునో ఏ విధముగా చాతక పక్షి మేఘమునుంచి నేరుగా పడు వర్షబిందువులను త్రాగ గోరునో, ఏరీతి కోకము (చక్రవాక పక్షి) సూర్య కాంతినే ఆహారముగా కోరునో, ఏ విధముగా చకోరపక్షి వెన్నెలనే ప్రియాహారముగా కోరునో, అదే విధముగా నా మనస్సు నీ పాదపద్మముల జంటను కోరుచూ జ్ఞానము నార్జించుటకాశపడుచున్నది. ఓ పార్వతీ పతే! నాకట్టి వరము ప్రీతితో నొసంగుము.

శ్లో॥ 60

రోధ స్తోయహృతః శ్రమేణ పథిక శ్ఛాయాంతరో దృష్టిత
భీత స్స్వస్థగృహం గృహస్థ మతిథి ర్దీనఃప్రభుం ధార్మికం
దీపం సంతమసాకులశ్చ, శిఖినం శీతావృత స్త్వం తథా
చేత స్సర్వభయాపహం వ్రజసుఖం శంభోఃపదాంభో రుహం॥

పద్యరూపాంతరంః

సీ॥ జలప్రవాహంబున తలమున్కలవువాన్కి
ఏరీతి తీరంబు గరపు ముదము
అలసిన పథికుండు అరయంగ తరుఛాయ
ఏరీతి సుఖమొంద అరుగునటకు
వానచే భీతిల్లి వణికెడి వానికి
ఏరీతి గృహమొండు ఇచ్చు సుఖము
అతిథిన్ గృహస్తుండు, అతిదీను నేలిక
ఏరీతి రక్షించు నెడతెరున్
కటిక చీకటినుండ మేటి దీపము, అగ్గి
చలిపీడితునకెట్లు శమన మిచ్చు

తే॥ అట్లు ఉపశమనంబును అరయు కొరకు
ఓ మనస్సా! నువికనైన నుద్యమించి
శంభు పాదారవిందంబు శరణుబొందు
సుఖము కలుగును నీకింక శూలిచెంత

భావానందలహరిః

తా॥ జలప్రవాహంలో కొట్టుకుపోతున్నవానికి తీరదర్శనము ఏవిధముగా సంతోషం కలుగ జేస్తుందో, అలిసిపోయిన బాటసారి చెట్టునీడను చూచి అక్కడికి పోవాలని ఎలా ఆశిస్తాడో, వానలో తడిసి భయపడుతున్నవానికి మంచి గృహము ఎలా సుఖమునిస్తుందో, అతిథిని గృహస్తుడైనవాడు, దీనావస్థలోనున్నవానిని ఏలికగా నున్నవాడు ఏవిధంగా ఎప్పుడూ కాపాడుతుంటారో, కటిక చీకటిలోనున్నవానికి దీపము మరియు చలి పీడితునికి అగ్ని యెట్లు ఉపశమనమిచ్చునో అటువంటి ఉపశమనమును ఓ మనస్సా నువ్వికనైనా ఉద్యమించి ఆ శివుని పాదారవిందముల శరణ మొంది సుఖముగా నుండుము.

శ్లో॥ 61

అంకోలం నిజబీజసంతతి రయస్కాంతోపలం సూచికా
సాధ్వీనైజవిభుం లతా క్షితిరుహం సింధు స్సరిద్వల్లభం
ప్రాప్నోతీహ యథా తథా పశుపతే! పాదారవింద ద్వయం
చేతో వృత్తి రుపేత్య తిష్ఠతి సదా సా భక్తి రిత్యుచ్యతే॥

పద్యరూపాంతరంః

సీ॥ తనవిత్తనంబులన్ తరువు అంకోలంబు
ఏరీతి బట్టునో ఇనుమడించి
చక్కగా అయస్కాంతంబు నా సూది
ఏరీతి అంటునో ఇనుము గనుక
పతివ్రతయైనట్టి సతి నిజ భర్తను
ఏరీతి సేవించు ఇంపు మీర
తీగెలు చెట్లను, సాగరంబును నదుల్
అనువుగా నేరీతి ఆశ్రయించు

తే॥ అట్లు తన మనోవృత్తియు ఆ పశుపతి
పాదపద్మయుగంబున నొదిగిపోయి
అన్నివేళల నుండునో అట్టి స్థితియె
భక్తి అని చెప్పబడెను అభయమునీయ

భావానందలహరిః

తా॥ అంకోల వృక్షముయొక్క విత్తనములు చెట్టునుండి విడివడి తిరిగి అదే చెట్టుకు అంటుకొనును. అదేవిధముగా పరమేశ్వరుని నుండి విడిపోయిన దైనను, తిరిగి ఆయనవైపే నామనస్సు ఆకర్షితమవుతుంది. అయస్కాంతము ఇనుముని ఆకర్షించి అంటుకునేలా చేస్తుంది, పతివ్రతయైన స్త్రీ త్రికరణ శుద్ధిగా తన భర్తనే సేవిస్తుంది, లత వృక్షాన నదులు సాగరుని ఆశ్రయిస్తాయి. అదే విధముగా తన మనోవృత్తి ఆ పశుపతి పాదపద్మములపై సదా నిలిచి ఉన్నచో ఆ స్థితియే భక్తి అనబడును. అదే అభయము నిచ్చును.

శ్లో॥ 62

ఆనందాశ్రుభి రాతనోతి పులకం నైర్మల్యత శ్ఛాదనం
వాచా శంఖముఖైఃస్థితైశ్చ జఠరాపూర్తిం చరిత్రామృతైః
రుద్రాక్షై ర్భసితేన దేవ! వపుషో రక్షాం భవద్భావనా
పర్యంకే వినివేశ్య భక్తి జననీ భక్తార్భకం రక్షతి॥

పద్యరూపాంతరంః

సీ॥ భక్తియనే తల్లి భాష్పంబులన్ రాల్చి
ఆనందమనుభవించ
నిర్మల భావనన్ నిపుణతో కప్పిన
దుప్పటి యౌనది దురితమాపు
నిగ్గదేలిన శ్రుతుల్ ఉగ్గ గిన్నెతో త్రాపి
శివచరితామృతంబవధరించి
బూది, రుద్రాక్షలు పూనుచు మేనికి
రక్షణ గావించు లావుబెంచి

తే॥ దేవ! నీ ఊహలనియెడి దివ్యమైన
ఊయలలందు పరుండంగ యుంచి ప్రీతి
భక్తుడనియెడి చిన్నారి బాలునూప
నన్నురక్షించు తప్పక నటవినోద!

భావానందలహరిః

తా॥ ఓ దేవా! నాకు కలిగిన భక్తుడనియెడి చిన్నారి బాలుని నేను ఆప్యాయంగా పెంపు జేస్తాను. చిత్తగించుము. భక్తి అనే మాతృమూర్తి ఆనందాను భవమున కన్నీరు కారుస్తూ నిర్మల భావన అనే దుప్పటిని నైపుణ్యంతో కప్పుట చేత అది పాపనాశనము కలుగ చేస్తుండగా వేదములచే వెల్లడించబడ్డ శివచరిత్ర అను అమృతమును ఉగ్గు గిన్నెతో త్రాపుచు రుద్రాక్షలు, మేనికి వ్రాసిన విభూది రక్షణ కలిగిస్తూ ధైర్యం పెంచగా నీ ఊహలనియెడి ఊయలలో పడుకో పెట్టబడి ఊపుచుండగా భక్తుడనెడి చిన్నారి బాలుని ఊపుతుంటే ఆ భక్తి శిశువు ఓ నటవినోదా! నన్ను తప్పక రక్షించును.

శ్లో॥ 63

మార్గావర్తిత పాదుకా పశుపతే రంగస్య కూర్చాయతే
గండూషాంబు నిషేచనం పుర రిపోర్దివ్యాభిషేకాయతే
కించిద్భక్షిత మాంస శేష కబళం నవ్యోపహారాయతే
భక్తిః కిం? నకరో త్యహో! వన చరో భక్తావతంసాయతే॥

పద్యరూపాంతరంః

సీ॥ పలు మార్గముల బోవు పాదుక ముఖముపై
 'కూర్చ' యౌచున్నదా కుదురుకొనుచు
పుక్కిలించిన నీరు ఉమ్ముట నీపైన
 దివ్యాభిషేకమా త్రిపురవైరి!
కొంచెము తినివైచి యుంచిన మాంసపు
 ముక్కలు రుచియౌనె యెక్కడైన!
కొత్తగ వండిన ఉత్తమ నైవేద్య
 మవుచున్నదా అది అద్రిశయన!

తే॥ ఏమి చిత్రంబు! భక్తిచే ఏదికాదు?
ఆటవికుడైన నిను గొల్వ ఆర్తితోడ
అతడు భక్త శిఖామణి అవుట నిజము
ధరణి పేరొందు పశుపతీ! ధన్యుడౌను

(కూర్చ= కనుబొమ్మల మధ్య ప్రదేశము)

భావానందలహరిః

తా॥ పరమభక్తుడైన తిన్నడు ఆటవికుడైన తనకు తెలిసిన విధమున పరమశివుని కొలిచాడు. ఆది శంకరులు ఓ శివా! నీకు అట్లా చేస్తేనే ఇష్టమా అని అడుగుతున్నారు. కాలి చెప్పు కనుబొమ్మలమధ్య (కూర్చ) గుర్తుగా ఉంచబడింది పుక్కిట పట్టుకొచ్చిన నీటిని ఉమ్మి నీకభిషేకం చేశాడు. కొంచెము అని సరిగా ఉడికాయో లేదోనని చూడబడిన మాంసం

ముక్కలు యొక్కడైనా ఇంకొకరికి రుచిగా ఉంటాయా? మరి అవేగా తిన్నడు. నీకు పెట్టిన నైవేద్యం. కొండలలో పడుకునే నీకు అదే తగినదనుకొన్నాడేమో! ఏ విచిత్రమయ్యా శివా! నిన్ను ఆర్తితో అట్లా కొలిచినా నీకు ఆనందమేనేమో! ఆ తిన్నడు భక్తశిఖామణి ఓ పశుపతీ! అతడు ధన్యుడు.

శ్లో॥ 64

వక్షస్తాడన మంతకస్య కఠినాపస్మార సంమర్దనం
భూభృత్పర్యటనం నమత్సురశిరః కోటీరసంఘర్షణం
కర్మేదం మృదుళస్య, తావక పదద్వంద్వస్య గౌరీపతే!
మచ్చేతో మణిపాదుకా విహరణం శంభో! సదాంగీకురు॥

పద్యరూపాంతరంః

సీ॥ యమరాజు రొమ్మును ఆగ్రహంబున దన్నె
 బాలమార్గండేయు భయము దీర్చ

అణచి అపస్మారుడను రాక్షసుని నాడు
   కఠినుని తొక్కెను కాలితోటి
కొలుచు దేవతలకు తలలపై మెరిసెడి
   రత్నకిరీటాల రాపిడులకు
పశుపతీ! మృదువైన పాదపద్మంబులు
నలిగెను వాటిని కొలుతునయ్య!

తే॥ నిత్యవ్యవహారమది శివా! నీకు నాకు
పార్వతీ పతీ! నే సదా పరమప్రీతి
కొలుచు చిత్తమన్ మణిపాదుకలను దాల్చి
నాదు మనసున విహరించు ముదము కలుగ

భావానందలహరిః

తా॥ బాలుడైన మార్కండేయుని ప్రాణాలు తీయుటకు యముడు పాశం వేస్తే భయంతో వణికిపోయి నిన్ను

ఆ బాలుడు ప్రార్థించాడు. వాని భయ నివారణకు యమునే కాలితో తన్ని దండించాడు శివుడు. ఆయన అపస్మారుడనే రాక్షసుని తన కాళ్ళక్రింద వేసి తొక్కేశాడు. దేవతలంతా శిరస్సుల నేలకానించి మ్రొక్కుతుంటే వారి కిరీటాల్లోని రత్నముల రాపిడికి నీ పాదకమలాలు నలిగిపోతున్నవి. కానీ ఇదంతా నీకు నిత్యవ్యవహారమే. ఇక నామనస్సు కూడా కఠినమైనదే కనక నీవు మణిపాదుకలు ధరించినా సరే నా మనస్సులో యథేచ్ఛగా విహరించు.

శ్లో॥ 65

వక్షస్తాడన శంకయా విచలితో వైవస్వతో నిర్జరాః
కోటీరోజ్జ్వల రత్న దీపకలికా నీరాజనం కుర్వతే
దృష్ట్వా ముక్తివధూ స్తనోతి నిభృతాశ్లేషం భవానీపతే
యచ్చేత స్తవ పాదపద్మ భజనం తస్యేవ కిం? దుర్లభం?

పద్యరూపాంతరంః

చం॥ ఎవరి మనంబు తానమరు ఈశ్వర!
   నీపదపద్మసేవలో
అవనిని గల్గబోని సిరి ఆవరభక్తునికుండ
   బోదయా
భువినువు బాలుగాచుటకు పూనుచు
   కాలుని గుండెతంతివే
దివి సురకోటి రత్నమణి దీప శిఖన్ తము
   ఆరతీయగా
యువతిని ముక్తినాబడెడి ఒప్పుల
   కుప్పయు కౌగలించుగా

భావానందలహరిః

తా॥ ఓ ఈశ్వరా! ఎవరి మనస్సు ఈ భువిలో నీ పాదపల్లవముల సేవతో అమరని ఏ సంపదా నీ భక్తుని కుండదు. (అన్ని సంపదలూ ఉంటాయి) బాలుడైన మార్కండేయుని కాపాడుటకు ఆ యముని

గుండెలపైననే తన్నావు. దేవతలంతా రత్న ఘచిత మణి దీపాలతో హారతులిస్తుంటే ముక్తి అనే యువతీ లలామ, ఒప్పుల కుప్ప గట్టిగా కౌగలించుకుంటుంది కదా!

శ్లో॥ 66

క్రీడార్థం సృజసి ప్రపంచ మఖిలం క్రీడామృగాస్తే జనాః
యత్కర్మాచరితం మయా చ భవతః ప్రీత్యై భవత్యేవ తత్
శంభో! స్వస్యకుతూహలస్య కరణం మచ్చేష్టితం నిశ్చితం
తస్మా న్మామక రక్షణం పశుపతే! కర్తవ్యమేవ త్వయా॥

పద్యరూపాంతరంః

సీ॥ సర్వ ప్రపంచంబు సర్వేశ! నీ ఆట
   కొరకు సృజింతువు పరమ ప్రీతి
అవనిలో జనులెల్ల ఆటబొమ్మలు నీకు
   ఆటాడుకొందువు అందువలన
ఏ పనిజేసినా ఈశ! నే నీప్రీతి
   కొరకు గావింతును కొరతలేక

నీ కుతూహలమును నిలుపంగ నాయందు
నడచుటే నాపని, నాగభూష!

తే॥ అనుట నిశ్చయంబైనది అందువలన
నాదు రక్షణ భారమ్ము నీదె స్వామి!
నీదు కర్తవ్యమే అది నిటలనయన!
శంభో! పశుపతీ! హే ప్రభో శరణు శరణు

భావానందలహరి:

తా॥ ఓ సర్వేశ్వరా! ఈ ప్రపంచాన్ని నీ ఆటకొరకు ఎంతో ఇష్టంతో సృజించు కొనుచున్నావు. ఈ లోకంలోని నరులందరినీ నీ ఆట (వేడుక!) కొరకు సృజించుచున్నావు. అందువల్ల ఓ ఈశ్వరా! నేనేపని చేసినా నీప్రీతికొరకే చేస్తాను. ఓ నాగభూషణా! నీకుతూహలం నాపై ఉండేట్లు నడచుకొనుటే నాపని. ఇది నిశ్చయం. అందువలన నారక్షణా భారం నీదే స్వామి! ఓ పశుపతీ! శంకరా! నీకర్తవ్యం అదే ప్రభూ! మాకు శరణు నీవే.

శ్లో॥ 67

బహువిధ పరితోష బాష్పపూర
స్ఫుట పులకాంకిత చారుభోగ భూమిం
చిరపద ఫలకాంక్షి సేవ్యమానాం
పరమ సదాశివ భావనాం ప్రపద్యే॥

పద్యరూపాంతరం:

చం॥ కరుగుచు కంటి నీరమది గ్రక్కున రాలును
సంతసంబునన్
విరివిగ మేని పుల్కలగు వేదనుతున్ కొలు
వంగ బూనగా
పరమును కోరువారలతొ బాగుగ సేవలు
పొందునట్టిదౌ
పరమ సదాశివున్ కొలుచు భావననే
శరణంబు జొచ్చెదన్

భావానందలహరి:

తా॥ సంతోషంతో కరిగిపోవుటచే నాకంటి నీరు వెంటనే కారి జలజలా రాలుతుంది. వేదనుతుడైన ఈశ్వరుని కొలుస్తుంటే విపరీతంగా నా తనువు పులకరిస్తోంది. మోక్షము నాశించే వారి సేవలు బాగుగా పొందుచున్నట్టిదైన పరమేశ్వరుని పూజించే ఆలోచననే తక్షణం శరణని ఆశ్రయిస్తాను.

శ్లో॥ 68

అమిత ముదమృతం ముహు ర్దుహంతీం
విమల భవత్పదగోష్ఠ మావసంతీం
సదయ పశుపతే! సుపుణ్యపాకాం
మమ పరిపాలయ, భక్తిధేను మేకామ్॥

పద్యరూపాంతరం:

చం॥ తుదియని లేని సంతసముధూర్జటి! తాన్
స్రవియించు చుండగా
ముదమదినిర్మలంబవును మోక్షప్రదాతలు నీ
పదంబులున్
పదిలపు ఆలకోష్ఠమును వాసము జేరగ
పుణ్యప్రాప్తిచే
కుదిరిన నాదు భక్తియను గోవును యెంచుము
బ్రోవుమీశ్వరా!

భావానందలహరి:

తా॥ ఓ ధూర్జటీ! శివా! అంతులేని ఆనందము ధారగా స్రవిస్తుండగా, నిర్మలానందము కలుగుతుంది. నీపాదములే మోక్ష ప్రదాతలవుతాయి. పూర్వజన్మల పుణ్య ప్రాప్తి కలుగుట చేత కుదిరిన నాభక్తి అనే గోవును నీవు ఎన్నుకొని అది భద్రమైన నా పదములనే ఆవుల కోష్ఠము చేరగానే నీవశం చేసుకో. ఓ ఈశ్వరా! నన్నావిధంగా రక్షింపుము.

శ్లో॥ 69

జడతా పశుతా కళంకితా కుటిల చరత్వం చ నాస్తిమయి।
దేవ! అస్తి యది రాజమౌళే భవదాభరణస్య నాస్తి కిం పాత్రమ్॥

పద్యరూపాంతరం:

ఉ॥ లేదు జడత్వమైన హర! లేవుర నాకు
పశుత్వ భావనల్
లేదు కళంకమైన మరిలేదుర మోసము
జేయు బుద్ధియున్
లేదురయున్నచో కలువరేడుగ
ఆభరణంబు నౌదుగా
నీదయ చూపిబ్రోచుటకు నేను అనర్హుడ
నేమొ! ఈశ్వరా!

భావానందలహరి:

తా॥ ఓ శంకరా! నాకు జడత్వము లేదాయెను, పశుత్వం కూడలేదు. నాకు ఏ మచ్చాలేదు. నాకు మోసం చేసే గుణం లేదు. ఒకవేళ నాకు ఆ గుణాలన్నీ ఉంటే కలువ రేడయిన ఆ చంద్రుడివలె నేను కూడా నీకు శిరోభూషణం అయి ఉండే వాడినిగదా. ఓ ఈశ్వరా! నేను నీదయ పొందుటకు అనర్హుడనేమో. (చంద్రుడికున్నన్ని కళంకాలు నాకుంటే నేను నీపాదాల చెంతగాక నెత్తిపైనే ఉండేవాడినేమో. ఆ చంద్రుడు సముద్రంలోంచి ఉద్భవించాడు కనుక జలత్వం కలవాడు (సంస్కృతంలో జలత్వం జడత్వం అనికూడా అనవచ్చు), గురుపత్నితో సంబంధం కలిగి పశుత్వం పొందాడు. కుందేటి గుర్తు మచ్చగల కళంకితుడు, కుటిలుడు అనగా వంకర రూపం కలవాడు. ఇన్ని అవగుణాలుండాలేమో శివుని దయ పొందాలంటే అని చమత్కరిస్తున్నారు)

శ్లో॥ 70

అరహసి రహసి స్వతంత్ర బుద్ధ్యా
వరివసితుం సులభః ప్రసన్నమూర్తిః
అగణిత ఫలదాయకః ప్రభుర్మే
జగదధికో హృది రాజశేఖరోస్తి.

పద్యరూపాంతరం:

చం॥ హృదయమునందు నాదు శివు
డెప్పుడు నిల్చు ప్రసన్నరూపుడై
ముదముగ లెక్కలేని ఫలముల్‌తను
ఇచ్చును రాజమౌళియున్
పదిలముయైన రీతిమది పాయక నిల్చును
తానతీతుడౌ
కుదరగ నా అధీనమున కూడుచు
నుండెను సేవలందగా

భావానందలహరి:

తా॥ ప్రసన్న రూపుడైన పరమశివుడు నా హృదయంలో నిత్యమూ స్థిరంగా ఉంటాడు. ఆ రాజమౌళి సంతోషంతో లెక్కలేనన్ని ఫలముల నొసంగును. తాను అతీతుడవుటచే మనస్సులోనే నెలకొని వుంటాడు. తను సేవలను పొందుటకు నా అధీనంలోనే కుదిరియుంటాడు.

శ్లో॥ 71

ఆరూఢ భక్తిగుణ గుంఫిత భావ చాప
యుక్తైశ్శివస్మరణ బాణగణై రమోఘైః
నిర్జిత్య కిల్బిష రిపూన్ విజయీ సుధీంద్ర
స్సానంద మావహతి సుస్థిర రాజ్యలక్ష్మీమ్

పద్యరూపాంతరం:

ఉ॥ ఎన్నికయైన జ్ఞానమును ఏర్పడ
గల్గిన వాడు సుస్థిరం
బన్నతెరంగునన్ శివుని అద్భుత
భక్త్యను అల్లెత్రాటితో
నున్న ధనస్సు మానసము ఉన్నతమౌ
శివచింతయన్ శరం
బెన్నుచు పాపరూపరిపు నిప్పుడె[ద్రుంచును
మోక్షలక్ష్మికై

భావానందలహరి:

తా॥ శ్రేష్ఠమైన జ్ఞానము కలిగినవాడు, సుస్థిరమైన అద్భుత శివభక్తి అనే అల్లె త్రాటితో నున్న తన మనస్సు అనే గొప్ప ధనస్సునకు ఈశ్వరుని చింతన అనే గొప్ప బాణమును సంధించి, పాపములనెడి శత్రువులను వధించి మోక్ష(సామ్రాజ్య) లక్ష్మిని సాధించును.

శ్లో॥ 72

ధ్యానాంజనేన సమవేక్ష్య తమః ప్రదేశం
భిత్వా బలిభి రీశ్వర నామ మంత్రైః
దివ్యాశ్రితం భుజగభూషణ ముద్వహంతి
యేపాదపద్మ మిహ తే శివ! కృతార్ధాః॥

పద్యరూపాంతరం:

సీ॥ ధ్యానసమాధియన్ ఘన అంజనముచేత
బాగుగా కనుగొని పరమశివుని
నామపారాయణన్ నయమైన మంత్రపు
ఉపకరణములచే ఉద్యమించి
అజ్ఞానమను స్థాన మవలీల త్రవ్వుచు
ఏ భక్తుడైనను యెడ తెరుగక
సురుల కాశ్రయములై, ఉరగాభరణములు
రక్షించు ఘనమౌ చరణములనెడి

తే॥ పద్మయుగళంబు సుకృతంపు ప్రాప్తిచేత
పైకి గొనిపోవుచున్నారొ వారు తాము
నాల్గు విధముల పురుషార్ధ నాణ్యతలను
పొందువారలౌచున్నారు ఇందుమౌళి!

భావానందలహరి:

తా॥ ధ్యానసమాధి అనే గొప్ప అంజనము వేసి ఆ పరమశివుని కనుగొని, శివనామ సంకీర్తనను ఉపకరణములతో ప్రయత్నించి, అజ్ఞానమనే ప్రదేశాలను త్రవ్వి బాగుచేసి ఏభక్తుడైనా నిరంతరము దేవతలు ఆశ్రయించగా పాములు ఆభరణములుగా రక్షించు ఘనమైన పద్మచరణారవిందాలను సుకృతముచేత పైకి కొనిపోబడుచున్నారు. ఓ ఇందుమౌళీ! అట్టి ధన్య జీవులులు అవలీలగా చతుర్విధ పురుషార్ధములను సాధిస్తున్నారు.

శ్లో॥ 73

భూదారతా ముదవహ ద్యదపేక్షయా శ్రీ
భూదార ఏవ కి మత స్సుమతే! లభస్వ
కేదార మాకలిత ముక్తి మహౌషధీనాం
పాదారవిందభజనం పరమేశ్వరస్య

పద్యరూపాంతరం:

చం॥ వెదకుచు దేనినిన్ తొలుత విష్ణుడు
గల్గియు ముద్దు భామలన్
అదనుగ ఆది శ్వేత కిటి ఆయెను,
నేర్చిన సంగతే కదా!
ముదమున ముక్తి ఔషదము మొత్తము గ్రోలుచు
శూలి పాదముల్
వదలక ప్రీతితో గొలుచు భాగ్యము సుస్థిరబుద్ధి!
పొందుమా.

భావానందలహరిః

తా॥ పూర్వం విష్ణుమూర్తి ఇద్దరు భార్యలు కలిగిన భోగ పురుషుడై కూడా, దేనిని వెదుకుచూ శ్వేత వరాహమైనాడో అందరూ ఎరిగిన సంగతే కదా! ఇక ఓ నా సుస్థిర బుద్ధీ! సంతోషముతో ముక్తి అనే ఔషధాన్ని మొత్తం త్రాగి త్రిశూలపాణియైన శివుని పాదములను ప్రీతితో వదలకుండా పూజించెడి భాగ్యమును పొందరాదా?

శ్లో॥ 74

ఆశాపాశ క్లేశ దుర్వాసనాది భేదో ద్యుక్తైర్దివ్యగంధై రమందైః
ఆశా శాటీకస్య పాదారవిందం చేతః పేటీం వాసితాం
మే తనోతి

కం॥ పరమేశ! నాదు మనసను
సరియగు పేటికను యుంతు చరణము చెంతన్
అరయను ఆశామోహము
పరిమళ పద కమలమంటి ప్రార్ధింతు శివా!

భావానందలహరిః

తా॥ ఓ పరమేశ్వరా! నా మనస్సు అనబడు సరియగు పెట్టెను నీ చరణముల చెంత యుంచెదను. ఆశామోహములను లెక్కచేయను. ఓ శివా! పరిమళించు నీ పదపద్మములను తాకి ప్రార్ధించెదను.

శ్లో॥ 75

కళ్యాణినం సరస చిత్ర గతిం సవేగం
సర్వేంగితజ్ఞ మనఘం ధ్రువలక్షణాఢ్యం
చేత స్తురంగ మధిరుహ్య చర స్మరారే!
నేత స్సమస్త జగతాం వృషభాధిరూఢ

పద్యరూపాంతరం:

చం॥ మనసిజువైరి! శంకర! ఉమాపతి!
మంగళ! నంది వాహనా!
అలరిన మేటి లక్షణములన్నియు కల్గిన
అశ్వరాజమున్
గొనకొని పాపమెన్నడును కూడదు దానిని
అట్టి రీతిగా
మనసది నాదు అశ్వమగు మంచిది యెక్కి
చరించు మీశ్వరా!

భావానందలహరిః

తా॥ మన్మధుని శత్రువు వయిన ఓ శంకరా! ఓ పార్వతీ పతే! మంగళస్వరూపా! నందివాహనా! మంచి లక్షణములన్నీ కలిగిన శ్రేష్ఠమైన అశ్వరాజమును ఎన్నడూ చెడుగానీ పాపం కానీ అంటవు. అదేవిధంగా నా ఈ మనస్సుకూడా ఒక చక్కటి అశ్వము. మంచిది కూడా ఓ ఈశ్వరా! దీనిని నీ అధీనంలో ఉంచుకో. దానిపై చక్కగా ప్రయాణం చేయి.

శ్లో॥ 76

భక్తిర్మహే పదపుష్కర మావసంతీ
కాదంబినీవ కురుతే పరితోషవర్షం
సంపూరితో భవతి యస్య మనస్తటాక
స్తజ్జన్మ సస్య మఖిలం సఫలం చ నాన్యత్॥

పద్యరూపాంతరం:

సీ॥ భక్తిమేఘము వలె పరమేశు పదములన్
ఆకాశమున నిల్చి అటువసించు
ఆనందమను నట్టి అద్భుత వర్షంబు
కురిపించుచున్నది మురియ జగతి
ఆవర్షమున జిక్కి ఎవరిమానసమను
కాసారమదినిండె గట్లు తెగుచు
ఆభక్తు జన్మంబు అను పంట పొలమున
పంటకాపుకు వచ్చె ప్రాప్తి నొంద

తే॥ అతని జన్మంబు మొత్తము అతి సుఫలము
ఇతర జన్మంబులేవియు ఏమిలెక్క
సఫలమవి కావు కాబోవు సర్వ వినుత
హేమహేశా! జగన్నాథ! ఈవెరక్ష.

భావానందలహరిః

తా॥ పరమేశ్వరుడి పాదములనే ఆకాశమున భక్తి మేఘమువలె ఆవహించింది. అప్పుడు ఆనందమనే అద్భుతమైన వర్షం జగత్తంతా సంతోషించేట్లు కురుస్తుంది. ఆ వర్షంతో గట్లు తెగుతాయేమో అన్నట్లు మనస్సనే తటాకం నిండిపోయింది. ఆ భక్తుని జన్మమనే పొలంలో పంట కాపుకొచ్చింది. ఆ భక్తుని జన్మ అంతా ధన్యం. ఇతర జన్మలు అసలు లెక్కకే రావు. కాపుకొచ్చిన, ఆ జన్మ సాఫల్యం చేసెపైరుకు, ఓ మహేశా! జగన్నాథా! నీవే రక్ష.

శ్లో॥ 77

బుద్ధి స్థిరా భవితు మీశ్వర పాదపద్మ
సక్తావధూ ర్విరహిణీవ సదా స్మరంతీ!
సద్భావనా స్మరణ దర్శన కీర్తనాది
సమ్మోహితైవ శివమంత్రజపేన వింతే॥

భావానందలహరిః

చం॥ పతినెడబాసినట్టి సతి భంగిని శంకర!
ధ్యాస లేనిదా
మతి ఇది శైవమంత్రమున మక్కువ
తన్మయమొందె స్థైర్యమున్
హితవుగ బొందె దేవ! పరమేశ్వర! నీదగు
ధ్యాన, ధారణన్
సతతము దర్శనంబు గని చక్కని
కీర్తన చేయుచున్నదై.

భావానందలహరిః

తా॥ ఓ దేవా! పరమేశ్వరా! ఈ నామనస్సు బేల. పతినెడబాసిన భార్యవలె పరధ్యానంలో ఉన్నది. శైవమంత్రప్రాప్తిచేత స్థైర్యం వహించింది. తన్మయత్వంలో నున్నది. నీ ధ్యానము, నీ ధారణలచేత ఎప్పుడు నిన్ను తనలో దర్శించుచూ కీర్తనలు చేయుచున్నది.

శ్లో॥ 78

సదుపచార విధి ష్వనుబోధితాం
సవినయాం సుహృదం సముపాశ్రితాం
మమ సముద్ధర బుద్ధి మిమాం ప్రభో!
వరగుణేన నవోఢ వధూ మివ॥

పద్యరూపాంతరంః

చం॥ అవుటచె సత్స్వరూపుడవు అన్ని
సపర్యలు చేయుటందు ఓ
శివ! వినయంబు గల్గినది చిక్కని నిర్మల
దెందమున్నదై
భవుడని ఆశ్రయించినది పాయక
సద్గుణయై మనంబు ఆ
నవ వధువట్లు ఒప్పునది నమ్రత గల్గిన
దుద్ధరింపుమా

భావానందలహరిః

తా॥ ఓ శివా! నీకు సపర్యలు చేయుటకు ఒక చక్కని నవ వధువున్నది. మంచి నమ్రత కలిగినది. నీవు సత్స్వరూపుడవవుటచే నీకు సపర్యలు చేయుట యందు వినయము గల్గినది. నిర్మలమైన మనస్సు కలిగినదై నీవు భవుడవని వదలకుండా ఆశ్రయించినది. ఈ నామనస్సనే సద్గుణయైన ఈ

పెండ్లికూతురిని నీ రక్షణలో ఉంచుతున్నాను. దీన్ని నీవే ఉద్ధరించాలి.

శ్లో॥ 79

నిత్యం యోగి మనస్సరోజదళ సంచారక్షమ స్త్వత్క్రమ
శ్శంభో! తేన కథం కఠోర యమరాడ్వక్షఃకవాట క్షతి
అత్యంతం మృదులం త్వదం ఘ్రి యుగళం హా! మే మనశ్చింతయ
త్యేత ల్లోచన గోచరం కురు విభో హస్తేన సంవాహయే॥

పద్యరూపాంతరం:

సీ॥ యోగుల హృదయాలు ఉత్పలంబులు ప్రభూ!
సుకుమార దళములు సున్నితములు
నిత్యము వానిలో నీవు చరింతువు
కార్యక్రమంబుగా గరళకంఠ!

కఠినుడౌ సమవర్తి కరకు గుండియలను
కాలితో తంతివే కందిపోగ
పాదయుగ్మమునీది బహు సున్నితముకదా
అయ్యో! ప్రభూ నీకు అది తగదుర

తే॥ నాదు మనసు చింతించుచు నలుగుచుండె
నీ పదమ్ముల నొకసారి నిటల నయన!
కంటి కగుపింప నిమ్ము నా కరములందు
ఉంచి వాని ఒత్తెద నయ్య! ఒక్కసారి.

భావానందలహరి:

తా॥ ఓ గరళ కంఠా! యోగుల హృదయాలు కలువ పూవులవలె సుమనంబులు, సున్నిత సుకుమారములు. నీవు నిత్యమూ అదే కార్యక్రమంలా వాటిలో సంచరిస్తుంటావు. కరకుగుండెలు గల యముని కఠినంగా తన్ని మార్కండేయుని కాపాడావు. కానీ సున్నితమైన ఆ పాదపద్మములెంత కందిపోయాయో కదా! ఇది నీకు తగునా? నా మనస్సు ఆ అఘాయిత్యం తలుచుకుని ఎంత బాధపడిందో గమనించావా? ఓ ప్రభూ! నిటలాక్షా! ఆ పాదములు నాకంటికి కనిపించేట్లు చేయరాదా మెత్తగా నాచేతుల్లో ఉంచు. ఒక్కసారి వాటిని ఒత్తి నీకుపచారం చేస్తాను.

శ్లో॥ 80

ఏష్వ త్యేషజనిం మనో స్య కఠినం తస్మి న్నటానీతి చ
ద్రాక్షాయై గిరిసీమ్ని కోమల పదన్యాసః పురాభ్యాసితః
నోచే ద్దివ్యగృహాంతరేషు సుమన స్తల్పేషు వేద్యాదిషు
ప్రాయ స్సత్సు శిలాతలేషు నటనం శంభో! కిమర్థం తవ?

పద్యరూపాంతరం:

సీ॥ పుట్టుక చేతనే గట్టి కఠినమైన
మనసున్నవాడని మతిని దాల్చి
నామది నటియించి నన్ను రక్షించంగ
ఊహించితో ముందె ఓ త్రినయన!
కొండ ప్రాంతంబుల కోమల విన్యాస
ముల సల్పుచుంటివి పలు విధముల
నీ దివ్య గృహముల నిజపూల పాన్పుల
వేదిక లెన్నుండె విశ్వనాథ!

తే॥ కఠకు ఱాళ్ళ నర్తించుట కఠినరీతి
అభ్యసించు చుంటివి ప్రభూ! అనుదినంబు
దేనికాశ్రమ రక్షింప దీను నన్ను
కంది పోవు నీ పదములు ఎందుకయ్య!

భావానందలహరి:

తా॥ ఓ త్రినయనా! వీడు పుట్టుకతోనే కఠినాత్ముడు వీడు ప్రార్థించి మరీ నన్ను తన మనస్సులో నిలుపుకుంటాడు. అప్పుడు వీడి మనస్సుతో నిలవటం కష్టం అని భావించి ఈ కఠకు కొండ ప్రాంతాలలో నాట్య విన్యాసాలు చేస్తున్నావా తండ్రీ!

నీ దివ్య సౌధంలో ఎన్ని పుష్ప వేదికలు లేవు? పూల పాన్పులు లేవు? కఠినమైన ఈ రాళ్ళల్లో నర్తించుచూ ఎంత శ్రమ పడుతున్నావు స్వామీ! ఈ దీనుణ్ణి రక్షించుట కెందుకయ్యా ఈ శ్రమ. ఎందుకయ్యా? నీ పాదాలు కందిపోతాయి ప్రభూ!

శ్లో॥ 81

కంచిత్కాల ముమామహేశ! భవతః పాదారవిందార్చనైః
కంచి ద్ధ్యానసమాధిభిశ్చ, నతిభిః కంచి త్కథాకర్ణనైః
కంచి త్కంచి దవేక్షణైశ్చ నుతిభిః కంచి ద్దశా మీదృశీం
యః ప్రాప్నోతి ముదాత్తదర్పితమనా జీవన్ సముక్తః ఖలు

పద్యరూపాంతరం:

సీ॥ కొంతకాలంబు నీ కోమల పదపద్మ
పూజలతో తాను భువి వసించి
కొంతకాలము నిన్ను కోరు ధ్యాన సమాధి
ఉండ గోరెడి వాడు వ్యోమకేశ!

కొంతకాలము భక్తి కుదురు వందన జేసి
కొంతకాలము కథల్ కూడి వినుచు
కొంతకాలము రూపమంతయు దర్శించి
కొంతకాలము స్తుతుల్ కోరిజేయు

తే॥ ఇట్టి స్థితులలో ఏదైన ఎవడు పొందు
నీకు అర్పించబడినట్టి నిర్మలంపు
మనసు కలవాడు నిను జేరు అనఘుడవుచు
వాడె జీవనముక్తుడై పరము గనును.

భావానందలహరి:

తా॥ ఎవడైతే కొంతకాలం నీ కోమలమైన పదపద్మముల సేవ జేస్తూ గడుపుతాడో, ఎవడైతే నీ ధ్యానంలో ఉంటాడో, ఎవడైతే కొంతకాలము భక్తి కుదురునట్లు వందనం చేస్తుంటాడో, ఎవడైతే కొంతకాలం నీ కథలు వింటుంటాడో, ఎవడైతే నీరూపం సందర్శిస్తుంటాడో, ఎవడైతే కొంతకాలం నీ స్తుతిని

చేస్తుంటాడో ఈ స్థితులలో ఏదైనా ఎవడు పొందుతాడో నీకు అర్పించబడిన నిర్మలమైన మనస్సు కల ఆ భక్తుడు జీవన్ముక్తుడవుతాడు.

శ్లో॥ 82

బాణత్వం వృషభత్వ మర్ధ వపుషాభార్యాత్వ మార్యాపతే!
ఘోణిత్వం సఖితా మృదంగవ హతా చే త్యాదిరూపం
దధౌ
త్వత్పాదే నయనార్పణం చ కృతవాన్ త్వద్దే హభాగో హరిః
పూజ్యా త్పూజ్యతర స్స ఏవ హి నచే త్కోవా? త్వదన్యో
ధికః

పద్యరూపాంతరం:

సీ॥ హరి నీకు బాణమై, అర్ధ బాగము బొందె
పత్నియై, తానయ్యె వాహనంబు
కిటి ఆయె, చెలికత్తె మేటియై, మద్దెలన్

వాయించు వాడయ్యె పరవశించి
నీ పాదములచెంత నిజ నయనంబులన్
ఉంచిన వాడయ్యె ఉన్నతముగ
దుష్ట శిక్షణజేసి శిష్ట రక్షణ జేయ
అవతారముల నెన్నో అవధరించె

తే॥ అందుచేతనే విష్ణుత్వమబ్బె హరికి
పూజ్యతరుడాయె సురలందు ఉన్నతుండు
ఎవడు హరిమించు మొనగాడు ఎంచి చూడ
ప్రాణ సఖుడయ్యె హరిసదా పార్వతీశ!

భావానందలహరి:

తా॥ శివ పురాణంలోని నిగూఢమైన కథల ద్వారా శ్రీహరి ఏయే రూపాలు ధరించి శివుని సాహచర్యం సాధించాడో రకరకాలైన కథల ద్వారా తెలుపబడింది. అందుచేతనే శ్రీహరి అంటే శివునికి ప్రాణం అని ప్రతిపాదిస్తున్నారు. ఆది శంకరులు ఈ శ్లోకంలో. ఓ శివా! శ్రీహరి నీకు బాణమయ్యాడు

(త్రిపురాసుర సంహారంలో) పార్వతిగా మారి నీ అర్ధాంగి అయ్యాడు, నందీశ్వరుడుగా మారి నీ వాహనం అయ్యాడు, వరాహమై నీ మహాలింగ తుది తెలుసుకోవాలని ప్రయత్నించాడు, మోహినీ అవతారంలో శ్రీహరి శివుని సఖి అయ్యాడు, శివుడు తాండవించునప్పుడు శ్రీహరి మద్దెల వాద్య గాడవుతాడు. ఒకసారి శ్రీహరి శివుని 1000 పద్మాలతో ఆరాధిస్తానని ప్రతిజ్ఞ చేసి శివలీల వల్ల 999 పద్మాలే దొరికితే పద్మం వంటి తన కన్ను పీకి శివుని కరుణ పొందాడు. దుష్ట శిక్షణ శిష్ట రక్షణ చేయుటకు ఎన్నో అవతారాల నెత్తాడు. ఈ కారణాల వల్ల శ్రీహరికి విష్ణుత్వం దక్కింది. పూజ్యతరుడయ్యాడు. (శివుడు పూజ్యతముడు) సురశ్రేష్ఠుడయ్యాడు. శివుని ప్రాణ సఖుడయ్యాడు. ఆ శ్రీహరి శ్రేష్ఠుడయ్యాడు.

శ్లో॥ 83

జననమృతి యుతానాం సేవయా దేవతానాం
న భవతి సుఖలేశ స్సంశయో నాస్తి తత్ర
అజని మమృతరూపం సాంబ మీశం భజంతే
య ఇహ పరమసౌఖ్యం తే హి ధన్యా లభంతే

పద్యరూపాంతరం:

సీ॥ జననమంత్యంబులు సహజంబుగా గల
దేవతలందరి సేవచేత
అవంత సుఖమైన అబ్బదు నిజముగా
అనుమాన మిందులో అసలు లేదు
ఎవ్వడు అజనియై ఎరుగడు మరణంబు
అంబాసమేతుడై అలరు నెవడు?
జగదీశుడెవ్వండు సర్వజగంబుల
వాని సర్వేశ్వరున్ పరమశివుని

తే॥ సేవజేయు జేయు వారెవ్వరో చింతలేక
వారు సశరీలుగ తాము పరమ సుఖము
నొందెదరు గాక! చరితార్థులందు జేరి
పొందెదరు ముక్తి జేరుచున్ ఇందు ధరుని

భావానందలహరి:

తా॥ మనుగడకాలము చాల అధికమైనప్పటికీ చావు పుట్టుకలుగల దేవతలను సేవించి నా లాభమేముంది? ఇందులో అనుమానం లేదు. అవగింజంత సుఖం కూడా దక్కదు. అంబా సమేతుడై జనన మరణాలు లేక అలరుచుండు వాడెవడు? జగదీశ్వరుండెవడు? అటువంటి ఆ పరమేశ్వరుని ఏ చింతా లేక సేవ ఎవరు చేస్తారో వారు శరీరముండగానే పరమ సుఖం పొందుతారు. వారు చరితార్థులై ఆ చంద్రశేఖరుని జేరి ముక్తి పొందుతారు.

శ్లో॥ 84

శివ! తవ పరిచర్యా సన్నిధానాయ గౌర్యా
భవ! మమగుణధుర్యాం బుద్ధికన్యాం ప్రదాస్యే
సకల భువన బంధో! సచ్చిదానంద సింధో!
సదయ! హృదయ గేహే సర్వదా సంవసత్వమ్

పద్యరూపాంతరం:

చం॥ హర! భవ! గౌరితో నిలచి అందుము
నా పరిచర్యలన్నియున్
నిరుపమ సద్గుణా భరణ నెమ్మిని నాదగు
బుద్ధికన్యకన్
సురుచిరలీల చేగొనుము సొంపుగ ఏలుము
లోక బాంధవా!
నిరతము నిల్వ నాయెడద మీకు గృహంబగు
ఉండు మచ్చటే.

భావానందలహరిః

తా॥ ఓ భవా! ఈశ్వరా! ఎప్పుడూ పార్వతీదేవితో నిలిచి నా సేవలందుకొనుము. విశిష్టములైన సద్గుణములన్నియు ఆభరణములు గాగల ఓ శంకరా! ప్రేమతో నాబుద్ధి అనే కన్యామణిని అందముగా అద్భుతముగా ఏలుకొనుము. ఓ లోక బాంధవా! నా మనస్సు మీకు అద్భుతమైన గృహము. అక్కడే మీరు సదా నిశ్చింతగా ఉండవచ్చును.

శ్లో॥ 85

జలధి మథన దక్షో నైవ పాతాళ భేదీ
న చ వన మృగయాయాం నైవలుబ్ధః ప్రవీణః
అశన కుసుమ భూషా వస్త్రముఖ్యాం సపర్యాం
కథయ కథ మహంతే కల్పయా నీందు మౌళే!

పద్యరూపాంతరంః

సీ॥ క్షీర సాగరమును చిలుకుటకును శక్తి
కలవాడ నా ప్రభూ! కానెకాను
పాతాళ లోకంబు పట్టి భేదింపంగ
గలిగిన వాడనే కానెకాను
అటవీ మృగంబుల అవలీల వేటాడ
కడునిపుణుడనైన కానె కాను
ఆచార నిష్ఠలు నాచేత గాదయ్య
సేవచేయు ఎట్లు చెప్పు స్వామి

తే॥ నీకు ఆహారమును విరుల్ సోకుదీర
భూషణంబులు వలువలు పూజయున్న
సకల ఉపచారములు జేయు జాడనెరుగ
ఇంక బ్రోవ నీవేగతి ఇందు మౌళి!

భావానందలహరిః

తా॥ ఇందుమౌళీ! క్షీరసాగరాన్ని నీ భక్తులు దేవదానవులు చిలికి నీకృపవల్ల విష్ణువు దయవల్ల సాధించారు గాని నాకంత శక్తిఉందా? పోనీ పాతాళలోకాన్ని జయించగల సామర్థ్యం ఉన్నవాడినా? కానేకాను. నీభక్తుడు తిన్నడివలె అడవి మృగాలను వేటాడగల నిపుణుడినా అంటే కాదు. ఆచారములు నిష్ఠలూ సేవా పద్ధతులూ తెలియని వాడిని, పూలు, ఇక నేను నీ సేవెట్లు చేయగలను. నీ ఆహారము, వస్త్రములు, భూషణములు మరియు ఇతర పరిచర్యలు చేసే విధానము తెలిసిన వాడిని కాను. మరి ఇక నన్ను బ్రోచుగతి నీవే.

శ్లో॥ 86

పూజా ద్రవ్య సమృద్ధయో విరచితాః పూజాం కథం కుర్మహే
పక్షిత్వం నచ వా కిటిత్వమపి న ప్రాప్తం మయా దుర్లభం
జానే మస్తక మంఘ్రి పల్లవ ముమాజానే నతేహం విభో
న జ్ఞాతం హి పితామహేన హరిణా తత్త్వేన తద్రూపిణా॥

పద్యరూపాంతరంః

సీ॥ కనుగొన జాలను నేను నీ శిరసును
పాదపల్లవముల ప్రాప్తి గనను
హంసను గాకుంటి అరుదైన 'కిటి' గాను
ఆరూపములు దాల్చినారు ముందె
బ్రహ్మచే హరిచేత బడయ బడినవిగా
నీరూపమేదియో ఎరుగరైరి
హే విభో! నీపూజ ఇంకెట్లు జేయను
ఎరుగనైతిని ప్రభూ! ఈ వివరము

తే॥ పూజ చేయంగ ద్రవ్యంబులుండు గాక
అన్ని సమకూర్చబడికూడ అమరవంద్య!
నేను నీ నిజరూపమున్ కాననైతి
పార్వతీ పతే! పరమేశ పాహి పాహి.

భావానందలహరిః

తా॥ ఓ పార్వతీ పతీ! నాకు నీ పాదపద్మములయొక్క గానీ శిరస్సు యొక్క గానీ దర్శన భాగ్యం ప్రాప్తించుటలేదు. హంసలాగా ఆకాశంలో ఎగరలేను. వరాహములాగా భూమిలోకి జొచ్చుకొని పోలేను. ఎందుకంటే చాలాకాలం క్రితం బ్రహ్మ హంసవలె శ్రీహరికిటివలె నీ మహాలింగపు ఆద్యంతములు కనుగొనవలెనని ప్రయత్నించి విఫలురైనారు. ఇక నాకావివరం తెలియుట సాధ్యమయ్యేపనేనా? ఓ ప్రభూ మరి నిన్నెట్లా పూజించను? ఓ సురవంద్య! నేను పూజా ద్రవ్యాల నన్నింటినీ సమకూర్చుకున్నాను. కానీ నీరూపాన్ని దర్శించలేక పోతున్నాను.

శ్లో॥ 87

అశనం గరళం ఫణీ కలాపో వసనం
చర్మ చ వాహనం మహోక్షః
మమ దాస్యసి కిం కి మస్తి శంభో!
తవ పాదాంబుజ భక్తి మేవ దేహి॥

పద్యరూపాంతరంః

చం॥ గరళము భుక్తి, భూషణము కాటును
వెట్టెడి నాగు, ఓ శివా!
కరివరు చర్మమే వలువగట్టగ, వాహన
మయ్యె ఎద్దు ఓ
హర! అదియున్ భళీ! ముసలిదాయెను
హా! నువు ఏమి ఇత్తువో?
సరి, ఇక పాదపద్మములు చక్కగ
గొల్చెడి భక్తి చాలురా.

భావానందలహరిః

తా॥ ఓ శివా! నీకు గరళమే తిండి, కాటువేసే సర్పాలే నగలు, కరిశ్రేష్ఠుడైన గజాసురు చర్మము కట్టుకునే బట్ట, నీ వాహనమేమో ముసలి ఎద్దు ఇటువంటి నీవు నాకేం ఇస్తావయ్యా? కనుక నీ పదపంకజములపై నాకు అనన్య భక్తినిమ్ము. నాకది చాలు ప్రభూ!

శ్లో॥ 88

యదా కృతాంభోనిధి సేతుబంధనః
కరస్థలాధః కృత పర్వతాధిపః
భవాని తే లంఘిత పద్మసంభవ
స్తదా శివార్చా స్తవ భావన క్షమః

పద్యరూపాంతరంః

చం॥ అల రఘురాము రీతిని జలార్ణవ
మందున సేతు బంధనన్
సలుపగలేను, వింధ్య గిరిచక్కగ నా అర
చేత నొక్కుచున్
నిలువుగ మించి పోవుటను నిల్పగ
లేనుర, బ్రహ్మదేవునిన్
గెలువగ లేను ఓ శివ! సుకీర్తన ధ్యానము
పూజ సల్పెదన్

భావానందలహరిః

తా॥ ఓ శివా! త్రేతాయుగంలోని ఆ శ్రీరామచంద్రుడలా సముద్రంమీద సేతువును నిర్మించలేను. అగస్త్య మహర్షిలా పెరుగుతూ పోయే వింధ్య పర్వతాన్ని అరచేతితో నొక్కి ఆపలేను. పోనీ సర్వసృష్టికర్త అయిన బ్రహ్మదేవుని గెలిచే శక్తిలేని వాడను. ఆయనే నిన్ను పూజించి సృష్టి నారంభిస్తాడు. నేనుకూడా నీ ధ్యానమును, పూజనమును, సుకీర్తనను చేసెదను.

శ్లో॥ 89

నతిభి ర్నుతిభి స్త్వ మీశ! పూజా విధిభి ర్ధ్యానసమాధిభి
ర్నతుష్టః
ధనుషా ముసలేన చాశ్మభిర్వా వద తే ప్రీతికరం తథా
కరోమి

పద్యరూపాంతరం:

చం॥ సలుపుచు వందనంబు, నుతి, చక్కటి
పూజలు, ధ్యానముద్రలన్
కలుగదు సంతసంబు, శివ! కష్టమదైనను
వింటి చేతదె
బ్బలనిడ, రోకటిన్ నలుగ బాదిన
రాళ్ళతొ కొట్ట, పూజచే,
కలుగునె మోదమట్లయిన గట్టిగ నేనును
గొట్ట జాలనే!

భావానందలహరి:

తా॥ ఓ శివా! ఆనాడు అర్జునుడు పాశుపతాస్త్రం కోసం ఘోరమైన తపస్సు చేసి నీవు కిరాతకుడి రూపంలో వచ్చి పరీక్షిస్తే తూణీరం మాయం చేస్తే విల్లు తీసుకుని దానితో కొట్టాడు నిన్ను. చాక్యనయనార్లు అనే భక్తుడు నిన్నపార్థం చేసుకుని రోకలితో కొట్టాడు.

ఇంకొక భక్తుడు రాళ్ళు రువ్వి కొట్టి స్వామి దయపొందాడు. ఇంకొక బౌద్ధుడు నీపై ప్రేమ కలిగి అది బాహాటంగా ఒప్పుకొనుటకు సిగ్గుపడి లింగాన్ని రాళ్ళతో కప్పి పూజించాడు. స్వామీ నువ్వతనికీ మోక్షమిచ్చావు. నేనేమో నీకు నవ విధం ఆరాధన చేస్తే నీ దయ కలుగుట లేదు. నీకు ఎలా సంతోషమో నేనూ అలాగే చేస్తాను. నన్ను రక్షించు ప్రభూ!

శ్లో॥ 90

వచసా చరితం వదామి శంభో
రహ ముద్యోగ విధాసు తే ప్రసక్తః
మనసాకృతి మీశ్వరస్య సేవే
శిరసా చైవ సదాశివం నమామి॥

పద్యరూపాంతరం:

ఉ॥ యోగ విధానముల్ తెలియ నోహర!
వాక్కుల నీ చరిత్రలన్
నేగొని పల్కెదన్ మనసు నింపుచు ఈశ్వరు
డైన నిన్నునే
నాగక సేవ జేసెదను అద్భుత రూపము
గుండె నిండగా
చేగలవాడ వందనము జేయుచు శీర్షము
తో సదా శివా!

భావానందలహరి:

తా॥ ఓ సదా శివా! నాకు యోగము చేయు పద్ధతులు రావు, నాకు తెలిసిన మాటలు నీ చరిత్రములే వాటిని నామనస్సున నిలిపి ఈశ్వరుడవైన నీకు సేవ చేసెదను. అద్భుతమైన నీ రూపమును హృదయంలో నిండిపోగా నీకు నా శిరస్సుతో వందనమాచరించెదను.

శ్లో॥ 91

ఆద్యా విద్యా హృద్గతా నిర్గతాసీత్
విద్యా హృ ద్యా హృద్గతా త్వత్ప్రసాదాత్
సేవే నిత్యం శ్రీకరం త్వత్పాదాబ్జం
భావే ముక్తేర్భాజనం రాజమౌళే॥

పద్యరూపాంతరం:

ఉ॥ నీదయచేత నాయెడద నీకయె వాసము
అందనాదిగా
పాదుకొనున్నదయ్య శివ! పాయక నాదు
అవిద్య తొల్గెరా
నీదగు విద్య నాయెదను నిండుగ జేరెను
ముక్తిదక్క, నీ
పాదసరోజముల్ మదిని ప్రాప్తిల నిత్యము
సేవ జేతురా.

భావానందలహరి:

తా॥ ఓ శివా! నీకృపచేత నా హృదయమే నీకు నివాసమైనది. దాంట్లో అనాదిగా పాతుకొనిపోయి వున్న అవిద్య వీడిపోయింది. నీగురించి తెలుపునట్టి విద్య నామనస్సంతా వ్యాపించింది. దానివల్ల నాకు ముక్తి లభిస్తున్నది. ఓ శంకరా! నా మనస్సులో నీ పాదపద్మలు నిలిచిపోగా అనునిత్యము నిన్ను సేవించెదను ప్రభూ!

శ్లో॥ 92

దూరీకృతాని దురితాని దురక్షరాణి
దౌర్భాగ్య దుఃఖ దురహంకృతి దుర్వచాంసి
సారం త్వదీయ చరితం నితరాం పిబంతం
గౌరీశ! మా మిహ సముద్ధర సత్కటాక్షైః

పద్యరూపాంతరం:

చం॥ దురితపు కర్మలన్ తొలుత తోపక జేసి
దురక్షరంబులన్
విరివిగ వ్రాసితిన్ చెడు ప్రవృత్తిని శోకము
పొంద గర్విౖ
కరకుగ దుష్ప్రసంగములు కానక జేసితి
నేడు మారితిన్
చరితము నీది నేర్చితిని జ్ఞానపు భక్తి
రసంబు ద్రావితిన్
హర! కడగంట చూసి నను అద్భుత లీల
సముద్ధరింపనే

భావానందలహరి:

తా॥ ఓ గౌరీశా! హరా! ఇది వరలో తెలియక చాలా చెడు పనులు చేశాను. వ్రాయకూడనివన్నీ వ్రాశాను. ఆ చెడు ప్రవృత్తివల్ల శోకం పొందాను. దుష్ట ప్రసంగాలు చేశాను. కానీ ప్రభూ! నేడు పశ్చాత్తాపంతో మారి

పోయాను. నీ చరిత్ర తెలుసుకున్నాను. జ్ఞానముచే కలుగు భక్తియొక్క రసాస్వాదన చేశాను. నన్ను నీ కడగంటితో చూసి అద్భుతమైన విధంగా నన్ను బాగుగా ఉద్ధరించుము దేవా!

శ్లో॥ 93

సోమ కళాధర మౌళౌ కోమల
ఘనకంధరే మహామహసి
స్వామిని గిరిజా నాథే మామక
హృదయం నిరంతరం రమతామ్॥

పద్యరూపాంతరం:

చం॥ శిరమున చంద్రరేఖ నివసించగ దాల్చును
గౌరినాధుడున్
నిరతము నా మనంబునను నిల్చును, ముచ్చట
గొల్పునట్టి కం
ధరము సునీలమయ్యదియు తానును
అందరి స్వామి, వానిదొ

సురుచిరతేజమందలరి సొంపుగ నిత్యము
నేరమించెదన్.

భావానందలహరి:

తా॥ తలపైన చంద్రరేఖ మిల మిల మెరస్తుండు విధమున ధరించువాడు గౌరీనాదుడు. నిత్యమూ నా హృదయమున నివసించును. ఆ నీలకంధరము మిక్కిలి శోభతో అలరారు చుండును. ఆ మహేశ్వరుడు సర్వులకు ప్రభువు. ఆయన అద్భుతమైన తేజస్సున నిత్యమూ ఆనందముగా నివసింతును గాక!

శ్లో॥ 94

సా రసనా తే నయనే తావేవ
కరౌ స ఏక కృతకృత్యః
యా, యే, యౌ, యో భర్గం వద
తీక్షే తే సదార్చత స్మరతి॥

పద్యరూపాంతరం:

సీ॥ ఏయది పరమేశు నిచ్చతో పలుకునో
  విలువైన దైనట్టి నాలుకదియె
ఏయది పరమేశు నింపుగా జూచునో
  నిరుపమానంబైన నేత్ర మదియె
ఏయది పరమేశు నెందైన అర్చించు
  కరయుగంబౌ నదే కరము ఘనము
ఎవ్వాడు పరమేశునెల్ల వేళలయందు
  స్మరియించుచుండునో సద్గుణుండు

ఆ॥ వాడె అవనియందు భక్తుండు ధన్యుండు
శివుని కరుణ బొందు శ్రేష్ఠుడతడు
నిజము నిజము వాడె నిలుచు కృతార్థుడై
పరమ శివుని దయకు పాత్రుడగును.

భావానందలహరి:

తా॥ ఏదైతే పరమేశ్వరుని నామము కోర్కెదీరా పలుకుతుందో నాలుక అంటే అదే. ఏదైతే పరమశివుని ఇంపుగా చూస్తుందో కన్ను అంటే అదే. ఏదైతే పరమేశ్వరుని ఎక్కడైనా అర్చిస్తుందో హస్తద్వయం అంటే అదే మరియు అది ఎంతో ఘనమైనది. ఎవడైతే పరమేశ్వరుని ప్రతిక్షణం ధ్యానిస్తుంటాడో వాడే ఈ లోకంలో సద్గుణుడైన భక్తుడు. శివుని కరుణకు పాత్రుడయ్యే శ్రేష్ఠుడతడే. ఈ మాట సత్యం. వాడే నిజమైన కృతార్థుడు.

శ్లో॥ 95

అతి మృదులౌ మమ చరణా వతి కఠినం తే మనో
  ‘భవానీశ!’
ఇతి విచికిత్సాం సంత్యజ శివ! కథ మాసీ ద్గిరౌ తథా
  ప్రవేశః

కం॥ నా పాదమెంతొ సున్నిత
మో పార్వతి నాధ! నీకు యున్నమనంబున్
ఆ పాషాణమనందురు
ఈ పర్వత సంచలన ఎవ్విధి కలిగెన్?

భావానందలహరి:

తా॥ ఓ పార్వతీ రమణా! నా పాదము సున్నితమూ, బలహీనమూ అయినది. ఇక నీ మనస్సు నీవు నిత్యమూ సంచరించే ఆ పాషాణ ప్రాంతము వంటిది. భక్తవరదుడవైన నీకు ఈ బండ రాళ్ళల్లో తిరిగే అలవాటు ఎలా కలిగిందయ్యా?

శ్లో॥ 96

ధైర్యాంకుశేన నిభృతం రభసా దాకృష్య భక్తి శృంఖలయా
పురహర చరణాలానే హృదయ మదేభం బధాన చిద్యంత్రైః

పద్యరూపాంతరం:

చం॥ పురముల మూటిగెల్చు శివ! యుల్లము
  నాది గజంబుమత్తిలెన్
స్థిరమగు నిశ్చయంబనెడి దీటగు అంకుశ
  మెత్తి పోటుతో
చరణపు కట్టుగంబమున శంకర మంత్రపు
  యంత్రయుక్తమై
నిరతము భక్తి శృంఖలల నిల్పుచు గట్టిగ
  కట్టివేయుమా

భావానందలహరి:

తా॥ ఓ శివా! త్రిపురములను గెల్చిన ప్రభూ! నా మనస్సు మదవుటేనుగు వంటిది. దీనిని నీవే నియంత్రించగలవు. స్థిరమైన నిశ్చయమనే అంకుశంతో పొడుస్తూ దీనిని నీచరణములనే కట్టు గంబమునకు (ఏనుగుల్ని కట్టివేసే స్తంభం) శంకర మంత్రము అనే యంత్రంతో పాటు ఎప్పుడూ భక్తి అనే గొలుసులతో గట్టిగా కట్టివేసి నిలుపుము.

శ్లో॥ 97

ప్రచర తృభితః ప్రగల్భ వృత్యా
మదవా నేష మనః కరీ గరీయాన్
పరిగృహ్య నయేన భక్తి రజ్జ్వా
పరమ స్థాణుపదం దృఢంనయాయుమ్

పద్యరూపాంతరం:

చం॥ పరమశివా! మదించినది బాగుగ పెద్దది
యైన నా మనం
బరయ, కరీంద్ర మయ్యదియు ఆపుట
కానిది ఇచ్చవచ్చిన
ట్లెరుగదు కట్టు, భక్తియను దిట్టపు
త్రాటిని గట్టిపట్టుగాచున్
స్థిరమగు స్థానమున్ తమిని జేరగ
చేకొని పొమ్ము ఈశ్వరా!

భావానందలహరి:

తా॥ ఓ పరమశివా! చాలా పెద్దదియును, మదించనదియు యైన మదగజము వంటిది నా మనస్సు. ఇది ఇష్టంవచ్చినట్లు ప్రవర్తిస్తుంది. కట్టుబాట్లను ఎరుగదు. దానిని భక్తి అనే గట్టి త్రాటితో కట్టివేసి ఓ ఈశ్వరా నీ స్థిరమైన స్థానమునకు తీసికొని పొమ్ము.

శ్లో॥ 98

సర్వాలంకారయుక్తాం సరళ పదుతాం సాధువృత్తాం
సువర్ణాం
సద్భి స్సంస్తూయమానాం సరసగుణయుతాం లక్షితాం
లక్షణాఢ్యామ్
ఉద్యద్భూషావిశేషా ముపగతవినయాం ద్యోతమానార్థ
రేఖాం
కళ్యాణీం దేవ! గౌరీప్రియ! మమ కవితా కన్యకాం త్వం
గృహాణ॥

పద్యరూపాంతరం:

సీ॥ పలు అలంకారాలు ప్రభవిల్ల సరళమౌ
పదములు వృత్తముల్ జతగ కుదిరె
శుభకరాక్షరములు స్తుతియింప దగినట్టి
కావ్యలక్ష్యము నేర్పు కన్యఈమె
సరస గుణములుండె చక్కని లక్ష్యంబు
కావ్యలక్షణములు కలవు పెక్కు
స్వప్రకాశత్ భూష సర్వనియమయుక్త
స్పష్ట భావార్థ సంజనిత ఈమె

తే॥ అమరె కళ్యాణి అవుటచే అర్థ పుష్టి
నాదు కావ్య కన్యక ఇది సాదరముగ
దేవ! గౌరీ ప్రియా! నీవు దాని నిపుడు
స్వీకరింపుము ధన్యుని జేయుమయ్య!

భావానందలహరి:

తా॥ ఓ గౌరీనాథా! నా ఈ కావ్య కన్యక (శివానందలహరి) కళ్యాణ గుణములు కలిగిన (చిన్నది) ఈమె ఎన్నో

అలంకారములతో శోభిల్లుచున్నది. సరళమైన పదములు, వృత్తములు (ప్రవృత్తులు) గలది. శుభకరాక్షరములు (సువర్ణము అనగా బంగారు మేనిఛాయ) కలది. స్తోత్రించదగ్గ కావ్య లక్షణములు (సత్పురుషులు మెచ్చు లక్షణములు కలది) ఈమె స్వప్రకాశత్ భూష (బాగుగా ప్రకాశించు ఆభరణములు కలది) అన్ని నియమములు కలది. (మంచి నడవడి కలది). ఓ ప్రభూ! ఈ కవితా కన్యను స్వీకరించి నన్ను కృతార్థుణ్ణి చేయుము.

శ్లో॥ 99

ఇదంతే యుక్తం వా పరమశివ! కారుణ్య జలధే!
గతౌ తిర్యగ్రూపం తవపద శిరో దర్శన ధియా
హరి బ్రహ్మాణౌ తౌ దివి భువి చరంతౌ శ్రమయుతౌ
కథం శంభో! స్వామిన్! కథయ మమ వేద్యో సి పురతః

పద్యరూపాంతరం:

సీ॥ నీ పాదయుగళమున్ నీ శిరస్సును గాంచ
యత్నించి రానాడు హరి, విరించి

కిటి అయ్యె హంసయ్యె కేశవుండును బ్రహ్మ
భూమి ఆకాశముల్ బూని వెదుక
శ్రమ బొందిరే గాని సాధింపరైతిరి
నీజాడనెరుగరే అజుడు హరియు
ఇంక నీవేరీతి ఎఱుగబడెదవయ్య
జ్ఞానహీనుండను మానవుడను

తే॥ నీకు తగదు నన్నిటు వీడ నీవె ఎరుగ
జెప్పు న్యాయమా సర్వేశ! శివ! మహేశ!
స్వామి! శంభో! మహదేవ! జగతి కర్త!
పాహిమాం పరమేశ్వరా! పాహి పాహి

భావానందలహరిః

తా॥ ఓ సర్వేశ్వరా! శివా! ఒకసారి బ్రహ్మ విష్ణువులు. నీ మహాలింగ దర్శనం చేసి దాని ఆద్యంతముల నెరుగవలెనని బ్రహ్మ హంస రూపమున మహా లింగ పైభాగమును, మహా విష్ణువు వరాహరూపమున నీ ఆది, తుది తెలియుటకు ప్రయత్నించి విఫలురైరి. వారు లోక పాలకులైన దేవతలు. వారికే

అసాధ్యమైన పని మానవుడను నాకెట్లు సాధ్యమగును. నన్ను ఇపుడు త్యజించుట అన్యాయము. జగతికర్తవైన ఓ పరమేశ్వరా! పాహిమాం.... పాహిమాం

శ్లో॥ 100

స్తోత్రేణాల మహం ప్రవచ్మి న మృషా దేవా! విరించ్యాదయ
స్తుత్యానాం గణనా ప్రసంగ సమయే త్వా మగ్రగణ్యం విదుః
మాహాత్మ్యాగ్ర విచారణ ప్రకరణే ధాన్యా తుషస్తోమన
ద్ధూతాస్త్యాం విదు రుత్తమోత్తమ ఫలం శంభో! భవత్సేవకాః

పద్యరూపాంతరంః

సీ॥ బ్రహ్మాది దేవతల్ పాదదాసులు నీకు
అగ్రగణ్యుడవీవు అమరులందు
అని నేర్చిరెల్లరున్ ఆ మహాత్మ్యము నెన్న
అది అసాధ్యము ప్రభూ! అమల చరిత!
సారహీనంబైన వరిపొట్టు వారలు
ఎగిరిపోదురు గాలి సాగినంత
సారవంతంబైన చక్కని ధాన్యంబు
వలె నిల్చిపోదువు తెలుసుకొంటి

తే॥ అవని కర్తవు భర్తవు అంతకుడవు
ఈవె, అనృతమ్మిది కాదు నీవె సాక్షి
పలుకుచున్నాను నిజమును పరవశించి
స్తోత్రమిక చాలు అగుగాక శుభము శుభము

భావానందలహరిః

అమల చరితుడవైన ఓ పరమేశ్వరా! బ్రహ్మాది దేవతలు నీపాదదాసులు. దేవతలందరిలోనూ నీవే అగ్రగణ్యుడవు అని తేటతెల్లమయింది. ఆ మహాత్మ్యమును అంచనా వేయుట అసాధ్యము. అన్య దేవతలందరూ సారములేని ఊకవంటివారు. గాలికే ఎగిరిపోతారు. నీవు సారవంతమైన ధాన్యంలా నిలిచియే ఉంటావు. నీవు ఈ లోకకర్తవు, భర్తవు, అంతకుడవు కూడా నీవే. ఈమాట అబద్ధం కాదు. నీవే దీనికి సాక్షివి. నేను పారవశ్యంతో కూడ నిజము చెప్తున్నాను. ఓ పరమేశ్వరా ఈ స్తోత్రం ఇక చాలు. లోకాః సమస్త స్సుఖినోభవన్తు.

అథ శ్రీ శివపంచాక్షర స్తోత్రము

నాగేంద్రహారాయ త్రిలోచనాయ। భస్మాంగరాగాయ
మహేశ్వరాయ।
నిత్యాయ శుద్ధాయ నిరంజనాయ । తస్మైన కారాయ
నమశ్శివాయ॥
మందాకినీ సలిల చందన చర్చితాయ। నందీశ్వర ప్రమథ
నాథ మహేశ్వరాయ।
మందారముఖ్య బహుపుష్ప సుపూజితాయ। తస్మై
మకారాయ నమశ్శివాయ
శివాయ గౌరీవదనార విందః సూర్యాయ
దక్షాధ్వరనాశకాయ।
శ్రీనీలకంఠాయ వృషధ్వజాయ। తస్మైశికారాయ
నమశ్శివాయ॥
వసిష్ఠకుంభోద్భవగౌతమాది। మునీంద్ర దేవార్చిత
శేఖరాయ।
చంద్రార్కవైశ్వానర లోచనాయ। తస్మైవకారాయ
నమశ్శివాయ॥
యక్షస్వరూపాయ జటాధరాయ। పినాకహస్తాయ
సనాతనాయ।
సుదివ్య దేహాయ దిగంబరాయ। తస్మై య కారాయ
నమశ్శివాయ॥
పంచాక్షర మిదం పుణ్యం యఃపఠేచ్ఛివ సన్నిధౌ।
శివలోక మహాప్నోతి శివేన సహ మోదతే॥

భ్రమరాంబాష్టకమ్

సంస్కృత శ్లోకముల మూలము

ఆది-శంకరాచార్య విరచితము

తెలుగు పద్యములు తాత్పర్యము

రచన :

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

M.Tech.

భ్రమరాంబాష్టకమ్

1

శ్లో॥ చాంచల్యారుణ లోచనాంచిత కృపా చంద్రార్క
చూడామణిం
చారుస్మేరముఖాం చరాచరజగత్సంరక్షిణీం తత్పదాం
చంచచ్చంపక నాసిగాగ్ర విలసన్మౌక్తామణీరంజితాం
శ్రీశైలస్థలవాసినీం భగవతీం శ్రీమాతరం భావయే॥

సీ॥ చంచలంబైనట్టి చక్షులు అరుణాలు
దయజిమ్ము చూపుల తల్లి భ్రమర,
సూర్య చంద్రులు నొప్పు చూడామణుల వోలె
అందాల చిరునవ్వు ఆమె సొమ్ము
ఈ చరాచర జగత్తేలి సంరక్షించి
తత్పదంబందించు తల్లి ఈమె
విరియు సంపెంగ ఈవిడ నాసికాగ్రంబు
రంజిల్లు ముత్తెంపురశ్మిజేత

తే॥ శ్రీశిఖరమను స్థలమున జేరి తాను
వాసముగ నిల్చి బ్రోచెడి భగవతికిని
మాత భ్రమరాంబికను నాదు మనసులోని
భావముననుంచి చేతును వందనములు.

తా॥ శ్రీశైల వాసినియైన భ్రమరాంబికా దేవి చంచలాక్షులతో, అరుణ నయనాలతో, దయ ప్రసాదించు చూపులతో శోభిల్లు తల్లి. సూర్య చంద్రులామెకు చూడామణులు. అందమైన చిరునవ్వు ఆమె ఆభరణం. ఆమె చరాచరమైన ఈ జగతిని పరిపాలించి, రక్షించి మోక్షపదం అందించు జనని. ఈ దేవి ముక్కు సంపెంగ పూవు వలెనుండి ముత్యపు ముక్కుపుడక శోభాయమానముగ నుండును. ఈ దేవి భక్తులను కాపాడు భగవతి. ఈ తల్లిని నా మనసులోని భావమున నిలిపి వందనము జేసెదను.

2

శ్లో॥ కస్తూరీ తిలకాంచితేందు విలస త్ప్రోద్భాసిఫాలస్థలీం
కర్పూర ద్రవమిశ్ర చూర్ణఖదిరా మోదోల్లసద్వీటికాం
లీలాపాంగ తరంగితై రధికృపాసారై ర్నతానందినీం
శ్రీశైలస్థలవాసినీం భగవతీం శ్రీమాతరం భావయే॥

సీ॥ కస్తూరి తిలకంబు ఘన ఫాల భాగాన
శోభిల్లు నమ్మకు, శుభకరిణికి
తిలకంబు చుట్టూత తెల్లని కర్పూర
మెంతయో శోభించి నింతి కెపుడు

అమ్మ ఆస్వాదించునట్టి కర్పూరపు
తాంబూలము పరిమళంబు నింపు
లీలాతరంగంబు వలె దయజిమ్మును
ఆజడివానయు ఆమె కృపయె

తే॥ శ్రీ శిఖరమను స్థలమున చేరి తాను
వాసముగ నిల్చి బ్రోచెడి భగవతికిని
మాత భ్రమరాంబికను నాదు మనసులోని
భావమున నుంచి చేతును వందనములు.

తా॥ శ్రీశైల వాసినియైన భ్రమరాంబికా దేవికి, శుభముల నిచ్చు తల్లికి నెన్నుదుట గొప్ప కస్తూరీ తిలకము శోభిల్లు చుండును. ఆయమ్మకు తిలకము చుట్టూ తెల్లని కర్పూరపు బొట్టు శోభించు చుండును. ఆ దేవి సేవించునట్టి కర్పూరపు తాంబూలము పరిమళములను వెదజల్లుచుండును. తనలీలతో ఆమె దయను అలవలె వెదజల్లును. ఆ జడివాన కూడ ఆమె కృపవల్లనే లభ్యమగును. ఆ దేవి భక్తులను సంరక్షించు కరుణామయియైన భగవతి. నామనస్సులోని భావమున నిలిపి వందనము జేసెదను.

3

శ్లో॥ రాజన్మత్త మరాళమందగమనాం రాజీవ పత్రేక్షణాం
రాజీవ ప్రభవాది దేవముకుటై రాజత్పదాంభోరుహాం
రాజీవాయతపత్రమండితకుచాం రాజాధిరాజేశ్వరీం
శ్రీశైలస్థలవాసినీం భగవతీం శ్రీమాతరం భావయే॥

సీ॥ పద్మ పత్రేక్షణి, మదియించి నటువంటి
రాయంచనడకల లలితగమన
బ్రహ్మాది సురలంత వందనంబులు జేయ
వెలుగొందు పాదాల వేల్పు ఈమె
పద్మ దళములచే బాగుగా శోభించు
స్తనయుగ్మములు గల జనని భ్రమర
రాజాధిరాజులు నిజముగా వినయులౌ
రాజరాజేశ్వరీ, రమ్య, సౌమ్య

తే॥ శ్రీ శిఖరమను స్థలమున చేరి నిలచి
వాసముగ నిల్చి బ్రోచెడి భగవతికిని
మాత భ్రమరాంబికను నాదు మనములో
భావముననుంచి చేతును వందనములు

తా॥ శ్రీశైలవాసినియైన భ్రమరాంబికాదేవి కమల దళములవంటి కన్నులు గల తల్లి. మదించిన రాజహంస వంటి నడక, అందమైనదిగా ఆమెకు శోభ తెచ్చును. బ్రహ్మాది దేవతలు ఆమెకు భక్తితో తలలు వంచి నమస్కరించగా వారి కిరీటములలోని మణుల కాంతికి ఆమె పాదములు మెరుపులు జిమ్మును. ఆ తల్లి కుచద్వయము పద్మదళముల చేత కప్పబడి బాగుగా శోభించుచుండెను. రాజాధిరాజులే ఆమెకు వినమ్రులైయుందురు. అటువంటి అమ్మ రాజరాజేశ్వరి రమ్య, సౌమ్య అను పేర్లతోనూ ప్రసిద్ధి చెందినది. ఆ దేవి భక్తులను కాపాడు భగవతి. నామనస్సులోని భావమున నిలిపి వందనము జేసెదను.

4

షట్ తారాంగణదీపికాం శివసతీం షడ్వైరివర్గాపహాం
షట్చక్రాంతరసంస్థితాం వరసుధాం షడ్యోగినీ వేష్టితాం
షట్చక్రాంచిత పాదుకాంచితపదాం షడ్భావగాం షోడశీం
శ్రీశైలస్థలవాసినీం భగవతీం శ్రీమాతరం భావయే॥

సీ॥ ఓంకార షట్కాన నొప్పువెల్గుల దివ్వె
షడ్ శత్రులను ద్రుంచు శంభురాణి
షట్చక్రములనుండు జనని, షడ్యోగినీ
వేష్టితయైనట్టి వేదవినుత
జననాది షడ్భావమునుతను నడపును
షడ్చక్రయుక్తంబు జనని పదము
పదునారు అయినట్టి వర్ణాలతో నిండు
మంత్ర రూపిణియైన మాతభ్రమర

తే॥ శ్రీ శిఖరమను స్థలమున చేరి తాను
వాసముగ నిల్చి బ్రోచెడి భగవతికిని
మాత భ్రమరాంబికను నాదు మనసులోని
భావముననుంచి చేతును వందనములు.

తా॥ శ్రీశైలవాసినియైన భ్రమరాంబికా దేవి ఆ తల్లియొక్క మంత్రముననున్న ప్రణవములు ఆరు. అందుచే ఓంకార షట్కముయొక్క ముంగిలిలో వెలుగుల దివ్వె వంటిది. కామ, క్రోధములవంటి ఆరు అంత శ్శత్రువులను అంతమొందించు శివునర్ధాంగి. మూలాధారము మొదలైన ఆరు చక్రములయొక్క

అంతర్భాగమే ఆ జనని నివాసము. అందులో ఆమె కాకిన్యాది యోగినీ షట్కములచే పరివేష్టింపబడి అమృతము గురిపించు చుండును. ఆమె వేదములచే కొనియాడబడునది. జననాది ఆరుభావములలోను ఆమె నడపును. ఆమె పాదము ఆరు చక్రములతో శోభిల్లుచుండును. ఆ భ్రమరాదేవి పదునారు వర్ణములతో నిండిన మంత్ర రూపిణి. ఆ దేవి భక్తులను కాపాడు భగవతి. నామనస్సులోని భావమున నిలిపి ఆమెకు వందనము జేతును.

5

శ్లో॥ శ్రీనాథాదృత పాలిత త్రిభువనాం శ్రీచక్రసంచారిణీం
గానాసక్తమనో జయౌవనలస ద్గంధర్వ కన్యాదృతాం
దీనానా మతివేల భాగ్యజననీం దివ్యాంబరాలంకృతాం
శ్రీశైలస్థలవాసినీం భగవతీం శ్రీమాతరం భావయే॥

సీ॥ ముల్లోకముల నేలు తల్లి, శ్రీనాథుని
ఆదరంబున జూచు అమ్మ, ఆమె
శ్రీచక్ర సంచారి, శృంగార భావాల
గంధర్వ కన్యల గానమలరు

దీనుల దరిజేరి దునుమును దైన్యంబు
భాగ్యంబులొసగెడి, వరప్రదాత
దివ్య వస్త్రంబుల దీర్చు, అలంకార
భూషితయైనట్టి పుణ్య చరిత

తే॥ శ్రీ శిఖరమను స్థలమున చేరి తాను
వాసముగ నిల్చి బ్రోచెడి భగవతికిని
మాత భ్రమరాంబికను నాదు మనసులోని
భావముననుంచి చేతును వందనములు

తా॥ శ్రీశైల వాసినియైన భ్రమరాంబికాదేవి ముల్లోకములను పరిపాలించేటి తల్లి. శ్రీమహావిష్ణువుని సోదరునిగా ఆదరభావముతో జూచు తల్లి ఆమె. ఆ దేవి శ్రీచక్రమున సంచరించు తల్లి. గంధర్వకన్యలు శృంగార భావయుక్తమైన కమ్మని గానంతో ఆమెకు ఆనందం కలిగిస్తుంటారు. ఆమె దీనుల దగ్గరజేరి దైన్యం రూపుమాపి వారికి వరములతో భాగ్యములిచ్చెడి కరుణామయి. ఆమె దివ్య వస్త్రములను దాల్చి దివ్యమైన భూషణములతో శోభిల్లునట్టి పుణ్య చరిత. ఆ దేవి భగవతి. నా మనస్సులో భావమున నిలిపి ఆమెకు వందనము జేతును.

6

శ్లో॥
లావణ్యాధిక భూషితాంగ లతికాం లాక్షాలసద్రాగిణీం
సేవాయాత సమస్తదేవవనితాం సీమంతభూషాన్వితాం
భావోల్లాస వశీకృతప్రియతమాం భండాసురచ్ఛేదినీం
శ్రీశీలస్థలవాసినీం భగవతీం శ్రీమాతరం బావయే॥

సీ॥ సర్వాభరణపు భూషయు, కడు లావణ్య
లతవంటి దేహము లక్క ఎఱుపు,
లాక్షయని నయంత లావగు నిష్టంబు,
దేవతా స్త్రీలిమె సేవికలగు
సీమంత భూషిణి, శివప్రియ భామిని
మల్లికార్జునుదేలు మంగళకరి
భండాసురుని ద్రుంచి అండగా లోకాల
నేలేటి ఈతల్లి ఇష్టవరద.

తే॥ శ్రీశిఖరమను స్థలమున చేరి తాను
వాసముగ నిల్చి బ్రోచెడి భగవతికిని
మాత భ్రమరాంబికను నాదు మనసులోని
భావముననుంచి చేతును వందనములు

తా॥ శ్రీశైలవాసినియైన భ్రమరాంబికాదేవి, సర్వాభరణ భూషిత, గొప్ప లావణ్యము గలిగినది. సన్నని తీగె వంటి దేహము. లక్కవలె ఎర్రగా మెరయు చుండును. రక్షించు తల్లీ అనగానే ఆమెకు (భక్తులపై) వాత్సల్యం ఎక్కువవుతుంది. సీమంతిని వలె చక్కగా అలంకారములతో శోభిల్లు తల్లి ఆమె. మల్లికార్జునుడిని ప్రేమగా స్వీకరించిన అర్ధాంగి ఈ శివకామిని. భండాసురుని తుదముట్టించి లోకాల నాదుకొన్న ఈప్సితప్రదాత. ఆదేవి భగవతి. నా మనస్సులోని భావమున నిలిపి ఆమెకు వందనము జేతును.

7

ధన్యాం సోమవిభావనీయ చరితాం ధారాధరశ్యామలాం
మున్యారాధన మేధినీం సుమహతాం। ముక్తిప్రదానవ్రతాం
కన్యాపూజన సుప్రసన్న హృదయాం కాంచీ లస న్మధ్యమాం
శ్రీశైలస్థలవాసినీం భగవతీం శ్రీమాతరం భావయే॥

సీ॥ సోమునియందున సొంపుగా ధ్యానింప
దగు, రూప చరితల ధన్యురాలు
ఘనమేఘశ్యామల, మునులు గొల్చెడి తల్లి

ముక్తి నొసంగెడి శక్తి గలది
కన్యార్చనలు జేయు కడుపుణ్యులను బూని
సుప్రసన్నతగాచు సుందరాంగి
సన్నని నడుమున చక్కని ఒడ్డాణ
మది విరాజిల్లెడి అమ్మ ఈమె

తే॥ శ్రీశిఖరమను స్థలమున చేరి తాను
వాసముగ నిల్చి బ్రోచెడి భగవతికిని
మాత భ్రమరాంబికను నాదు మనసు లోని
భావముననుంచి చేతును వందనములు

తా॥ శ్రీశైల వాసినియైన భ్రమరాంబికా దేవి చంద్రుని యందున్న చక్కగా ధ్యానింపదగినవైన రూపము. చరిత్రలు కలిగిన ధన్యురాలైన దేవి. ఆమె శరీర వర్ణము నల్లని మేఘమువలె శ్యామలమైనది. మునులు పూజించగా ముక్తి నొసగు శక్తి స్వరూపిణి. ఆమెను శ్రీకన్యగా భావించి పూజించెడి పుణ్యాత్ములను ప్రసన్నురాలైగాచునట్టి సుందరి ఆదేవి. సన్నని నడుమున చక్కటి ఒడ్డాణము శోభించునట్టి దేవి ఆమె. ఆ దేవి భగవతి. నా మనస్సులోని భావమున నిలిపి ఆమెకు వందనము జేతును.

8

శ్లో॥

కర్పూరాగురు కుంకుమాంకితకుచాం కర్పూర వర్ణాన్వితాం
కృష్ణోత్కృష్ట సుకృష్టకర్మదహనాం కామేశ్వరీం కామినీం
కామాక్షీం కరుణారసార్ద్రహృదయాం కల్పాంతరస్థాయినీం
శ్రీశైలవాసినీం భగవతీం శ్రీమాతరం భావయే॥

సీ॥ కర్పూరమగరులు ఘనకుంకుమాంకిత
  కుచయుగంబుల తల్లి కుందరదన
కర్పూరమై ఛాయ గలదేవి, ముప్విధం
  బుల కర్మల దహించు లలిత ఈమె
సృష్టి జేయగనెంచు శివుని అర్ధాంగిని
  కాముని నిలుపును కన్నులందు
కరుణనిండగయెదన్ కల్పాంతమందాక
  ఏ వికారము నైన నెరుగదీమె

తే॥ శ్రీశిఖరమను స్థలమున చేరి తాను
వాసముగ నిల్చి బ్రోచెడి భగవతికిని
మాత భ్రమరాంబికను నాదు మనసులోని
భావముననుంచి చేతును వందనములు

తా॥ శ్రీశైలవాసినియైన భ్రమరాంబికా దేవి కర్పూరము, అగరు, అధికమగు కుంకుమలు అద్దబడిన ఉన్నతమైన స్తనములు గల తల్లి. ఆమె కర్పూరము వంటి శరీర కాంతి కలిగినది. కృష్ణము, ఉత్కృష్టము మరియు సుకృష్టము అను మూడు విధములైన కర్మములను ఆమె దహించి వైచును. ఆమె సృష్టితలంప గలిగిన ఈశ్వరుని అర్ధాంగి. ఆమె తన కన్నులయందే మన్మథుని నిలిపినది. కల్పాంతము వరకు కరుణాంతరంగయైన ఆ దేవి ఏ వికారములకు లోనుకాదు. ఆ దేవి భగవతి. నా మనస్సులోని భావమున ఆమెను నిలిపి ఆమెకు వందనము జేతును.

9

శ్లో॥

గాయత్రీం గరుడధ్వజాం గగనగాం గంధర్వగాన ప్రియాం
గంభీరాం గజగామినీం గిరిసుతాం గంధాక్షతాలంకృతాం
గంగాగౌతమ గర్గసన్నుతపదాం గాం గౌతమీం గోమతీం
శ్రీశైలస్థలవాసినీం భగవతీం శ్రీమాతరం భావయే॥

సీ॥ గాయత్రియై గాచు గానము జేసిన
  గరుడధ్వజై నిండు గగనమందు
గంధర్వగానంబు కడు ప్రియమామెకు
  గంభీర హృదయిని గజపుగమన
గరధాక్షతల నొప్పు కామిని హిమపుత్రి
  గోరూపి, గౌతమి, గోమతియును
గంగ, గౌతముడు, గర్గాచార్యుడును, ఆమె
  శ్రీపదంబుల సేవజేయు వారె

తే॥ శ్రీశిఖరమను స్థలమున చేరి తాను
వాసముగ నిల్చి బ్రోచెడి భగవతికిని
మాత భ్రమరాంబికను నాదు మనసులోని
భావముననుంచి చేతును వందనములు

తా॥ శ్రీశైలవాసిని యైన భ్రమరాంబికాదేవి గాయత్రీ రూపిణియగుటచే తనను గానము చేసి ఆరాధించు వారిని సంరక్షించును. ఆమె గరుడధ్వజము గలదేవి. గగనమంతా వ్యాపించి నిండి ఉన్నది. ఆమెకు గంధర్వ గానము చాల ప్రీతికరము. ఆమె గంభీర హృదయిని. ఆమె గజగామిని. గంధాక్షతలు ధరించు

ఆమె హిమవంతుని పుత్రిక. గంగ, గౌతముడు, గర్గాచార్యుడు ఆమె శ్రీపదములను కొనియాడిరి. ఆమె గోరూపిణి. గౌతమీ, గోమతి (నదీ దేవతలు) ఆమెయే. ఆ దేవి భగవతి నా మనస్సులోని భావమున నిలిపి ఆమెకు వందనము చేతును.

మంగళమ్

ఆ.వె॥ మంగళంబు కలుగు భ్రమరాంబ జననికి
మల్లికార్జుననకు మంగళంబు
మంగళమగు దీని భక్తితో చదివిన
మంగళంబు కలుగు వసుధప్రజకు

సకల సన్మంగళానిభవన్తు

ఇది కీ.శే॥ అమరవాది రామకృష్ణయ్య, సుబ్బమ్మగార్ల సుపుత్రుడు శ్రీ అమరవాది సుబ్రహ్మణ్యదీక్షితులు అనబడు నాచే ఆదిశంకరుల సంస్కృత మూలమునకు తెలుగు అనుసరణ చేయబడ్డ కృతి. సర్వం శివకృపే.